


నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190

నవచేతన పబ్లిషింగ్ హౌస్

ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


మరింత దిగజారిన లింగ అంతరం : జిడిపికి అపారనష్టం!

ఇరాన్‌తో సుదీర్ఘ యుద్ధం ఉండదు త్వరలో లక్ష్యాలు సాధిస్తాం : నేతన్యాహూ

సిరియా చర్చ్‌లో ఇస్లామిక్ జీహదీ ఆత్మాహుతి దాడి : 22 మంది మృతి

లోపలి పేజీల్లో


సంపుటి 28, సంచిక: 05 | మంగళవారం | 24-06-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


# గోదావరి నదీ జలాల్లో ఒక్క చుక్కనూ వదులుకోం




రాష్ట్ర వాటాకోసం ఎంతదూరమైనా పోరాటం

ప్రాజెక్టులపై గత ప్రభుత్వం అనుసరించిన విధానం, ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న ప్రయత్నాలను జులై మొదటివారంలో ప్రజాప్రతినిధులకు వివరణ

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంనాటి మంత్రివర్గ మినిట్స్, రిటైర్డ్ ఇంజనీర్లు, మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులను రాతపూర్వకంగా జస్టిస్ పిసి ఘోష్ కమిషన్‌కు అందజేయాలి

డిసెంబర్ 9వ తేదీలేపు అన్ని కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహం

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్ట్‌ను వ్యతిరేకించాలని, గోదావరి నది జలాలలో తెలంగాణ రాష్ట్ర వాటాలో ఒక్క నీటి బొట్టును కూడా వదులుకోబోమని, ఇందుకు అవసరమైతే ఎంతదూరమైనా పోరాటం చేయాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ప్రయత్నాలను జూలై మొదటి వారంలో ప్రజాప్రతినిధులకు వివరించాలని తీర్మానించింది. 'కాళేశ్వరం కమిషన్' విచారణ నేపథ్యంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రివర్గ మినిట్స్, రిటైర్డ్ ఇంజనీర్లు, మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులను జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌కు పూర్తి వివరాలను రాత పూర్వకంగా అందజేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర నూతన క్రీడా విధానాన్ని మంత్రివర్గం ఆమోదించింది. డిసెంబర్ 9వ తేదీలోపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌లలో 'తెలంగాణ తల్లి విగ్రహాన్ని'' ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పొందుపర్చిన రెండు రాష్ట్రాలకు సంబంధించి ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్న అంశాలపై ఉన్నతస్థాయి కమిటీలో చర్చించాలని

తరువాయి 2లో




ఇరాన్‌పై అమెరికా దాడిని మోదీ ఎందుకు ఖండించడం లేదు? 'ఇరాన్‌పై అమెరికా బాంబుల దాడిని ఖండిస్తూ భారత ప్రధాని మోదీ ఒక్క పదం కూడా మాట్లాడడలేదు. కేవలం ఉద్రిక్తతలు పెరగొద్దు, చర్చలు జరగాలి, యుద్ధం ఆగాలని మాత్రమే ఇరాన్ ప్రభుత్వ వర్గాలతో అన్నారు. మోదీ తన ప్రియమిత్రుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఫోన్ చేసి, ఇరాన్‌పై బాంబుల దాడిని ఆపాలి. అది యుఎన్ ఛార్టర్ ఉల్లంఘన అని చెప్పాలి. ప్రధాని భారత నైతిక అధికారాన్ని ప్రదర్శించి, ప్రజలపై ఇజ్రాయెల్, అమెరికా యుద్ధాన్ని కొనసాగించడాన్ని ఖండించాలి. పాలస్తీనాలో అమాయక చిన్నారులు, మహిళలను ఆకలితో చంపేస్తుండడంపై ఇజ్రాయెల్‌ను మోదీ ఎందుకు అడగడం లేదు.'

– ఎఎన్ఐ వార్తా సంస్థతో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

నేడు వామపక్షాల

## రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇరాన్‌పై అమెరికా బాంబుదాడులకు పాల్పడాన్ని ఖండిస్తూ అఖిల భారత వామ పక్ష పార్టీలు దేశ వ్యాపితంగా నిరసనలో భాగంగా నేడు (మంగళవారం) రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు


తరువాయి 2లో

# ఇరాన్ ప్రతీకారం

ఖతార్‌లోని అమెరికా సైనిక స్థావరంపై మిసైల్స్

శక్తివంతమైన క్షిపణులను ప్రయోగించినట్లు ఐఆర్‌జిసి ప్రకటన





## భీకర పోరు

- ఇజ్రాయెల్‌పై విరుచుకుపడిన ఇరాన్
- హైఫా, టెల్ అవివ్ నగరాలపై క్షిపణులు, డ్రోన్‌లతో పెద్ద ఎత్తున దాడి
- టెహ్రాన్‌పై బాంబు దాడులు కొనసాగించిన ఇజ్రాయెల్


02

**దోహా :** ఇరవై నాలుగు గంటల్లో ఇరాన్ ప్రతీకార దాడిని ప్రారంభించింది. తమ దేశంపై భారీ బాంబులతో దాడి చేసిన అమెరికాకు చెందిన సైనిక స్థావరంపై విరుచుకుపడింది. ఖతార్ రాజధాని దోహాలోని అల్ ఉదైద్ ఎయిర్ బేస్‌పై ఇరాన్ సోమవారం రాత్రి క్షిపణి దాడులు చేసింది. ఆ ఎయిర్‌బేస్‌లో అమెరికా సైనిక స్థావరం ఉంది. తామే ఈ దాడులకు పాల్పడినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి) అధికారికంగా ధృవీకరించింది.ఈ విషయాన్ని ఇరాన్‌కు చెందిన తస్నీమ్ అనే వార్తా సంస్థ వెల్లడించింది. దీనికి 'ఆపరేషన్ బషరత్ అల్–ఫత్' (ఆపరేషన్ విజయ ప్రకటన) అని నామకరణం చేశారు. కాగా దోహాపై ఇరాన్ ఆరు క్షిపణులను ప్రయోగించినట్లు ఇజ్రాయెల్ అధికారి ఒకరు తెలిపినట్లు 'ఆక్సియోస్' వార్తా సంస్థ తెలిపింది. ఇరాన్ ప్రతీకార దాడితో క్షిపణి దాడులకు ముందే ఎవరూ తమ నివాసాలను తమ దేశ పౌరులు, పర్యాటకుల భద్రత దృష్ట్యా వాయు మార్గాలను మూసివేస్తున్నట్లు ఖతార్ ప్రకటించింది. వదిలి బైటకు రావొద్దని, సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని ఖతార్‌లోని తమ పౌరులకు బ్రిటీష్, అమెరికా ఎంబసీలు హెచ్చరించాయి. తీవ్రంగా ఖండించిన ఖతార్: ఇరాన్‌కు ఖతార్ మిత్రదేశం. తమ ఎయిర్ బేస్‌పై దాడిని ఖతార్ తీవ్రంగా ఖండించింది. తమ సార్వభౌమత్వాన్ని పూర్తి స్థాయిలో విఘాతం కలిగించినట్లు మండిపడింది. దీనికి ఇరాన్ జాతీయ భద్రతా మండలి ప్రతిస్పందిస్తూ తమ దాడి మిత్ర, సోదర దేశమైన ఖతార్‌కు, ఆ దేశ ప్రజలకు ముప్పు కలిగించేది కాదని, ఆ దేశంతో చారిత్రిక సంబంధాలను యథాతథంగా కొనసాగిస్తామని పేర్కొంది. కాగా ఖతార్ ఉంటున్న భారతీయులు జాగ్రత్తగా ఉండాలని, ఇళ్ళు వదిలి బైటికి రావొద్దని, ఖతార్ ప్రభుత్వ వర్గాల మార్గదర్శకాలను అనుసరించాలని ఖతార్‌లోని భారత ఎంబసీ అప్రమత్తం చేసింది. కాగా, పశ్చిమాసియాలో సుమారు 19 అమెరికా సైనిక శిబిరాలలో, సుమారు 40 వేలకు పైగా ఆ దేశ సైనికులు ఉంటారని భావిస్తున్నారు. దోహాలోనే అత్యధికంగా 13వేల మంది ఉన్నారని అంచనా.

స్థానిక ఎన్నికల కేసులో

## తీర్పు వాయిదా

- ఏడాదిన్నరగా ఏం చేస్తున్నారని హైకోర్టు ప్రశ్న
- బిసి రిజర్వేషన్ల ఖరారుకు గడువు కావాలి : ప్రభుత్వం
- రాష్ట్రం రెడీ చేస్తే ఎన్నికలు నిర్వహిస్తాం : ఎన్నికల సంఘం
- సర్పంచ్ పదువుల్లో కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వండి :పిటిషనర్లు



ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రామ సర్పంచు పదవులకు ఎన్నికలు ఎప్పటిలోగా నిర్వహిస్తారని, వాటి పదవీ కాలం ముగిసి 18 నెలలు అయ్యిందని, ఏడాదిన్నర కాలంగా ఎన్నికలు నిర్వహించకుండా ఏం చేస్తున్నారని

తరువాయి 2లో



## 9 రోజుల్లోనే రూ.9000ల కోట్లు

- రైతు ఖాతాల్లో 'భరోసా' నిధులు జమ
- కోటిన్నర ఎకరాలకు పంపిణీ
- తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రికార్డు
- ఇది ప్రజాప్రభుత్వం సాధించిన ఘనత
- ఉప ముఖ్యమంత్రి భట్టి వెల్లడి
- నేడు రైతు భరోసా విజయోత్సవ సభ : మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కేవలం 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసాను రైతులకు అందించడం తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఇదో రికార్డు అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని అనేక సంక్షేమ పథకాలను ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గాంధీ భవన్ లో జరిగిన సమావేశంలో ఉపముఖ్యమంత్రి మాట్లాడు మహిళలకు ఉచిత బస్సు, రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ, రైతులకు

తరువాయి 2లో

# నరమేధం వెంటనే ఆపాలి




- ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పోరాటాలు తీవ్రతరం చేస్తాం
- సహజ వనరుల దోపిడీని అడ్డుకున్నందుకే మావోయిస్టులు, ఆదివాసీల హత్యలు
- ఎఐవైఎఫ్ ఛలో రాజ్ భవన్.. నేతల అరెస్ట్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న భయంకరమైన నరమేధ చర్యలు వెంటనే ఆపాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ చౌరస్తా నుండి రాజ్ భవన్‌కు ర్యాలీగా వెళ్తున్న కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు, ఎఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. తోపులాటలో పలువురు నాయకులకు గాయాలు అయ్యాయి. ఆందోళన కారులను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి, పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర మాట్లాడుతూ దండకారణ్యం తుపాకుల గర్జనతో దద్దరిల్లుతున్నదన్నారు. మావోయిస్టులతో

తరువాయి 12లో






# రిటైర్డ్ ఉద్యోగుల పునర్నియామకమా?



- రైల్వే శాఖపై తీవ్రంగా మండిపడిన అమర్‌జీత్ కౌర్
- సి,బి గ్రేడ్ ఉద్యగులనూ కాంట్రాక్టుపై తీసుకోవడమేమిటి?
- ఇది నిరుద్యోగ యువతకు శరాఘాతం
- తక్షణమే నియామకాలు చేపట్టాలని ఎఐటియుసి డిమాండ్

**న్యూఢిల్లీ :** పదవీ విరమణ చేసిన అధికారులనే కాకుండా, గ్రూప్ సి, బి పోస్టులతో సహా నాన్ గెజిటెడ్, పారిశ్రామిక ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో తిరిగి నియమించుకోవాలనే నిర్ణయాన్ని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ తీవ్రంగా ఖండించారు. దేశంలో కోట్లాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో 1 నుంచి 9 పే లెవల్ రిటైర్డ్ ఉద్యోగులను తిరిగి నియమించుకోవాలని రైల్వే బోర్డు విధాన పత్రాన్ని విడుదల చేయడం ఆందోళన కలిగిస్తుందని, ఇది వారి పాలిట శరాఘాతమని ఒక ప్రకటనలో అన్నారు. దేశంలోని

తరువాయి 2లో



రికార్డు స్థాయిలో

## ప్లాట్ల ధరలు

- గచ్చిబౌలి ప్రాంతంలో ఒక్కోప్లాట్‌కు రూ.33 కోట్లు
- 11 ప్లాట్లకు రూ.65.02 కోట్ల ఆదాయం
- హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూముల బహిరంగ వేలం

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని హౌజింగ్ బోర్డుకు చెందిన భూముల బహిరంగ వేలంలో మరోసారి రికార్డు స్థాయి ధరలు పలికాయి. గచ్చిబౌలి ప్రాంతంలోని ఒక కమర్షియల్ ప్లాట్‌కే ఏకంగా రూ.33 కోట్ల ధర పలికింది. మొత్తం 11 ప్లాట్లను హౌజింగ్ బోర్డ్ వేలం వేయగా రూ.65.02 కోట్ల మేర ఆదాయం వచ్చింది. హైదరాబాద్‌లోని మరో ప్రాంతంలో రూ.13.51 కోట్ల ధరకు చేరుకున్నది. రెండు ఎంఐజి

తరువాయి 12లో

# ఊరించి... ఉసూరుమనిపించి..

- వానలు లేక ఎండుతున్న మొలకలు
- పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతులకు తీవ్ర నష్టం
- పంట దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం



ప్రజాపక్షం/హైదరాబాద్

నైరుతి రుతుపవనాలు ముందుగా వచ్చేయడంతో రైతులు మురిసిపోయారు. ముందుగా రావడమే కాకుండా ఈసారి సమృద్ధిగా వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో మే నెల చివరి వారంలోనే ఏరువాక మొదలు పెట్టారు. రుతు పవనాల ఆగమనంతో ఊరించిన వర్షాలు ఆ తర్వాత మోహం చాటేయడంతో రైతులు ఉసూరుమంటున్నారు. జూన్ చివరి వారం మొదలైనా వర్షపు చుక్క జాడ లేకపోవడం, ఈ ప్రకృతి వైపరీత్యంతో సాగునీరు లేక అన్నదాతలు అల్లాడుతున్నారు. మరికొన్ని రోజులు పరిస్థితి ఇలాగే ఉంటే వేసిన పంటలు మొత్తానికే నష్టపోవడమో, మొక్కల ఎదుగుదల లేక దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఈ ఏడాది సుమారు 1.37 కోట్ల ఎకరాల్లో పంట సాగు**

ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.37 కోట్ల ఎకరాల్లో వివిధ పంటల సాగు కానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో సింహభాగం వరి పంట సాగు కానుండగా రెండవ స్థానంలో పత్తి పంట సాగు అవుతున్నది. అయితే వరికి సంబంధించి నారు మళ్ల తర్వాత జూలైలో వరి నాట్లు ఊపుందుకోనుండగా, వాణిజ్య పంటలకు సంబంధించి మే నెల చివరిలో కురిసిన తొలకరితోనే ఏరువాక ప్రారంభమైంది. ముందస్తు వర్ష సూచనతో ఈ ఖరీఫ్‌లో వివిధ జిల్లాల్లో రైతులు వాణిజ్య పంటలైన పత్తి, కంది, సోయాబిన్, మొక్కజొన్న, పెసర, జొన్న, వేరు శనగ, మినుము, ఆముదం, సజ్జలు, రాగులు, నువ్వులు, పొద్దు తిరుగుడు తదితర పంటలను సాగు చేశారు. ఇందులో

తరువాయి 12లో

రాష్ట్రంలో ఉపాధి హామీ

## జోరందుకుంది




కేంద్రం కేటాయించిన ఆరున్నర కోట్ల పనిదినాల్లో 4.58 కోట్ల పనిదినాలు పూర్తి

గతం మాదిరిగా 12 కోట్ల పనిదినాలు కేటాయించాలని కేంద్రప్రభుత్వానికి మంత్రి సీతక్క లేఖ


ఈ ఏడాది ఇప్పటివరకు 18.9 లక్షల కుటుంబాల్లోని 28.48 లక్షల మందికి పని

06



# ప్రపంచం
WORLD NEWS

## కీవ్‌పై రష్యన్ డ్రోన్ల వరద : పదిమంది మృతి



**కీవ్ :** ఉక్రేన్ దేశ రాజధాని కీవ్ నగర ప్రాంతంలో రష్యా సోమవారం చేసిన గగనతల దాడుల్లో పదిమంది పౌరులు మరణించారు. అనేకమంది గాయపడ్డారు. ఉక్రేన్ హోం శాఖామంత్రి ఇహోర్ క్లైమెంకో చెప్పారు. క్షిపణులు, డ్రోన్లతో రష్యా రాత్రికి రాత్రి ఈ దాడులు చేసిందని సోషల్ మీడియా వేదిక గా ఈ ప్రకటన చేశారు. సంబంధిత బాధితుల వీడియోలను కూడా పోస్టు చేశారు. ఈ దాడుల్లో భూగర్భ మెట్రోస్టేషన్ ప్రవేశద్వారం కూడా ధ్వంసమైంది. అదే విధంగా దక్షిణ ఉక్రేన్‌లోని బిలాట్సెర్వ్కా ప్రాంతంలో డ్రోన్ ఒకటి ఆసుపత్రి భవనాన్ని ధ్వసం చేయడంలో ఒక రోగి మరణించాడు. మరణించిన వారిలో ఆరుగురు పౌరులు బహుళ అంతస్తుల భవనంలో నిద్రలో ఉన్నవారే.

ఇటీవలి వారాల్లో ఉక్రేన్‌పై రష్యా తన దాడులను విపరీతంగా ఉధృతం చేసింది.

## ఇరాన్ పాలనమార్పుపై
# ట్రంప్ ప్రకటనకు వైట్‌హౌస్ వివరణ



**వాషింగ్టన్ :** ఇరాన్ ప్రభుత్వ పరిపాలనలో మార్పు సాధ్యమేనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనకు వైట్‌హౌస్ వివరణ ఇచ్చింది. ఇరాన్ పాలనమార్పును తాము కోరుకోవడంలేదని వైట్‌హౌస్ ప్రకటించింది. అమెరికా దౌత్య చర్యలు చేపట్టినప్పటికీ పదే పదే ఇరాన్ గనుక తిరస్కరిస్తే, ఎందుకు ఇరాన్ ప్రజలు ఉగ్రవాద పాలకుపై తిరగుబాటు చేయకూడదు, పాలనామార్పు కోరుకోకూడదన్నది ట్రంప్ మాటలలోని అంతరార్థమని వివరణ ఇచ్చింది. అణు శుద్ధి కేంద్రాలు, అణ్వాయుధ తయారీ కేంద్రాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని, ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చాలన్నది తమ ఉద్దేశం కాదని మొదట చెప్పిన ట్రంప్ తర్వాత ''ఇరాన్‌లో పరిపాలన మార్పు అనే మాటను రాజకీయంగా ఉపయోగించడం సరైనది కాకపోవచ్చు, కానీ ఇరాన్‌లో ప్రస్తుతం ఉన్న పాలకులు గనుక ఆ దేశాన్ని ''మిగా'' (మేక్ ఇరాన్ గ్రేట్ ఎగైన్) గా మార్చలేకపోయినప్పుడు ఎందుకు అక్కడ పరిపాలనలో మార్పు రాకూడదు?''అని ప్రశ్నించారు. ఇరాన్‌లో పరిపాలన మార్పు జరుగుతుందని ఆయన పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. దీనిపై వైట్‌హౌస్ మళ్ళీ తాజా వివర ణ ఇచ్చింది.

## సిరియా చర్చ్‌లో ఇస్లామిక్ జీహదీ ఆత్మాహుతి దాడి : 22 మంది మృతి



**డమాస్కస్ :** సిరియాలో మళ్ళీ ఇస్లామిక్ స్టేట్ జీహదీ ఉగ్రవాదుల దాడులు ప్రారంభమయ్యాయి. దేశ రాజధాని డమాస్కస్‌కు సమీపంలో ఉన్న డ్వీలా నగరంలోని ఒక చర్చిలో జరిగిన ఆత్మాహుతి బాంబు పేలుడులో 22 మంది మరణించారు. మరో 52 మంది గాయపడ్డారు. గత ఏడాది డిసెంబరులో ఇరాన్ అనుకూల అధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ పదవీచ్యుతుడైన తర్వాత సిరియాలో అమెరికా అనుకూల ప్రభుత్వం ఏర్పడింది. ఇరాన్‌పై అమెరికా బి–2 స్టీల్త్ బాంబరు యుద్ధ విమానాలు మూడు కీలక అణుస్థావరాలను ధ్వంసం చేసిన తర్వాత కొద్ది గంటలకే సిరియాలో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు సిరియా నగరం డ్వీలాలోని చర్చిపై ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. అల్ అస్సాద్ పదవీచ్యుతుడైన తర్వాత సిరియాలో శాంతియుత పరిస్థితులు నెలకొన్నాయనుకున్న సమయంలో ఇరాన్‌పై దాడులవల్ల ఈ ఘటన సంభవించింది. డ్వీలాలోని గ్రీకు ఆర్థోడాక్స్ చర్చ్ గురువు ఎలియాస్‌పై మొదట కాల్పులు జరిపాడు. తర్వాత ఆత్మాహుతి బాంబుదాడికి పాల్పడినట్లు సిరియా ఆరోగ్య మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఆదివారం సాయంత్రం ప్రార్థనల సందర్భంగా చర్చిలో ఈ ఘటన జరిగింది. ఒక వ్యక్తి ఆకస్మికంగా చర్చ్‌లోకి ప్రవేశించి కాల్పులు ప్రారంభించాడని, ఆతడిని వారించే ప్రయత్నం చేయబోగా ఆత్మాహుతి బాంబు బటన్ నొక్కి తనను తాను పేల్చుకుని భారీ పేలుడుకు పాల్పడ్డాడని ప్రత్యక్ష సాక్షి లారెన్స్ మామరి చెప్పారు. ఇరాన్ అనుకూల అల్ అస్సాద్ సిరియాను 13 సంవత్సరాలు పరిపాలించిన సమయంలో అతి దారుణమైన హింసాకాండ, అంతర్యుద్ధం దేశంలో కొనసాగాయి.

# ఇరాన్‌తో సుదీర్ఘ యుద్ధం ఉండదు



## త్వరలో లక్ష్యాలు సాధిస్తాం : నేతన్యాహూ

**టెల్‌అవీవ్ :** ఇరాన్‌తో సుదీర్ఘమైన యుద్ధం ఉండదని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నేతన్యాహూ ప్రకటించారు. తమ లక్ష్యాలను సాధించే వరకూ యుద్ధం చేస్తామని అన్నారు. తమ దేశాన్ని తుడిచిపెట్టాలని గడచిన పది సంవత్సరాలుగా ఇరాన్ ప్రభుత్వం ఉద్ధృత సన్నాహాలు చేస్తున్నందువల్లనే మనుగడకోసం తాము లక్ష్యాలను నిర్దేశించుకుని దాడులు చేశామని అన్నారు. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' మేరకు ఇజ్రాయెల్ అనుకున్న లక్ష్యాలను త్వరలోనే చేరుకుంటుందని చెప్పారు. ముందుగా రికార్డు చేసిన ఆయన సంభాషణను, చెప్పాల్సిన విషయాలను మీడియాకు సోమవారం విడుదల చేశారు. అంచెలంచెలుగా తమ లక్ష్యాలను చేరుకుంటున్నా మన్నారు. ''ఫోర్డో అణు స్థావరంపై అమెరికా దాడి చేసింది, ఇప్పుడు మాకు ఆ భయం పోయింది, కొంతధీమా వచ్చింది, ఇరాన్‌తో ఇజ్రాయెల్ యుద్ధం ఊబిలో కూరుకుపోదు, యుద్ధం కొనసాగించదు, లక్ష్యాల సాధనమేరకే మా యుద్ధం పరిమితం, అప్పటిదాకా యుద్ధం ఆగదు, అదేసమయంలో గాజా నుండి మా దృష్టిని ఎటువైపుకూ మళ్ళించడంలేదు, ఇరాన్‌లో చేసిన దాడులవల్ల గాజాలో లక్ష్యాలు నెరవేరతాయి, ఇరాన్ సహాయం లేకుండా గాజాలో అవన్నీ కూలిపోతాయి, ఇరాన్‌లో సగానికి పైగా బాలిస్టిక్ క్షిపణి లాంచర్‌లను లేకుండా చేశాం, ఇక భవిష్యత్తులో గతంలో చేసుకున్న అబ్రహాం ఒప్పందాలను విస్తరించడానికి అవకాశాలు వస్తాయి, మధ్యప్రాచ్యంలో కొత్త అవకాశాలను మనం చూస్తాం, అద్భుతమైన సహాయ సహకారాలను, మార్పులను మనం చూడగలుగుతాం, మధ్యప్రాచ్యానికి మంచి భవిష్యత్తు, ఆర్థిక ప్రగతి ఉంది'' అని నేతన్యాహూ చెప్పారు.

**కవ్వింపులేని దురాక్రమణ అన్యాయం:పుతిన్**

ఎలాంటి కవ్వింపు చర్యలూ లేకపోయినప్పటికీ ఇజ్రాయెల్ దాడులు చేయడాన్ని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఖండించారు. ఇరాన్ ప్రజలకు వీలైనంతవరకూ తాము సహాయం చేసేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. ప్రస్తుతం మాస్కో పర్యటనలో ఉన్న ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి పుతిన్‌ను కలుసుకుని ఇరాన్‌లో పరిస్థితులను, ఇజ్రాయెల్, అమెరికా దురాక్రమణ చర్యలను వివరించారు. ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు ఎంతమాత్రం సమర్థనీయం కాదు, ఇరాన్ ఎలాంటి కవ్వింపు చర్యలకూ పాల్పడటంలేదు, అందువల్ల ఈ విషయంలో ఇరాన్ ప్రజలకు సాయం చేసేందుకు మేం కృషి చేస్తాం'' అని పుతిన్ చెప్పారు. అంతర్జాతీయ చట్టాలను అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఉల్లంఘించాయని అన్నారు.

## మధ్యాసియాలో భయంకరమైన మలుపు : భద్రతామండలిలో గుటెర్రెస్

**న్యూయార్క్ :** ఇరాన్‌పై అమెరికా బాంబుల దాడి చర్యలు మధ్యప్రాచ్యంలో భయంకరమైన మలుపు అని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ అన్నారు. అణ్వాయుధ నిరోధక ఒప్పందాన్ని మనం సంపూర్ణంగా గౌరవించి తీరాలన్నారు. భద్రతామండలి అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు.

15 సభ్యదేశాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అణు స్థావరాలపై బాంబుదాడులు చేయడంతో మధ్యప్రాచ్యంలో చరిత్ర కొత్త మలుపు తీసుకుంది, ఇది భయానకమైన, ప్రమాదకరమైన మలుపు, ఇప్పటికే ఈ ప్రాంతం అల్లకల్లోలంగా ఉంది, మధ్యప్రాచ్యంలో సైనికచర్యలను, సైన్యం మోహరింపు చర్యలను నేను పదే పదే అనేకసార్లు ఖండిస్తూ వస్తున్నా''అని గుటెర్రెస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం లో ప్రజలు ఇప్పటికే కష్టాల ఊబి లో కూరుకున్నారని, ఇక మరో విధ్వంసాన్ని చవిచూసేందుకు వారు సిద్ధంగా లేరని, అందు కు తగిన శక్తిసామర్థ్యాలు అక్కడ ప్రజలకు లేవని అన్నారు. ప్రతీకారం తర్వాత ప్రతీకారం దాడుల ప్రమాదంతో పరిస్థితి క్షీణించిపోతోందన్నారు.

## రాష్ట్రవ్యాప్త ఆందోళనలు
(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాలని తెలంగాణ వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, ప్రజాతంత్రవాదులు, ప్రపంచ శాంతి కోరుకునే వారు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కూనంనేనీ సాంబశివరావు (సిపిఐ), జూాన్ వెస్లీ (సిపిఎం), పి.సూర్యం (సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ), పోటు రంగా రావు (సిపిఐ ఎంఎల్ మాస్ లైన్,) గాదగోని రవి (సిపిఐయు), మా మిండ్ల రమేష్ రాజా (సిపిఐ ఎంఎల్ లిబరేషన్), సిహెచ్ మురహరి (ఎస్‌యుసిఐ(సి), జానకి రాములు (రివల్యూషనరీ సోషియస్ట్ పార్టీ), బి. సురేందర్ రెడ్డి (ఫార్వర్డ్ బ్లాక్,) ప్రసాద్ అన్న (సిపిఐ ఎంఎల్) సమిష్టిగా ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అంతర్జాతీయ చట్టాలను బేఖాతరు చేసి ఇరాన్ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేలా అమెరికా దాడులకు పాల్పడడం గర్హ నీయమన్నారు. అణ్వాయుదాలు తయారు చేస్తున్నద నెపంతో ఇరాన్‌పై అమెరికా దాడికి పూనుకోవడం ఉద్రిక్తతలను రెచ్చగొట్టడమేనని వారు పేర్కొన్నారు. సా మ్రాజ్యవాద అమెరికా దుశ్చర్యను భారత ప్రభుత్వం ఖండించాలని, అమెరి కా ఇజ్రాయిల్ అనుకూల విదేశాంగ విధాన వైఖరిని విడనాడి, యుద్ధాన్ని ఆపడంలో భాగస్వామి కావాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు.

## పునర్నియామకమా?
(మొదటి పేజీ తరువాయి)

'యువశక్తి'ని తాము పట్టించుకుంటామని చెప్పుకునే బిజెపి ప్రభుత్వం, అన్యాయంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను దూరం చేస్తోందని మండిపడ్డారు. రైల్వేలలో దాదాపు 3 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, రైల్వే రన్నింగ్ లైన్స్, ఆపరేషన్స్, రైల్వే వర్క్‌షాప్‌లు, ప్రొడక్షన్ యూనిట్లలో ఖాళీగా ఉన్న ఈ పోస్టులను భర్తీ చేయడానికి రైల్వే మంత్రిత్వ శాఖ పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైల్వేలలో భద్రతకు సంబంధించిన విభాగాలు అత్యంత ప్రమాదంలో ఉన్నాయని, లోకో పైలట్లు రోజుకు 12 నుండి 14 గంటలు పని చేయాల్సి వస్తోందని, వారు పని భారం తగ్గించాలని కోరుతున్నారని తెలిపారు.

**కేంద్ర ప్రభుత్వంలో 15 లక్షల ఖాళీలు**

కేంద్ర ప్రభుత్వంలో మాత్రమే రైల్వేలు, రక్షణ, పోస్టల్, ఇతర విభాగాలలో కలిపి 15 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అమర్‌జీత్ కౌర్ తెలిపారు. బ్యాంకులు సహా ప్రభుత్వ రంగ పరిశ్రమలలో దాదాపు 10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రస్తుత ఉద్యోగులు అదనపు పనిభారంతో సతమతమవుతున్నారని అన్నారు. పెద్ద సంఖ్యలో పెన్షనర్లను తిరిగి నియమించుకోవాలని రైల్వే బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని ఎఐటియుసి తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులను కాంట్రా క్టు ప్రాతిపదికన, నిర్ణీత కాలానికి నియమించుకోవడం వంటి అన్యాయమైన పద్ధతులను ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తక్షణమే ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయడానికి నియామక ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేస్తోంది. ఇందుకు పోరాటాన్ని ఉధృతం చేయాలని రైల్వే, అన్ని రం గాల ట్రేడ్ యూనియన్లకు ఎఐటియుసి పిలుపునిస్తోందని తెలిపారు.

## చుక్కనూ వదులుకోం
(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించింది. ప్రతినెలా రెండు సార్లు మంత్రి వర్గ సమావేశం నిర్వహించి, ఈ సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలు, అమలు తీరును ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షించనున్నారు.

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సచివాలయంలో జరిగింది. ఐదు గంటలకు పైగా జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి, పలు నిర్ణయాలు తీసుకున్నారు. రైతు భరోసా నిధులను విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు మంత్రులు ధన్యవాదాలు తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి మీడియాకు వెల్లడించారు.

**గత ప్రభుత్వ హయాంలోనే బనకచర్లకు శంకుస్థాపన**

**నేడు 'రైతు భరోసా విజయోత్సవ సభ' : మంత్రి పొంగులేటి**

గత ప్రభుత్వంలోనే బనకచర్ల ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన జరిగిందని, దీనిని కప్పిపుచ్చుకునేందుకు మసిపూసి మారేడుకాయ చేసేందుకు ఆనాటి సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు తహతహలాడుతూ, ఆ బనకచర్ల బంకను తమ ప్రభుత్వానికి రుద్దే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లను రైతు ఖాతాల్లో జమ చేసిన నేపథ్యంలో 'రైతు భరోసా విజయోత్సవ సభ'ను మంగళవారం సాయంత్రం 4 గంటలకు పండుగ వాతావరణంలో సచివాలయం ఎదురుగా వేలాది మంది రైతులతో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని దాదాపు 71 లక్షల మంది రైతులకు రైతు భరోసా సాయం అందించిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదేనన్నారు. 'రైతు భరోసా విజయోత్సవ సభ'ను రైతుల సమక్షంలోనే అన్ని జిల్లాల్లో రైతు వేదికలతో పాటు మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు, సంబరాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్టు తెలిపారు. ఈ సంబరాల్లో మంత్రులు, ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

**రాష్ట్ర జిడిపి ట్రిలియన్ డాలర్ల లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ 'విజన్ –2047' : మంత్రి పొన్నం ప్రభాకర్**

స్వాతంత్రం వచ్చిన 100 ఏళ్ల సందర్భంగా తెలంగాణ రైజింగ్ 'విజన్ –2047' పేరుతో తెలంగాణ ప్రభుత్వం ఓ లక్ష్యాన్ని నిర్ధేశించుకుని విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు దీనిని రానున్న డిసెంబర్ నుంచి అమలు చేయనున్నామని ఆయన వెల్లడించారు. 2047 విజన్‌లో భాగంగా అభివృద్ధిని వేగవంతం చేసేందుకు అన్ని రంగాలకు చెందిన నిష్ణాతుల సలహాలు సూచనలను ముందుకు సాగనున్నామని చెప్పారు. హుస్నాబాద్ శాతవాహనం విశ్వవిద్యాలయంలో లా, ఇంజనీరింగ్ కళాశాలలను అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసిందన్నారు. హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్‌కు సంబంధించి కంప్యూటర్ సైన్స్‌లో నాలుగు కోర్సులను ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈసిఈ, సిఎస్‌సి, ఐటి, ఎఐ ప్రతి సెక్షన్‌లో 60 మంది చొప్పున 240 మందికి 240 విద్యార్థులను చేర్చుకోనున్నామని తెలిపారు. కరీంనగర్‌లోని లా కళాశాలలో ఎల్‌ఎల్‌బి 60, ఎల్‌ఎల్‌ఎం 60 సీట్ల చొప్పున 120 సీట్లలో ప్రవేశం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. మహబూబ్‌నగర్‌లో బాసర ఐఐటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నిత్యం క్యాన్సర్ మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని చెప్పారు. ఇందులో భాగంగా తెలంగాణలో క్యాన్సర్ నివారణ, చికిత్సకుగాను పద్మ శ్రీ అవార్డు గ్రహిత డాక్టర్ నోరి దత్తత్రేయను సలహాదారుగా నియమించాలని మంత్రి వర్గం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్‌లొని ఎంఎన్‌జె ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేయడంతో పాటు కాన్సర్ చికిత్స, నివారణ కార్యక్రమాలను జిల్లాలకు విస్తరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

**2036 ఒలింపిక్స్‌లో సత్తా చాటడమే లక్ష్యంగా తెలంగాణ క్రీడా పాలసీ :మంత్రి వాకిటి శ్రీహరి**

ఒలింపిక్స్ 2036లో తెలంగాణ సత్తా చాట్టేలా క్రీడాకారులను సిద్ధం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం నూతన క్రీడా పాలసీకి మంత్రివర్గం ఆమోద ముద్ర వేసిదని క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. గ్రామ స్థాయిలో క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు క్రీడా హబ్ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు క్రీడాకారులకు పారితోషికాలను అందించేందుకు తెలంగాణ క్రీడాభివృద్ధి సంస్థకు నిధులు కేటాయించనున్నామని చెప్పారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి జిల్లా కలెక్టర్ల క్రూషియల్ బ్యాలెన్స్ ఫండ్ (సిబిఎఫ్)నిధుల నుంచి 10 శాతం నిధులను కేటాయించనున్నామన్నారు. తద్వారా కోచ్‌లను నియమించడంతో పాటు క్రీడా మైదానాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా క్రీడాకారులను పూర్తిగా ప్రోత్సహించనున్నామని చెప్పారు.

**మంత్రివర్గం తీసుకున్న మరిన్ని నిర్ణయాలు ఇవే..**

చట్టపరంగా, న్యాయపరంగా బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టాలని, అన్ని వేదికలను ఉపయోగించుకోవాలని మంత్రివర్గం తీర్మానించింది.

హైదరాబాద్ చుట్టూ నిర్మించబోయే రీజినల్ రింగ్ రోడ్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది. ఆర్ అండ్ బి విభాగం తయారు చేసిన మూడు ప్రతిపాదనలను పరిశీలించింది. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201 కిలో మీటర్ల పొడవు ఉండే అలైన్ మెంట్‌కు తుది ఆమోదం తెలిపింది. రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్న అంశాలపై రెండు తెలుగు రాష్ట్రాల ఉన్నతస్థాయి అధికారుల కమిటీ సమావేశంలో చర్చించాలని నిర్ణయం. తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన, ప్రణాళికల తయారీకి వివిధ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు, నిపుణులతో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు.

విజన్ డాక్యుమెంట్ తయారీకి నీతి అయోగ్‌తో పాటు, ఇండియన్ స్కూల్ అఫ్ బిజినెస్ రాష్ట్ర ప్రభుత్వానికి నాలెడ్జ్ పార్టనర్‌గా వ్యవహరిస్తారు. పరిపాలన సంస్కరణల్లో భాగంగా ప్రతి మూడు నెలలకోసారి కేబినెట్ మీటింగ్‌ను స్టేటస్ రిపోర్ట్ మీటింగ్‌గా నిర్వహించాలి. ఆ మూడు నెలల్లో జరిగిన కేబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలుపై యాక్షన్ రిపోర్ట్‌ను ఈ ప్రత్యేక భేటీలో సమర్పించాలని నిర్ణయం. ఈ మూడు నెలల ప్రత్యేక భేటీకి మంత్రివర్గంతో పాటు అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొంటారు. సంగారెడ్డి జిల్లాలో ఇంద్రేశం, జిన్నారం కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు. ఇస్నాపూర్ మున్సిపాలిటీని అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయం. అలాగే రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీల్లో కమిషనర్ల తో పాటు వివిధ విభాగాల్లో 316 పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం.

## తీర్పు వాయిదా
(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టు రాష్ట్రాన్ని ప్రశ్నించింది. గత ఏడాది జనవరిలో సర్పంచు పదవులు ఖాళీ అయ్యాయని, స్పెషల్ ఆఫీసర్ల పాలనలో గ్రామాలు ఉన్నాయని గుర్తు చేసింది. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన విచారణ సమయంలో రెండు నెలలు గడువు కోరిన ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ గడువు కోరడం ఏమిటని ప్రశ్నించింది. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ పలువురు మాజీ సర్పంచులు దాఖలు చేసిన పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు సోమవారం పూర్తి అయ్యాయి. దీంతో తీర్పును వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ మాధవీదేవి వెల్లడించారు. నల్లగొండ జిల్లా మల్లెపల్లి సర్పంచ్ పార్వతి, కుర్మపల్లి సర్పంచ్ శ్రీనివాస్, జనగాం జిల్లా కాంచనపల్లి సర్పంచ్ విజయ, నిర్మల్ జిల్లా తల్వెడ సర్పంచ్ అనిల్‌కుమార్, కరీంనగర్ జిల్లా చంగర్ల సర్పంచ్ వేణుగోపాల్, నిజయతీగూడెం సర్పంచ్ మురళీధర్ వేసిన పిటిషన్లపై తీర్పును వాయిదా వేశారు. పిటిషనర్ల అడ్వొకేట్ భాస్కర్ రెడ్డి వాదిస్తూ . 2024, జనవరి 31తో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిందన్నారు. ఏడాదిన్నర కాలంగా ఎన్నికలు నిర్వహించలేదన్నారు. గడువు అయిన ఆరు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగంలోని 243ఈ, 243కే అధికరణాలను పాలకు ఉల్లంఘించారన్నారు. అంతేకాకుండా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం–2018 నిబంధనలు నిర్ధేశిస్తున్నాయన్నారు. ఈ నిబంధనలను ప్రభుత్వం ఉల్లంఘించిందన్నారు. సర్పంచుల పదవీ కాలం ముగిసి ఏడాదిన్నర కాలం అవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలనలో సమస్యలు పేరుకపోతాయని చెప్పారు. సమస్యలు పరిష్కారం చేయడంలో తీవ్ర జాప్యం అవుతోందన్నారు. గ్రామాల్లో పనులు చేపట్టేందుకు రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులను అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో పలు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు సర్పంచులుగా తమ సొంత డబ్బులు ఖర్చు చేశారన్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు ఇంకా గడువు కావాలనే యోచనలో ప్రభుత్వం ఉంటే ఎన్నికలు ఎన్విహించే వరకు సర్పంచ్‌లకు పాలనా బాధ్యతలు అప్పగించేలా మధ్యంతర ఆదేశాలు వెలువరించాలని కోరారు. గత డిసెంబర్‌లో జరిగిన విచారణ సందర్భంగా ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా తేదీలు వెల్లడిస్తామని రాష్ట్రప్రభుత్వం చెప్పినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఏర్పాట్లు చేయకపోయినప్పటికీ రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు అధికారం ఉందన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను ఫైనలైజ్ చేసేందుకు మరో 30 రోజుల సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ కోరారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ తరఫున సీనియర్ అడ్వొకేట్ విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ, రాష్ట్రం నుంచి అన్ని ఏర్పాట్లు జరిగితే, ఎన్నికల నిర్వహణకు తమకు రెండు నెలల గడువు కావాలన్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కూడా సిద్ధంగా ఉందన్నారు. పిటిషనర్ల తరఫు అడ్వొకేట్ భాస్కర్ రెడ్డి వాదదనలు వినిపిస్తూ, సర్పంచ్ పదవీకాలం 2024, జనవరి 31తో ముగిసిందని, ఏడాదిన్నరకాలంగా ఎన్నికలు పెట్టలేదన్నారు. పదవీ కాలం అయ్యాక ఎన్నికలు నిర్వహించకపోవడం రాజ్యాంగంలోని 243ఈ, 243కే అధికరణాలను, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం–2018 నిబంధనను ఉల్లంఘించినట్లేనని చెప్పారు. వాదనలపై స్పందించిన హైకోర్టు, ఏడాదిన్నర కాలంగా ఎన్నికలు జరపకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. ప్రభుత్వం ఆలస్యం చేస్తే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్నికలు నిర్వహించే అధికారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఉంది కదా అని హైకోర్టు ప్రశ్నించింది. ఇరువైపులా వాదనలు ముగియడంతో గ్రామపంచాయతీ ఎన్నికలు సకాలంలో నిర్వహించాలని దాఖలైన పిటిషన్లపై తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. 2024 జనవరి 31న సర్పంచుల పదవీకాలం ముగిసినా ఎన్నికలు జరపట్లేదంటూ నల్గొండ, నిర్మల్, జనగాం, కరీంనగర్ జిల్లాకు చెందిన ఆరుగురు వేసిన పిటిషన్లపై తీర్పును వాయిదా వేసింది.

# భీకర పోరు

● ఇజ్రాయెల్‌పై విరుచుకుపడిన ఇరాన్ ● హైఫా, టెల్ అవివ్ నగరాలపై క్షిపణులు, డ్రోన్‌లతో పెద్ద ఎత్తున దాడి ● టెహ్రాన్‌పై బాంబు దాడులు కొనసాగించిన ఇజ్రాయెల్

**దుబాయ్:** తమ దేశ అణు కేంద్రాలపై అమెరికా బాంబు దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య పరస్పర దాడులు తీవ్రమయ్యాయి. సోమవారం నాడు ఇజ్రాయెల్‌పై ఇరాన్ విరుచుకుపడింది. హైఫా, టెల్ అవివ్ నగరాలపై క్షిపణులు, డ్రోన్‌లతో పెద్ద ఎత్తున దాడి చేసినట్లు ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రకటించింది. ఆపరేషన్ 'ట్రూ ప్రామిస్ 3' పేరుతో ఇరాన్ ఈ ఆపరేషన్‌ను చేపట్టింది. జెరూసలెంలో కూడా భారీ పేలుళ్ళు వినిపించినట్లు వార్తలు వచ్చాయి. మరోవైపు టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ బాంబు దాడులను కొనసాగించింది. అమెరికా బాంబులతో దెబ్బతిన్న ఫోర్డో అణుశుద్ధీకరణ కేంద్రాన్ని చేరుకునేందుకు వీలు లేకుండా రహదారులను ధ్వంసం చేసింది. అంతే కాకుండా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ప్రమాదకరమైన ఖైదీలను బంధించిన ఎవిన్ జైలుపై, రివల్యూషనరీ గార్డ్స్ పారా మిలిటరీ కేంద్రంపై దాడి జరిగినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. 'ఇజ్రాయెల్ గుమ్మం వద్ద దాడులు చేసిన ఇరాన్ నియంతను పూర్తి సామర్థ్యంతో శిక్షిస్తామని' తెలిపింది. కాగా పేలుడుకు అమెరికా ఉపయోగించిన భారీ మందుగుండు ఆధారంగా ఫోర్డో అణు శుద్ధీకరణ కేంద్రం వద్ద భారీ నష్టం సంభవించి ఉండవచ్చని భావిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి అనుబంధ అంతర్జాతీయ అణు శక్తి ఏజెన్సీ( ఎఐఇఎ) చైర్మన్ రాఫెల్ గ్రోస్సీ వియన్నాలో వెల్లడించారు. ఎవిన్ జైలుపై దాడిని ఖైదీల బంధువులు తీవ్రంగా ఖండించారు. తమ ప్రియతములైన కుటుంబ సభ్యులు ఏమైపోయారో తెలియక ఆందోళన వ్యక్తం చేశారు. పలు దేశాలకు చెందిన ఖైదీలు ఈ ఎవిన్ జైలులో బందీలుగా ఉన్నారు. ఈ జైలులో రాజకీయ ఖైదీలు ప్రధానంగా ఉన్నారు. పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్ ఈ జైలును నడుపుతోంది. ఈ జైలు తాలూకూ సమాచారాన్ని ఇరాన్ సర్వాధినేత ఖమేనికీ మాత్రమే నేరుగా తెలియజేస్తారు. ముఖ్యంగా అమెరికా, యూరోపియన్ యూనియన్‌లు విధించిన ఆంక్షలను లక్ష్యంగా చేసుకుని ఈ జైలును ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. జైలులో కొన్ని భాగాలు ధ్వంసమయ్యాయని, తర్వాత బృందాలు రంగంలోకి దిగి పరిస్థితిని నియంత్రించి వ్యవస్థను తమ అదుపులోకి తెచ్చుకున్నట్లు ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన వెబ్‌సైట్ ప్రకటించింది. శక్తిమంతమైన ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్ (ఐఆర్‌జిసి)కి చెందిన థార్ అల్లా కేంద్ర కార్యాలయ కమాండ్ సెంటర్‌పై గగనతల దాడులను, ఎవిన్ జైలుపై దాడులను పలు దేశాలు ఖండించాయి.



ఇదిలా ఉండగా, ఇరాన్ అణుస్థావరాలపై దాడిచేసిన అమెరికా ఎలాం టి అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించలేదని నాటో చీఫ్ మార్క్ రట్టో ప్రకటించారు. మరోవైపు చమురు ధరల పెరుగుదలపై ట్రంప్ ప్రకటన చేస్తూ ఈ ధరలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమ దృష్టి కేంద్రీకరించాలని కోరారు.

## రూ.9000ల కోట్లు (మొదటి పేజీ తరువాయి)

ఉచిత కరెంట్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, పేదలకు సన్నబియ్యం వంటి పథకాలను అమలు చేస్తోందని. రైతు భరోసాలో భాగంగా ఈ సీజన్ మొదలు కాగానే ఎకరాకు గతంలో రూ.10 వేలుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా రెండువేలు జోడించి.. రూ.12 వేలు ఇస్తున్నామని ఇందులో వాన పంట కాలనికీ గాను. కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రూ.6వేల చొప్పున రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. వ్యవసాయం యోగ్యమైన అన్ని భూములకు కేవలం 9 రోజుల్లోనే రైతు భరోసా వేయడం పూర్తి చేయడం జరిగింది. ఇంత తక్కువ కాలంలో రైతు భరోసాను పూర్తిగా వేయడం రాష్ట్ర చరిత్రలోనే ఇద తొలిసారని అన్నారు. కాంగ్రెస్ మండల కమిటీల ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో కేవలం 9 రోజుల్లో కోటిన్నర ఎకరాలకు సుమారు 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా నిధులను అందించిన విషయాన్ని వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించాలని డిప్యూటీ సిఎం కోరారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**నేడు రైతు భరోసా విజయోత్సవ సభ**

తెలంగాణ రైతులను రాజులుగా చూడాలన్నదే తమ ప్రభుత్వం లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతు భరోసాను విజయవంతంగా పూర్తి చేసిన నేపథ్యంలో నేడు బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం ఆవరణలో రైతు భరోసా విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.రైతు భరోసా విజయోత్సవ సభ ఏర్పాట్లుకు సంబంధించి సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖాల అధికారులతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తో పాటు సహచర మంత్రులందరూ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రైతుల వ్యవసాయ పనులకు తొలకరికి ముందుగానే రైతు భరోసాను కేవలం 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్లలను రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. రైతుల సంతోషాలు పంచుకోవడం కోసం రైతు నేస్తం వేదిక ద్వారా విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు , మంత్రి తెలిపారు. దేశంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రైతులకు రూ. 70 వేల కోట్లు రుణమాఫీ జరిగితే తెలంగాణలో ఇప్పుడు 25 లక్షల మంది రైతుల పంట రుణాలకు సంబంధించి రూ.21 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఏక కాలంలో చెల్లించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల నుండి రైతు భరోసా పొందిన లబ్ధిదారులు పాల్గొననున్న నేపథ్యంలో రైతులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని మంత్రి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, షామియానాలు, సీటింగ్ కెపాసిటీ, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ తదితరు అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తో కలిసి అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ అహమ్మద్ నదీమ్, హైదరాబాద్ కమిషనర్ పోలీస్ సివి ఆనంద్, అడిషనల్ డిజిలా అండ్ ఆర్డర్స్ ఎంఎం భగవత్, ట్రాన్స్‌పోర్ట్ శాఖ కమిషనర్ సురేందర్ మోహన్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్,ఐ అండ్ పి ఆర్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, ఉద్యాన శాఖ కమిషనర్ యాస్మిన్ భాష,ఎస్‌పిడిసిఎల్ ఎండి ముష్రాఫ్ అలీ, వ్యవసాయ, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## బస్తీ దవాఖానా ఉద్యోగులకు పెండింగ్ వేతనాల చెల్లింపునకు డిమాండ్

ప్రజాపక్షం/హైదారబాద్ : బస్తీ దవాఖానల్లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్స్, నర్సింగ్ ఆఫీసర్, సపోర్టింగ్ స్టాఫ్‌ల 4 నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్తీ బస్తీ దవాఖానలో కాంట్రాక్టు విధానంలో నియామకమైన సపోర్టింగ్ స్టాఫ్‌ను ఈ మధ్య కాలంలో ఏజెన్సీ లకు అప్పగించారని తిరిగి వారిని కాంట్రాక్టు విధానం తీసుకు రావడం లేక ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి కార్పొరేషన్ ద్వారా ప్రతినెల 1వ తేదీన బస్తీ దవాఖాన అన్ని క్యాడర్స్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేకపోతే రానున్న రోజుల్లో ఉద్యోగులు అందరితో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు.

### విత్తనోత్పత్తి రైతులకు

# నష్టపరిహారం చెల్లించండి

**రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి**



ప్రజాపక్షం/హైదరాబాద్ : జోగులాంబ గద్వాల్ జిల్లాలో పత్తి విత్తనోత్పత్తి చేసే రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సీడ్ కంపెనీలను రైతు కమిషన్ చైర్మన్ కొదండ రెడ్డి ఆదేశించారు. ఈ మధ్యకాలంలో గద్వాల్ జిల్లాలో విత్తనోత్పత్తి చేసే రైతులకు జిఒటి పేరుతో సీడ్ కంపెనీలు మోసం చేస్తున్నాయని కమిషన్ దృష్టికి వచ్చిన విషయం తెలిసిందే. రైతుల ఫిర్యాదులతో ఈనెల జూన్ 13 న రైతు కమిషన్ గద్వాల్ జిల్లాలో పర్యటించి అక్కడి రైతుల నుండి అభిప్రాయాలను సేకరించింది. ఇదే క్రమంలో గద్వాల్ ఘటనపై సోమవారం రైతు కమిషన్ కార్యాలయంలో బిఆర్‌కెభవన్‌లో కంపెనీల ప్రతినిధులతో రైతు కమిషన్ సమావేశాన్ని నిర్వహించింది.

ఈ సందర్భంగా రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ.. సీడ్ కంపెనీలు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించకుండా రైతుల కోణంలో కూడా ఆలోచన చేయాలన్నారు. తెలంగాణ విత్తనోత్పత్తికి అనువైన ప్రాంతమని, సీడ్ కంపెనీలు రైతులతో విత్తనోత్పత్తి చేయించుకోవడమే కాకుండా వారు నష్టపోయిన సమయంలో ఆదుకోవాల్సిన బాధ్యత కంపెనీలపై ఉందని గుర్తుచేశారు. రెండు రోజుల్లో గద్వాల్ జిల్లాలో పత్తి విత్తనోత్పత్తి చేసి నష్ట పోయిన రైతులకు నష్టపరిహా రం చెల్లించే విషయంలో సీడ్ కంపెనీలు నిర్ణయం తీసుకోవాలన్నారు. సీడ్ కంపెనీలు ఏర్పాటుచేసుకున్న ఆర్గనైజర్ల తీరుపై కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్గనైజర్ల వ్యవహారంతోనే సీడ్ కంపెనీలు బద్నామ్ అవుతున్న విషయాన్ని ఈ సందర్భంగా సభ్యులు వివరించారు. రైతులతో ఆర్గనైజర్లు వడ్డీ వ్యాపారం చేయడం నేరమని హెచ్చరించారు. విత్తనోత్పత్తి కోసం సీడ్ కంపెనీలు రైతులకు ఇచ్చిన విత్తనమే.. జివోటి పరీక్షలో ఎట్లా ఫెయిల్ అవుతుందని కమిషన్ సభ్యులు ప్రశ్నించారు. సుదీర్ఘంగా చర్చించిన తర్వాత సీడ్ కంపెనీలు రైతులకు నష్టపరిహారం ఇవ్వడానికి సుముఖత తెలిపాయి. ఈ సమావేశాని హాజరైన అలంపూర్ మాజీ ఎంఎల్‌ఎ సంపత్ కుమార్ తనకు ఉన్న అనుభవాన్ని, అక్కడి రైతు ల సమస్యలు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు.

ఈ సమావేశంలో రైతు కమిషన్ సభ్యులు రాము లు నాయక్, కమిషన్ సలహాదారులు దొంతి నర్సింహారెడ్డి, రామనుజేయులు, శ్రీనివాస్ రెడ్డి, మెంబర్ సెక్రెటరీ గోవిం దు, గద్వాల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.



## జూలై 9న దేశవ్యాపిత సమ్మె విజయవంతం చేయాలి

**కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, అసోసియేషన్ల సంయుక్త సమావేశం విజ్ఞప్తి**

ప్రజాపక్షం / హైదరాబాద్: జూలై 9న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెను తెలంగాణ రాష్ట్రంలో విజయవంతం చేయాలని కార్మికవర్గానికి కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, అసోసియేష న్ల సంయుక్త కార్యాచరణ సమావేశం కోరింది. ఆరోజు హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కు నుండి ఇందిరాపార్కు వరకు వేలాదిమందితో కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నిరసన సభ జరుగుతుందని తెలియజేసింది. కార్మికవర్గానికి కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, అసోసియేషన్ల సంయుక్త సమావేశం సికింద్రాబాద్‌లోని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో సోమవారం జరిగింది. రాష్ట్రంలోని అన్ని యూనియన్లు ఈనెల 23 వరకు సమ్మె నోటీసులు ఇవ్వాలని, అన్ని యూనియన్ల, సంఘాలు, ఫెడరేషన్లు సదస్సులు, సభలు, సమావేశాలు, మీడియా సమావేశాలు నిర్వహించి జూలై 9న జరగనున్న సమ్మె విజయవంతం చేసే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. జూన్ 25 నుండి 30లోపు పారిశ్రామిక ప్రాంతాలు, పని ప్రదేశాలు, గ్రామాలు, కాలనీలు, మండల, జిల్లా కేంద్రాలలో సమావేశాలు జరిపి సమ్మె విజయవంతం చేయాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను మోదీ ప్రభుత్వం 11 ఏళ్లలో పూర్తిగా సవరించి, కార్పొరేటు పెట్టుబడిదారులకు, బడా వ్యాపారులకు మరింత సంపద దోచిపెట్టేందుకు, 47కోట్ల మంది కార్మికుల జీవితాలను దుర్భరం చేస్తున్నారని విమర్శించారు. కరపత్రాలను ముద్రించి కార్మికులు, ప్రజలలో కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నేతలు ఎం.నరసింహా, శ్రీనివాస్, కృష్ణమూర్తి (ఎఐటియు సి), ఆర్.డి. చంద్రశేఖర్, విజయకుమార్ యాదవ్ (ఐఎన్‌టియుసి), పాలడుగు భాస్కర్, జె.వెంకటేష్ (సిఐటియు), రెబ్బ రామారావు, జి.వి.భాస్కర్‌రావు (హెచ్‌ఎంఎస్), అనురాధ(ఐఎఫ్‌టియు), ప్రవీణ్ కుమార్(టియుసియు),ఎం.కె.బోస్, ఎబిఆర్ మోహన్‌రావు (టిఎన్‌టియుసి), కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల రాష్ట్ర కార్యదర్శి వి.నాగేశ్వరరావులు పాల్గొన్నారు.



టిపిసిసి డి లిమిటేషన్ తొలి సమావేశం గాంధీ భవన్‌లో చైర్మన్ సిడబ్ల్యుసి సభ్యులు వంశీ చంద్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.. ఈ సమావేశంలో ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ డి లిమిటేషన్ అంశంపైన తీసుకోవాల్సిన విధి విధానాలను చర్చించారు. భవిష్యత్‌లో చేపట్టబోయే డి లిమిటేషన్ కార్యక్రమంలో దక్షిణ తెలంగాణకు అన్యాయం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని చర్చించారు.

## 'విశ్వకర్మ యోజన' వివరాలు సిద్ధం చేయాలి : కేంద్రమంత్రి



ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి ఎస్‌ఎల్‌బిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్‌ఎల్‌బిసి కన్వీనర్, వివిధ బ్యాంకుల జనరల్ మేనేజర్లు, వివిధ ప్రభుత్వ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బ్యాంకుల పనితీరును కేంద్ర మంత్రి సమీక్షించారు. గ్రామీణ అభివృద్ధిలో బ్యాంకుల పాత్రను చర్చించారు. ఇప్పటివరకు మంజూరైన రుణాల వివరాలను బ్యాంకుల ప్రతినిధులు, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రుణాలు, పిఎం ముద్రా లోన్లు, పిఎం విశ్వకర్మ యోజన, పిఎం స్వనిధి, స్టాండప్ ఇండియా, ఇతర కేంద్ర పథకాల్లో రుణాల పురోగతిపై మంత్రి ఆరా తీశారు. బ్యాంకులు ఇప్పటివరకు మంజూరు చేసిన రుణాల వివరాలు తెలుసుకుని, కేంద్ర పథకాల ప్రయోజనాలు లబ్ధిదారులకు ఎలా అందుతున్నాయన్న విషయాన్ని కేంద్ర మంత్రి స్పష్టంగా అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా 'విశ్వకర్మ యోజన'కు సంబంధించి పూర్తి వివరాలు తదుపరి సమావేశానికి సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.



## 'కాళేశ్వరం'పై బండి సంజయ్ అసత్య ప్రచారం

ప్రజాపక్షం/హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ అసత్యాలను ప్రచారం చేస్తున్నారని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎంఎల్‌సి డాక్టర్ దాసోజు శ్రవణ్, ఎంఎల్‌ఎలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ కె. సంజయ్‌తో కలిసి గంగుల కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందా?, లేదా ఎన్‌డిఎ ప్రభుత్వం కొనసాగుతుందా? అనే అనుమానం వ్యక్తం అవుతుందన్నారు. కెసిఆర్ ఇంకా సిఎంగా ఉన్నారనుకుని బండి సంజయ్ ప్రతి రోజూ బిఆర్ ఎస్‌పై విమర్శలు చేస్తున్నారా? అని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ తమ్మిడి హట్టి దగ్గర 165 టిఎంసిల నీళ్లు ఉన్నాయని సిడబ్ల్యుసి నివేదికను చదివి వినిపించారని, కానీ ఆ నివేదికలో కొద్ది భాగం మాత్రమే బండి చదివి వినిపించారని, ఆ పత్రంలోనే 63 టిఎంసిలు ఇతర రాష్ట్రాలకు కేటాయించామని, తెలంగాణకు కేవలం 44 టిఎంసిలే అని ఉన్నదని గంగుల వివరించారు. బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని, కేవలం కెసిఆర్‌ను తిట్టడానికే బండి సంజయ్ పుట్టినట్టుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బండి సంజయ్ వాస్తవాలు దాచి కెసిఆర్‌పైన విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రం,మహారాష్ట్ర రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వమే ఉన్నదని, తమ్మిడి హట్టి వద్ద 152 మీటర్ల వరకు అనుమతులు తీసుకురావాలని ఆయన బండి సంజయ్‌కి సూచించారు.

**తెలంగాణ ఉద్యమకారుల ఫోన్లు ట్యాప్ చేసిన కెసిఆర్, హరీశ్‌ను**

# తక్షణమే అరెస్ట్ చేయండి

**తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక**

ప్రజాపక్షం/హైదరాబాద్: గజ్వేల్ నియోజకవర్గంలో కెసిఆర్‌కు వ్యతిరేకంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే, 'మీ సంగతి' చూస్తామని 2018 శాసనసభ ఎన్నికల్లో తమను హరీశ్‌రావు నివాసంలో అప్పటి మంత్రి హరీశ్‌రావు, ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి బెదిరించారని తెలంగాణ అమరవీరుల కుటుంబాల రాష్ట్ర ఐక్యవేదిక, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు ఎం.రఘుమారెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోన్లను ట్యాపింగ్ చేసి, అనేక చిత్ర హింసలకు గురిచేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై సమగ్రంగా విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్, జూబ్లీహిల్స్ ఫోన్ ట్యాపింగ్ ప్రత్యేక విచారణ అధికారుల బృందానికి ఆయన సోమవారం ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన కెసిఆర్, హరీశ్‌రావును, వారి అనుచరులను తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు. ఎవరు ఏం చేస్తున్నారో తమకు అంతా తెలుసని హరీశ్‌రావు తెలంగాణ ఉద్యమకారులను బెదిరించారని, తమ ఫోన్ ట్యాపింగ్ ద్వారా ఎన్నికల సమయంలో తెలంగాణ అమర వీరులు గజ్వేల్‌కు రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. నాగార్జున సాగర్ ఉప ఎన్నికల్లో కూడా 500ల మందితో నామినేషన్లు వేసేందుకు ప్రయత్నిస్తే ఉద్యమకారుల ఫోన్ ట్యాపింగ్ చేసి, అనేక చిత్రహింసలకు గురిచేశారని, మునుగోడు ఉప ఎన్నికల్లో కూడా తమ ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు, వారి అనుచరులపైన చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కెసిఆర్ పాలనలో రాజకీయ నాయకులు, జర్నలిస్టు లు, ఉద్యోగ సంఘాల నాయకుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారన్నారు. ఇంటలిజెన్స్ విభాగాన్ని తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకుని, ప్రత్యర్థులపైన అక్రమంగా నిఘా వేశారని, ఐపిసి, టెలికమ్యూనికేషన్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఇటువంటి చర్యలకు మరోసారి తావు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ పూర్తయిన తర్వాత ఆ నివేదికను ప్రజల ముందు పెట్టాలని కోరారు.

## ఎన్నికల హామీల అమలుకు డిమాండ్





ప్రజాపక్షం/హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్‌ను, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం సమితి అధ్యక్షులు కె.ఏసురత్నం అధ్యక్షతన హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని రాజ్‌బహుద్దూర్ గౌర్ హాల్‌లో జరిగింది. సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ దళితుల సంక్షేమ పథకాలు పూర్తిగా నిలిపివేశారని, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ఒక్క లబ్ధిదారునికి కూడా రుణం ఇచ్చే పరిస్థితి లేదని, పారిశ్రామిక రుణాలను నిలిపివేశారని, గత నాలుగేళ్లుగా సబ్సిడీలు రావడంలేదని అన్నారు.

ఉపాధి పనులు పేదలకు దొరకడంలేదని, తగిన కూలీ ఇవ్వడంలేదని, అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని, నిరుద్యోగ యువతకు సబ్సిడీ ద్వారా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై ఉద్యమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యం ప్రజలకు అందుబాటులో లేదని ప్రభుత్వ దవాఖానాలలో సర్వేలు నిర్వహించి పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించడానికి పోరాడుతామన్నారు.

ఏసురత్నం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో దళితులకు మొద టి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని, అర్హులైన వారందరికీ ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్‌సి గురుకులాలను రద్దు చేయడానికి కుట్రలు చేస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాల విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రాజ్ కుమార్, జె.కుమార్‌స్వామి, కె.సహదేవ్, వై. ఉష శ్రీ, టి.రామకృష్ణ, కె.రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

**పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి**

# వేగంగా స్థలాల గుర్తింపు ప్రక్రియ

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రతి మండలానికి రెండు గ్రామ పంచాయతీ భవనాలు, రెండు అంగన్‌వాడీ భవనాల చొప్పున నిర్మించాలని లక్ష్యంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ధారించుకుంది. భవనాల నిర్మాణం కోసం అవసరమైన స్థలాల గుర్తింపును వేగంగా పూర్తి చేస్తుంది. గత ఏడాది నవంబర్‌లో లక్ష్యంగా నిర్దేశించుకోగా, స్థలాల గుర్తింపు, బదిలీ చేయడంలో జాప్యం కారణంగా అనుకున్న స్థాయిలో భవనాల నిర్మాణాలు పూర్తి కాలేదు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే గ్రామపంచాయతీ(జిపి) భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. మంత్రి సీతక్క ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భవన నిర్మాణాల కోసం స్థలాలు సేకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పురోగతిని ఎప్పటికప్పుడు పంచాయతీ రాజ్ కమిషనరేట్ అధికారులు, జిల్లా డిఆర్‌డిఏలతో సమీక్షలు నిర్వహిస్తూ వస్తున్నారు. దీంతో మొదటి త్రైమాసికంలోనే భవనాల నిర్మాణంకోసం స్థలాలను గుర్తించా రు. మొత్తం ఈ ఏడాది 1148 అంగన్‌వాడీ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించుకోగా, ఇప్పటికే 813 అంగన్‌వాడీ భవనా ల నిర్మాణం కోసం స్థలాలను గుర్తించారు. మరో 98 చోట్ల స్థలాలను గుర్తించాల్సి ఉందని అధికార వర్గాలు చెప్పుతున్నాయి. మిగిలిన భవనాలకు సంబంధించి గతంలో భవనాల నిర్మాణం మొదలు పెట్టగా అవి వివిధ దశల్లో ఉన్నాయి.

**జి.పి భవనాలకు స్థలాల గుర్తింపుకు ఆటంకాలు..**

ఇక జి.పి భవనాలకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి మండలానికి రెండు చొప్పున మొత్తం 1144 జి.పి భవనాల నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంగా మొదటి త్రైమాసికం ముగియక ముందే 549 గ్రామాల్లో స్థలాలను గుర్తించారు. మిగిలిన 84 చోట్ల ఇంకా స్థలాలను గుర్తించాల్సి ఉంది. మిగిలిన గ్రామాల్లో జి.పి భవనాల నిర్మాణా లు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రధానంగా యాదాద్రి భువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి వంటి హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాలు, ఏజెన్సీ ప్రాంతాలున్న ఆదిలాబాద్, నిర్మల్ వంటి జిల్లాల్లో స్థలాల గుర్తింపున కు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ జి.సృజన జిల్లా కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడుతూ స్థలాల గుర్తించి, అప్పగించాల ని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో స్థల సేకరణ పూర్తవుతుందన్న నమ్మకంతో అధికారులు ఉన్నారు.

**ప్రత్యేక డిజైన్‌లతో భవనాల నిర్మాణం..**

జి.పి భవనాలు, అంగన్‌వాడీ భవనాలకు యూనిక్ మోడల్ ఉండాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా ఆయా భవనాలను చూడగానే ప్రజలు అవి జి.పి భవనాలని, అంగన్‌వాడీ భవనాలని గుర్తించేలా ఉండేలా డిజైన్ రూపొందించాలని ఆదేశించా రు. దీంతో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం జి.పి భవనాలకు, అంగన్‌వాడీలకు వేర్వేరుగా డిజైన్లు రూపొందిస్తున్నారు. ఉపాధి హామీ నిధుల ద్వారా ఒక్కో పంచాయతీ భవన నిర్మాణకోసం రూ. 20 లక్ష లు ఖర్చు చేయనున్నారు. అంగన్‌వాడీ భవనం కోసం ఉపాధి హామీ నిధుల ద్వారా రూ. 8లక్షలు, 15వ ఫైనాన్స్ కమీషన్ నిధులు రూ.2లక్షలు, మహిళా శిశు సంక్షేమం నుంచి రూ.2లక్షల నిధులు మొత్తం కలిపి రూ.12లక్షలు వెచ్చించనున్నారు. ప్రణాళికాబద్ధంగా పనిచేయ డం ద్వారా వచ్చే మార్చి నాటికి మొత్తం 1148 జి.పి భవనాలు, 1148 అంగన్‌వాడీ భవనాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనుంది.

**పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క**

స్థలాల గుర్తింపు ప్రక్రియ చివరి దశలో ఉన్న నేపథ్యంలో, త్వరలో నూతన భవనాలకు శంకుస్థాపన చేస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. చివరి త్రైమాసికంలో భవనాల నిర్మాణాలు చేపట్టడంతో పనులు పెండింగ్‌లో మిగిలిపోతున్నాయన్నారు. అందుకే ఈ దఫా మొదటి త్రైమాసికంలోనే స్థలాల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు.

యునిక్ డిజైన్‌తో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. నూతన జి.పిలు, అంగన్‌వాడీ భవనాల కోసం వేగం గా స్థలాలు గుర్తించడానికి కృషి చేసిన శాఖ అధికారులను, జిల్లా కలెక్టర్లకు మంత్రి అభినందనలు తెలిపారు.


**టెన్త్ మెమో పోయినది**

నా క్లయింట్ అనగా, **పుప్పాల రాకేష్ S/o రాజా రెడ్డి,** గ్రామం సిర్పూర్, మండలం మల్లాపూర్, జిల్లా జగిత్యాల. తేదీ: 21.06.2025 రోజున మెట్‌పల్లి నుండి సిర్పూర్ గ్రామానికి వచ్చే క్రమంలో **టెన్త్ మెమో నెం. 1234113457** ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలను పోగొట్టుకున్నాడు. ఎంత ప్రయత్నించినా దానిని కనుగొనలేక పోయాడు. ఇట్టి విషయంపై మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎవరికైనా దొరికినచో పై చిరునామాలో తెలియజేయగలరు. సెల్: 8466024280.

**సం/- ఒజ్జల శ్రీనివాస్**
**అడ్వకేట్, నోటరీ**

**పాస్‌పోర్టు పోయినవి**

నా క్లయింట్ అనగా, **తెనుగొండ సాయిలు S/o ఎల్లయ్య,** గ్రామం గుండంపల్లి, మండలం మల్లాపూర్, జిల్లా జగిత్యాల. ఇంటి సామాను షిఫ్ట్ చేస్తున్న సమయంలో పాస్‌పోర్ట్ ఎక్కడో పోయింది. ఇట్టి విషయమై మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో, జగిత్యాల ఎస్పీ కార్యాలయంలో 17.06.2025 రోజున ఫిర్యాదు చేశారు. ఎవరికైనా దొరికినచో పై చిరునామాలో తెలియజేయగలరు. సెల్: 8106897342.

**సం/- ఒజ్జల శ్రీనివాస్**
**అడ్వకేట్, నోటరీ**

**GREATER HYDERABAD MUNICIPAL CORPORATION**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**

**NIT No.** 13, **పని పేరు:** జిహెచ్ఎంసి, రాజేంద్రనగర్ సర్కిల్-11లో 03 పనులకు RCC బాక్స్ డ్రెయిన్ కూల్చివేత మరియు మరమ్మతులు, ప్రస్తుత BT రోడ్డు విస్తరణ మరియు రైజింగ్ ఆఫ్ పాత్‌వేస్, **అంచనా విలువ / ఇసివి:** రూ.31.15 లక్షలు, **డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం:** 25.06.2025న మ.2.30గం.లకు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 28.06.2025న మ.2.45గం.ల వరకు, **ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నెం.11, జిహెచ్ఎంసి, సెల్ నెం. 9989930608, ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI, (ఆర్‌జెఎన్‌ఆర్), జిహెచ్ఎంసి.**

DIPR R.O. No. : 4027-PP/CL/ADVT/1/2025-26, Date: 23-06-2025

**శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము**
**వెలిమినేడు గ్రామం, చిట్యాల మండలము, నల్లగొండ జిల్లా.**

లేఖ నెం.యస్.యస్.టి/2025, టెండర్ - కం - బహిరంగ వేలముల ప్రకటన తేది: 23.06.2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది:30.06.2025 సోమవారము రోజున ఉ.11.00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి / నగదు | కాలపరిమితి |
|---|---|---|---|
| 1. | కొబ్బరికాయలు, పూజాసామాగ్రి, లడ్డూ, పులిహోర ప్రసాదములు & కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు | 2,00,000/- | 04.07.2025 నుండి 03.07.2026 వరకు (1 సం॥) |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9703662667 సంప్రదించగలరు.

ఇట్లు, సిరికొండ నవీన్
కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 3999-PP/CL/ADVT/1/2025-26, Date: 23-06-2025

**వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయం,**
**బోయినపల్లి, సికింద్రాబాద్.**

నెం. వ్య.మా.క.బో/ఎస్ట్ /టెండర్/136/2023-24 టెండరు నోటీసు తేది: 23.06.2025

ఇందుమూలముగా తెలియపరచునది ఏమనగా, వ్యవసాయ మార్కెట్ కమిటి, బోయినపల్లి నందు ఈ దిగువ పనికి కేటాయించిన తేది నుండి ఒక సంవత్సరము కాలమునకు నిర్వహణ కొరకై సీలు వేసిన టెండర్లు ఈ మార్కెట్ కమిటీ కార్యాలయమునందు తేది: 01.07.2025న మధ్యాహ్నం 12.00 గం.ల వరకు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 12.30 గం.కు హాజరయిన టెండరుదార్ల సమక్షములో తెరువబడును. ఇందుకు సంబంధించిన టెండరు షెడ్యూళ్లు తేది: 24.06.2025 నుండి తేది: 30.06.2025 తేదీలలో దరఖాస్తు ద్వారా మార్కెటు కమిటి కార్యాలయము నుండి పొందవచ్చును.

| క్ర.సం. | కాంట్రాక్టు పేరు | ఈ.యం.డి. విలువ | దరఖాస్తు విలువ |
|---|---|---|---|
| 1 | మార్కెట్ యార్డులో ఫాగింగ్ నిర్వహణ | రూ. 1,00,000/- | రూ. 2,000/- |

ఎట్టి కారణము లేకుండానే టెండరు ప్రక్రియను నిలుపుదల చేయుటగాని లేదా రద్దు పరుచుటగాని మార్కెట్ కమిటికి అధికారము కలదు. ఇతర వివరములు కార్యాలయము పని వేళలలో స్వయముగా గాని లేదా ఫోన్ నెం. 7330733208 ను సంప్రదించి తెలుసుకొనవచ్చును. ॥నిజాప్రతి॥

సం/- (యం. వెంకన్న),
ఉన్నత శ్రేణీ కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటి, బోయినపల్లి.

DIPR R.O. No. : 4021-PP/CL/ADVT/1/2025-26, Date: 23-06-2025

ప్రజాపక్షం
మంగళవారం, 24 జూన్

# ఇరాన్‌పై ట్రంప్ టెర్రర్

ఇరాన్ అణు కార్యక్రమాన్ని నాశనం చేయటం ద్వారా మధ్య ప్రాచ్యంపై తమ అనుంగు మిత్ర దేశం ఇజ్రాయేలుకు తిరుగులేని ఆధిపత్యం కట్టబెట్టే వ్యూహాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిస్సిగ్గుగా అమలు చేస్తున్నాడు. ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను బరితెగించి ఉల్లంఘించి ఇరాన్ అణు శుద్ధి వసతులపై అమెరికన్ స్టీల్త్ బాంబర్లతో ప్రత్యక్ష బాంబుదాడులకు బాహాటంగా ఒడిగట్టాడు. ఇన్నాళ్లు ఇజ్రాయెల్ దుందుడుకు కృత్యాలకు వెనుక నుంచి మద్దతిస్తున్న, వీటో అధికారాన్ని ఉపయోగించి ఐరాస భద్రతా మండలిలో ఇజ్రాయెల్‌పై ఈగ వాలకుండా కాపాడుతూ వస్తున్న అమెరికా, అధ్యక్షుడు ట్రంప్ రెండవ టరంలో ముసుగు తొలగించుకుని తానే స్వయంగా దురాక్రమణ పూరిత విధ్వంసక దాడులకు పాల్పడింది. ఒకపక్క పాలస్తీనియన్‌లకు చెందిన గాజా ప్రాంతాన్ని సర్వనాశనం చేస్తున్న ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని కప్పిపుచ్చుకుంటూ శాంతి వచనాలు పలుకుతున్న ట్రంప్ వత్తాసుతో రెచ్చిపోతున్నది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని ధ్వంసం చేయడమే పనిగా, ఎటువంటి కవ్వింపు లేకుండా ఇజ్రాయెల్ 13 రోజుల క్రితం ఇరాన్ అణు వసతులున్న ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. అయితే ఇరాన్ అణు కార్యక్రమాన్ని విరమించుకోవాలంటూ ఇరాన్ తాము గీత గీసిన చోట సంతకం చేయాలని కోరుకుంటున్న ట్రంప్ ఆశించింది జరగలేదు. తమకు భారీ నష్టాలు జరిగినప్పటికీ ఇరాన్ తలవంచలేదు. ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్లతో ఎదురుదాడి సాగిస్తున్నది. ఇరాన్ ఇప్పటికైనా తమతో ఒప్పందానికి రావాలని ట్రంప్ హెచ్చరించినా ఇస్లామిక్ ప్రభుత్వ నాయకత్వం లొంగుబాటు ప్రదర్శించలేదు. ఓర్పు నశించిన ట్రంప్ తమ స్టీల్త్ బాంబర్లను, బంకర్ బస్టర్ బాంబుల సామర్థ్యాన్ని పరీక్షించాలనుకున్నాడో ఏమో అర్ధరాత్రి దాడులను ఆదేశించాడు. ఇప్పటికైనా ఒప్పందానికి రాకపోతే సర్వనాశనం తప్పదని హెచ్చరికతో పాటు ఇరాన్ నాయకత్వాన్ని మార్చుతామన్న (ఇరాక్‌లో లాగా) ఉద్దేశాన్ని వెల్లడించాడు ట్రంప్. ఇరాక్‌పై దురాక్రమణ యుద్ధానికి ఇప్పుడు ఇరాన్‌పై బాంబు దాడులకు పోలిక ఉంది.

గతంలోకి వెళ్తే అధ్యక్షుడు బుష్ టెర్రరిజం నిర్మూలన పేరుతో 2001లో ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణ యుద్ధానికి ఒడిగట్టిన తరువాత 'ప్రభుత్వాల మార్పు' అంటూ ఇరాక్, లిబియాలపై సైనిక దాడి చేశారు. 21 సంవత్సరాల ఆక్రమణ తరువాత అమెరికా సైన్యాలు ఆఫ్ఘన్ నుండి ఆకస్మికంగా నిష్క్రమించుకోగా తాలిబన్లు తిరిగి అధికారం స్వాధీనం చేసుకున్నారు. అమెరికా దాడుల తరువాత ఇరాక్ (2003), లిబియాల్లో (2011) అస్థిరత, అరాచకం కొనసాగుతున్నాయి. ఇరాన్ ఒప్పందానికి రాకపోతే దురాక్రమణ యుద్ధానికి దిగి, ఇస్లామిక్ విప్లవ అధినేత మత నాయకుడు అయతుల్లా ఖమేనీని కూలదోసి (హతమార్చి) తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నది ట్రంప్ హెచ్చరిక సారాంశం.

ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఆది నుండీ ప్రపంచ దేశాలు వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. ఐరాస ఆర్థిక ఆంక్షలు విధించింది. సుదీర్ఘమైన చర్చల అనంతరం, 2015లో ఇరాన్ తమ అణు కార్యక్రమాన్ని పౌర కరెంట్ ఉత్పత్తి పరిమితులకు అంగీకరిస్తూ పి5+1 దేశాలతో సంయుక్త సమగ్ర కార్యాచరణ ప్రణాళిక (జెసిపిఒఎ)పై సంతకం చేసింది. భద్రతా మండలిలోని 5 శాశ్వత సభ్య దేశాలు —చైనా, ఫ్రాన్స్, రష్యా, యుకె, యుఎస్‌ఎ ప్లస్ జర్మనీ ఆ ఒప్పందం భాగస్వాములు. పర్యవసానంగా ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలను ఐరాస సడలించింది. అయితే డొనాల్డ్ ట్రంప్ తొలి దఫా అధ్యక్షునిగా ఎన్నికైన తదుపరి, 2018లో ఆ అంతర్జాతీయ ఒప్పందం నుంచి అమెరికా ఉపసంహరించి, ఆంక్షలు విధించారు. ఇప్పుడు రెండవసారి అధ్యక్షుడైనాక ఇరాన్ అణు కార్యక్రమ ధ్వంసం లేదా ఇరాన్ వినాశం అనే మొండి వైఖరి చేబట్టారు. కాబట్టి ఈ యుద్ధం ఎంత కాలం సాగుతుందో, పర్యవసానమేమిటో వేచి చూడవలసిందే.

అయితే తమ లక్ష్యాల సాధనకు ప్రత్యర్థులపై సైనిక బలాన్ని ఉపయోగించే ఆటవిక నీతి అత్యంత గర్హనీయం. అందునా ప్రపంచ నాయకుడిననే విర్రవీగుతున్న అమెరికా పాలకులు అందుకు ఒడిగట్టడం అంతర్జాతీయ సంబంధాలలో రాజ్య టెర్రరిజం అవుతుంది. అమెరికా దాడిని సమర్థించిన దేశాలు బహు తక్కువ–కానీ తప్పుని తప్పు అని గట్టిగా చెప్పిన దేశాలనూ వ్రేళ్లపై లెక్కించవచ్చు– సంయమనం పాటించాలి, చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సన్నాయి నొక్కులు నొక్కిన నేతలే అత్యధికులు. ట్రంప్ తాను చెప్పుకుంటున్నట్లు శాంతిదూతనా, యుద్ధోన్మాదియా? పాకిస్తాన్ నామినేట్ చేసినట్లు నోబెల్ శాంతి బహుమతికి పాత్రుడా, అపాత్రుడా? ఒకపక్క సుంకాల యుద్ధం, రెండోవైపు మిలటరీ యుద్ధం. ట్రంప్ ఏలుబడిలో అంతర్జాతీయ సంబంధాలు అధోగతి.

# మరింత దిగజారిన లింగ అంతరం: జిడిపికి అపారనష్టం!



ఎం. కోటేశ్వరరావు

ఇన్ని మంచి విషయాలు చెప్పారు కదా మీ వాడిలో ఉన్న రెండు లోపాలు చెబుతారా అని పిల్లనివ్వటానికి వచ్చిన పెద్దలు తండ్రిని అడిగారట. ఓస్ అంతేనా ఒకటి వాడికి తెలియదు, రెండు ఇతరులు చెప్పేది వినడు అన్నాడట. కొందరు పాలకులను చూస్తుంటే అదే అనిపిస్తోంది. పదకొండు సంవత్సరాల నరేంద్రమోదీ పాలన విజయోత్సవాలంటూ బిజెపి, దాని మిత్రపక్షాలు సంబరాలు చేసుకుంటున్నాయి. సగం మందిగా ఉన్న మహిళల స్థితి బాగు పడకుండా ఎన్నికబుర్లు చెప్పినా అది నిజమైన వృద్ధి కాదు. పచ్చి నిజం ఏమిటంటే నరేంద్రమోదీ అధికారానికి వచ్చిన తరువాత దేశంలో లింగఅంతరం తగ్గలేదు కదా, అంతకుముందు ఉన్నదానికంటే దిగజారింది. దీనివలన జిడిపికి జరుగుతున్న నష్టం మామూలుగా లేదు. 2015లో మెకెన్సీ గ్లోబల్ సంస్థ చెప్పినదాని ప్రకారం (2015 సెప్టెంబరు 25వ తేదీ టైమ్స్ ఆఫ్ ఇండియా) పురుషులతో సమంగా ఉపాధి, సమానపనికి సమానవేతనం గనుక అమలు జరిపితే ప్రపంచ జిడిపికి 2025నాటికి 12లక్షల కోట్ల డాలర్లు తోడవుతుందని, దానిలో ఎక్కువ మొత్తం 2.9లక్షల కోట్ల డాలర్లు భారత్‌లో తోడవుతుందని స్పష్టంగా పేర్కొన్నది. అది నాటి వేతనాలు, ద్రవ్యోల్బణం తదితరాల ప్రాతిపదికన వేసిన అంచనా అది. ఈ మొత్తం ఇప్పుడు అంచనా వేస్తున్న 4.187లక్షల కోట్ల డాలర్లకు అదనం, జర్మనీని కూడా దాటి మూడో స్థానంలోకి వెళ్లిపోయి ఉండేది. అసమానతల తగ్గింపు కృషికి మోదీని ఎంపిక చేసినట్లు చెప్పటం మరొక ప్రహసనం. అధికారానికి వచ్చిన మూడేండ్లకే అలాంటి నిర్ణయానికి సియోల్ బహుమతి ఎంపికదార్లు ఎలా వస్తారు. ప్రధాని నరేంద్రమోదీకి 2018 సియోల్ (దక్షిణ కొరియా) శాంతి బహుమతి ఇచ్చారు. దేని కటా! 2018 అక్టోబరు 24వ తేదీ మన విదేశాంగ శాఖ వెబ్‌సైట్‌లో పెట్టిన సమాచారం మేరకు మోడినోమిక్స్ ద్వారా ప్రపంచ ఆర్థిక పురోగతిని పెంచటానికి, ఆర్థిక వృద్ధితో భారతీయుల మానవాభివృద్ధిని వేగవంతం చేసేందుకు, ప్రజాస్వామ్య వృద్ధి, దేశంలో పేదలు, ధనికుల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు చేసిన కృషిని బహుమతి కమిటీ గుర్తించి ఎంపిక చేసిందని పేర్కొన్నారు.

పదేండ్ల అనుభవం ఏమిటి ? 1961లో మన దేశంలో ధనికులుగా ఉన్న ఎగువ ఒకశాతం మంది వద్ద జాతీయ సంపదలో 12.9శాతం పోగు పడితే అది ఇప్పుడు 40శాతం దాటింది. నూతన ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టిన 1991లో 20శాతంగా ఉన్న కేంద్రీకరణ మోదీ అధికారానికి వచ్చే నాటికి 30శాతానికి చేరింది, మోదీ దాన్ని 40శాతానికి చేర్చారు, అసమానత తగ్గింది ఎక్కడ? దిగువ 50శాతం మంది సంపద 1961నుంచి 2023 మధ్య 11.4 నుంచి 6.5శాతానికి దిగజారింది, మధ్యతరగతి అనుకొనేవారిది కూడా 43.7 నుంచి 29శాతానికి దిగజారింది, అంటే వారు కూడా పేదల్లోకి వచ్చారు. చిత్రం ఏమిటంటే ఇంత అసమానతలు పెరుగుతుంటే నిష్టదారిద్ర్యం నుంచి పాతిక కోట్ల మందిని మెరుగైన స్థితిలోకి నెట్టామని చెప్పుకుంటున్నారు. ఇదొక ప్రహసనం, అంకెల గారడీ !

కేంద్రంలోనూ, మెజారిటీ రాష్ట్రాలలో మేము, మా మిత్రులు ఉన్నాం అని చెబుతున్న నరేంద్రమోదీ గుజరాత్ సిఎంగా అనుభవం ఉన్నప్పటికీ మెకెన్సీ నివేదిక చెప్పిందేమిటో అర్థం కాలేదా, వారేమిటి మాకు చెప్పేది అని ఖాతరు చేయలేదా? ఇంతవరకు లింగ అంతరం, ఆర్థిక అసమానతల తగ్గింపునకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? మోదీ విజయగీతాలాపనలో తలమునకలుగా ఉన్న మీడియాలో ఎక్కడా దీని ప్రస్తావన కనిపించదు, వినిపించదు. 2014లో ప్రపంచ ఆర్థికవేదిక విడుదల చేసిన నివేదిక ప్రకారం లింగఅంతరంలో 142 దేశాల్లో మన స్థానం 114, వచ్చిన పాయింట్లు 0.6455 కాగా అదే సంస్థ విడుదల చేసిన 2025 నివేదికలో 148దేశాలకు గాను 131వ స్థానంలో ఉన్నాం, వచ్చిన మార్కులు 0.644, గతం కంటే తగ్గాయి. జపాన్ కంటే ఈ ఏడాది కొన్నివేల కోట్ల డాలర్లు ఎక్కువగా ఉండి నాలుగో స్థానంలోకి వస్తుందన్న అంచనాలను చూసి పండగ చేసుకున్న వారు లింగ అంతరం దిగజారటం గురించి మాట్లాడరేం ! మహిళలంటే చిన్నచూపు, నిర్లక్ష్యం, దీని గురించి చర్చ జరిగితే మోదీ విజయ బండారం బయటపడుతుందని తప్ప మరొక కారణం ఏముంది ?

పదకొండు సంవత్సరాలుగా ఎన్ని కబుర్లు చెప్పినా తరతరాలుగా జరుగుతున్న అన్యాయానికి అంతం లేదు. ఉట్టికెక్కలేనయ్య స్వర్గానికి ఎగురుతాడా అన్నట్లుగా 2047నాటికి దేశాన్ని ఎక్కడికో తీసుకుపోతానని చెబుతున్నారు. లింగ అంతరం అంటే స్త్రీ, పురుషుల మధ్య ఉన్న సమానత్వంలో ఉన్న తేడా మదింపు. అవకాశాలు, విద్య, ఆరోగ్యం, రాజకీయ సాధికారత, బతికి ఉండటం సంబంధిత అంశాలను పరిగణనలోకి తీసుకొని ఇచ్చే మార్కుల ఆధారంగా సూచికలను తయారు చేస్తారు, వాటికి ఆయా దేశాలు ఇచ్చే సమాచారమే ప్రాతిపదిక. ఆర్థికభాగస్వామ్యం, విద్య, వైద్యం, రాజకీయ సాధికారత అనే నాలుగు అంశాలపై విడివిడిగా సూచికలు రూపొందిస్తారు, వాటన్నింటిని కలిపి సాధారణ లింగఅంతర సూచికను తయారు చేస్తారు. వీటిలో కొన్ని పెరుగుదల తగ్గుదల ఉన్నప్పటికీ పది సంవత్సరాలలో మొత్తం మీద స్వల్ప తగ్గుదల నమోదైంది. పార్లమెంటులో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని బిల్లు ఆమోదించినప్పటికీ గత ఎన్నికలలో తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. అందువలన మహిళా సాధికారత సూచికలో 2023 కంటే 2025లో 14.7 నుంచి 13.8కి పాయింట్లు తగ్గిపోయాయి. మహిళలకు మంత్రి పదవులు కూడా 6.5 నుంచి 5.6శాతానికి పడిపోయాయి.

మరోవైపు త్వరలో జిడిపిలో మూడో స్థానానికి ఎదుగుతాం, అభివృద్ధి చెందిన దేశంగా మారనున్నాం అని అరచేతిలో వైకుంఠం చూపుతున్నారు మన ఇరుగు పొరుగుదేశాల స్థితి గతులను చూద్దాం. అన్నింటికంటే అధమ స్థానంలో ఉన్న పాకిస్తాన్‌తో 148తో పోల్చుకుంటే 131లో మెరుగ్గా ఉన్నాం. తాజా సూచికలో ఏకంగా 75 స్థానాలను మెరుగుపరచుకొన్న బంగ్లాదేశ్ 24, చైనా 103, భూటాన్ 119, నేపాల్ 125, శ్రీలంక 130, మాల్దీవులు 138వ స్థానంలో ఉన్నాయి.

> **భేటీ పడావో బేటీ బచావో (ఆడపిల్లల్ని చదివించండి, ఆడపిల్లల్ని రక్షించండి) అంటూ పదేండ్ల క్రితం పెద్దగా ఒక పథకాన్ని నరేంద్రమోదీ ప్రారంభించారు. దానికి కేటాయించిన నిధులే స్వల్పం కాగా ఆ మొత్తాన్ని కూడా ఖర్చు చేయటం లేదు. ఆరేండ్లలోపు బాల బాలికల నిష్పత్తి 1961 నుంచి మన దేశంలో పడిపోతోంది. 1991లో ప్రతి వెయ్యి మంది బాలురకుగాను 945 మంది బాలికలు ఉండగా క్రమంగా తగ్గుతూ 2011 నాటికి 918కి పడిపోయింది, తరువాత ఇంతవరకు జనాభా లెక్కలు జరగలేదు గనుక కేవలం అంచనాలు మాత్రమే చెబుతున్నారు. 2019–21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం అంతకు ముందు 2015–16తో పోల్చితే 919 నుంచి 929 పెరిగిందని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 934, తెలంగాణలో 894 మంది ఉన్నారు. కేంద్ర గణాంక శాఖ 2023లో విడుదల చేసిన భారత్‌లో స్త్రీ, పురుషులు అనే నివేదిక ప్రకారం 2036నాటికి ప్రతి వెయ్యి మంది మగపిల్లలకు 952 మంది ఆడ పిల్లలు ఉంటారని అంచనా వేశారు.**

లింగ అంతరంలో ఆడపిల్లలు బతికి బట్టకట్టటాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటారు, ఈ పథకంలో బేటీ బచావో అన్నా అదే. అందుకే ఈ పథకం వైఫల్యం కూడా అంతరం మరింతగా పతనం కావటానికి దోహదం చేసిందని చెప్పాల్సి వస్తోంది. ఈ పథకానికి కేటాయించిన నిధులతో నరేంద్రమోదీ బొమ్మతో ప్రచారానికే ఎక్కువ ఖర్చు చేశారు. ఏడాదికి రెండు పాయింట్ల చొప్పున మెరుగుదల సాధించాలన్నది లక్ష్యం. అది జరిగినట్లు కనిపించటం లేదు. మహిళా సాధికారతపై పార్లమెంటరీ కమిటీ 2021 సమీక్షలో ఈ పథకానికి కేటాయించిన సొమ్ములో కేవలం 25.13శాతమే ఖర్చు చేసినట్లు, వాటిలో కూడా 80శాతం ప్రకటనలకే వెచ్చించినట్లు, ప్రత్యేకించి పంజాబ్, హర్యానాలతో పాటు అనేక రాష్ట్రాలలో పథక లక్ష్యాలు నెరవేరలేదని కూడా తేలింది. కాగ్ నివేదికలు కూడా దీన్నే సూచించాయి. పదేండ్లు దాటుతున్నా దీని అమలు గురించి సర్వేలే చేయలేదు.

2019లో ప్రభుత్వమే పార్లమెంటుకు ఈ విషయాన్ని చెప్పింది.

2024 లింగ అంతరం నివేదిక ప్రకారం పురుషుడు రూ.100 సంపాదిస్తే అదే పనికి మహిళకు ఇస్తున్నది రూ.39.80 మాత్రమే. ఇది ఒక్క చిన్న చిన్న ఉపాధి, ఉద్యోగాలకే కాదు, టెక్నాలజీ, క్రీడలు, సినిమా రంగాల్లో కూడా ఇదే పరిస్థితి అంటే అతిశయోక్తి కాదు. ప్రఖ్యాత హీరోయిన్ దీపికా పదుకొనె 2021 ఆగస్టులో ప్రతిఫల చెల్లింపులో వివక్షను ప్రశ్నించారు. తన భర్త రణవీర్ సింగ్ ఎంత కష్టపడతారో తానూ అదే చేస్తానని తనకు తక్కువ మొత్తం ఇవ్వచూపినందుకు సంజయ్ లీలా బన్సాలీ సినిమా బైజు బావరాలో నటించేందుకు తిరస్కరించినట్లు ఆమె బహిరంగంగా చెప్పారు. ఆమె ఒక స్థాయికి ఎదిగారు గనుక అలా చెప్పగలిగారు, ఎందరికి అలాంటి అవకాశం ఉంది. నిజానికి ఇది బాలీవుడ్‌లోనే కాదు దేశంలోని అన్ని సినిమా రంగాల్లో, ఇతర చోట్ల ఉంది. హాకీలో పది రెట్లు ఉన్నట్లు ఫెమినిజమ్ ఇండియా నివేదిక అదే ఏడాది పేర్కొన్నది. 2015లో కేరళలో జరిగిన జాతీయ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో బహుమతిగా పురుషులకు రూ.1.2లక్షలు, మహిళలకు రూ.50వేలుగా నిర్ణయించటాన్ని నిరసిస్తూ తాను పోటీలలో పాల్గొనటం లేదని దీపికా పాలికల్ నిరాకరించింది. మనదేశ శ్రమశక్తి మార్కెట్‌లో వేతన వ్యత్యాసం పెద్ద సమస్యగా ఉంది. నరేంద్రమోదీ తన మన్‌కీ బాత్‌లో ఎన్నడూ దీని గురించి ప్రముఖంగా ప్రస్తావించినట్లు, తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎక్కడా కనిపించదు. కరోనా సమయంలో అంతకు ముందున్నదానికంటే వేతన వ్యత్యాసం ఏడుశాతం పెరిగిందని పిఎల్ఎఫ్ఎస్ సర్వే సమాచారం వెల్లడించింది.

ఉద్యోగాల్లో చేరటంలో ఒకే స్థాయిలో 46శాతం ఉన్నప్పటికీ సిఇఓ, సిఎఫ్ఓ, సిఓఓ వంటి ఉన్నత స్థానాల్లో 25శాతానికి మించి మహిళలు లేరని కెపిఎంజి, మరియు ఏఐఎంఏ 2024 సర్వేలో తేలింది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్నవారిలో మహిళలే ఎక్కువగా ఉన్నప్పటికీ వారికి సమానవేతనాలు లేకపోవటం ప్రసూతి సెలవు వంటి సామాజిక భద్రత లేని విషయం తెలిసిందే. శ్రామిక మహిళలకు 26వారాల ప్రసూతి సెలవు ఇవ్వాలనే చట్టసవరణ తరువాత అనేక మంది యజమానులు పిల్లల్ని కనేవయస్సులో ఉన్నవారిని పనిలో పెట్టుకోవటం తగ్గించటం లేదా రాజీనామా చేయించి తరువాత చేర్చుకోవటం వంటి పనులకు పాల్పడిన ఉదంతాలు ఉన్నాయి. స్త్రీని దేవతగా పూజించే దేశం కదా! కొన్నిదేశాల్లో తండ్రులకు కూడా పిల్లల సంరక్షణ సెలవులు ఇస్తున్న కారణంగా మహిళల నియామక వివక్ష కొంత మేర తగ్గింది. మనదేశంలో సైతం ఎందుకు దాన్ని ప్రవేశ పెట్టకూడదు? ఒకవైపు పురోగమనంలో ఉన్నామని చెబుతూ మహిళలను అణచివేసిన సనాతన ధర్మాన్ని, మనువాదాన్ని తలకెత్తుకుంటున్న శక్తులు రెచ్చిపోతున్న తరుణంలో పురుషులతో సమంగా స్త్రీలను చూసేందుకు అంగీకరిస్తారా !

# జనాభా కూర్పులో మార్పులు – సవాళ్లు

గ్యాన్ పాఠక్

ఐక్యరాజ్యసమితి సంస్థ అంచనా ప్రకారం భారతదేశ జనాభా పొందిక చాలా శీఘ్రంగా మారుతున్నది. 2025 ఏప్రిల్ నాటికి దేశ జనాభా 146 కోట్ల 39 లక్షలకు చేరినట్లు యుఎన్ఎఫ్‌పిఎ వారి 2025 ప్రపంచ జనాభా స్థితి నివేదిక (ఎస్ఒడబ్ల్యుపి) తెలిపింది. భారతదేశ సొంత నిపుణుల అంచనా 141 కోట్లు. వృద్ధిరేటు అంచనా కన్నా వేగం గా ఉండటం ముందున్న సవాళ్లలో ఒక భాగం మాత్రమే. రానున్న సంవత్సరాల్లో భారతదేశం ఎదుర్కోనున్న అసంఖ్యాక వాస్తవ సమస్యలను ఆ నివేదిక వెల్లడించింది.

కొట్టొచ్చినట్లు కనిపించే మార్పు ఫలదీకరణ రేటు 1.9కి పడిపోవటం. ఇది పునరుత్పత్తి ద్వారా జనాభా రిప్లేస్‌మెంట్ రేటు 2.1 కన్నా తక్కువ. అయినా సుమారు 40 సంవత్సరాల్లో జనాభా 170కోట్లకు చేరి, అక్కడనుండి తగ్గుదల మొదలవుతుంది. అధిక జనాభా, తక్కువ జనాభా అనే దానికన్నా ఫలదీకరణ లక్ష్యాలు చేరుకోలేకపోవటం నిజమైన సంక్షోభం. 2027 మార్చినెలలో జనాభా లెక్కలు సేకరణ ముగిసినపుడు జనాభా గూర్చి కచ్చితమైన సంఖ్యలు తెలుస్తాయి.

దీని అర్థం భారతదేశం ఆకలితీర్చాల్సిన కడుపుల సంఖ్య పెరుగుతుంది. వైద్యం, విద్య, ఉపాధి కల్పనకు అధిక నిధులు అవసరం. భారత్ తన దుర్భర దారిద్ర్యం స్థాయిని 2011–12లోని 27.1 శాతం నుంచి 5.3 శాతానికి తగ్గించిందని ప్రపంచబ్యాంక్ 2025 జూన్ నివేదికలో చెప్పినప్పటికీ, సవాళ్లు కొనసాగుతాయి, వాటిని అధిగమించటం చాలా కష్టం. ప్రపంచబ్యాంక్ దారిద్ర్యరేఖ ఇప్పటికీ రోజుకు రూ.250 (3డాలర్లు). అంతేగాక, వినిమయస్థాయిలో ప్రభుత్వం 80కోట్లమందికి ఇస్తున్న ఉచిత ఆహార ధాన్యాలు సహా సంక్షేమ కార్యక్రమాలు చేరి ఉన్నాయి. జీవనోపాధి మార్గాలు లేనందునే కదా ఆ 80కోట్లమంది ఇప్పటికీ ఆహారధాన్యాలు కొనుక్కోలేని స్థితిలో ఉన్నారు.

సాంఘిక సంక్షేమ పథకాలు దారిద్ర్యాన్ని భరించగల స్థితిలో ఉంచుతాయి. అయితే వాటిని దారిద్ర్య నిర్మూలనగా పరిగణిస్తున్నారు. పేదలు తాము జీవించటానికి అవసరమైన ఆర్జన చేయగలిగినప్పుడే దారిద్ర్యం తగ్గుతుంది. జనాభా పెరుగుదలతో ఈ సమస్యలు అనేక రెట్లు పెరుగుతాయి. అందువల్ల భారతదేశం తన ప్రజలకు ఆహారం, వైద్యం, విద్య, ఉపాధులు లభ్యం చేయటానికి సంసిద్ధం కావాలి.

ఎస్ఒడబ్ల్యుపి ప్రకారం 1970వ దశకంలో భారతదేశంలో మహిళలు సగటున దరిదాపు ఐదుగురు సంతానం కలిగి ఉన్నారు. ఇప్పుడది ఇద్దరికి చేరువలో ఉంది. 31 రాష్ట్రాలు/యుటిల్లో ఫలదీకరణ రేటు రిప్లేస్‌మెంట్ రేటు (2.1) కన్నా తక్కువగా ఉంది. అయితే బిహార్ (3.0), మేఘాలయ (2.9), ఉత్తరప్రదేశ్ (2.7)రేటు హెచ్చుగా ఉంది. పట్టణ–గ్రామీణ వ్యత్యాసం కొనసాగుతున్నది. 7 రాష్ట్రాలు గ్రామీణ ప్రాంతాల్లో రిప్లేస్‌మెంట్ ఫెర్టిలిటీ రేటును చేరుకోవాల్సి ఉంది. (రిప్లేస్‌మెంట్ రేటు అంటే చనిపోయేవారి సంఖ్యను జననాలు భర్తీ చేయటం).



ఈ వ్యత్యాసాల్లో ఇతర కోణాలూ ఉన్నాయి. అనేకమంది సంతానం కోరుకుంటారు, అయితే వారు కోరుకున్నప్పుడు పిల్లలు పుట్టరు. ఇతరులు గర్భధారణ కూడదనుకుంటారు, కాని నివారించలేరు. ఈ రెండు సమస్యలను చాలా మంది తమ జీవితకాలంలో ఎదుర్కొంటారు. కౌమార ప్రాయంలో గర్భధారణ రేటు హెచ్చుగా 15–19 సంవత్సరాల మహిళలు 1000 మందికి 14.1గా ఉంది. ఇది తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ప్రమాదకరం, అంతేగాక విద్య, ఉద్యోగ అవకాశాలను దెబ్బతీస్తుంది.

సంతానోత్పత్తి కోరుకోకపోవటానికి ఆర్థిక అభద్రత ప్రధాన ప్రతిబంధకంగా ఉంది. 10మందిలో నలుగురు దీన్ని ప్రధాన కారణంగా చెప్పారు. ఇంటి సమస్యలు (22 శాతం), ఉద్యోగ అభద్రత (21శాతం), పిల్లల్ని పెంచే శక్తి లేకపోవటం (18శాతం), ఆరోగ్య కారణాలు (15శాతం), గర్భధారణ జరగకపోవటం (13శాతం), గర్భసంబంధ సంరక్షణలు తగినంతగా లేకపోవటం ఇతర కారణాలు. భారత జనాభాలో 3.9శాతం నుంచి 16.8 శాతం వరకు గర్భధారణ రహిత స్థితిని ఎదుర్కొంటున్నారని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. మరో వైరుధ్యం–బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కోరుకోని గర్భధారణ, బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం లేకపోవటం సర్వసాధారణంగా ఉండ గా, తమిళనాడు, కేరళ, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో అనేకమంది దంపతులు ఖర్చులు, ఉద్యోగ పని ఒత్తిళ్ల కారణంగా సంతానాన్ని వాయిదా వేసుకుంటున్నారు. లేదా ఎడం పెంచుతున్నారు. గర్భధారణ రహిత సమస్యలకు భారతదేశం ప్రాధాన్యత ఇవ్వటంలేదు. ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకాల్లో దీన్ని చేర్చాలి. 2 కోట్ల 75లక్షల మంది దంపతులు గర్భధారణకు నోచుకోవటంలేదని అంచనా. అయినా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు పరిమితం. ప్రైవేటు వైద్యం ప్రధానంగా పట్టణాలకు పరిమితం, వ్యయం అపరిమితం. గర్భధారణ సంభవించకపోవటం భార్యాభర్తలు ఇద్దరి సమస్య అయినప్పటికీ సామాజిక దూషణ ఆడవారిపైనే (గొడ్రాలు) పరుషంగా ఉంటుంది. భారతదేశంలో భవిష్యత్ గూర్చి ఉన్న ఆందోళనలు సంతానోత్పత్తికి ఒకరకంగా అవరోధమవుతున్నాయని సుమారు 30శాతం మంది చెప్పినట్లు ప్రపంచ బ్యాంక్ నివేదిక పేర్కొన్నది. అన్ని జీవనరంగాలకు, ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలకు సంబంధించిన బహుముఖ సవాళ్లను సంఖ్యలు దాచిపెడుతున్నాయి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ ఉదాహరణగా సామాజిక – రాజకీయ సవాలును నివేదిక ప్రస్తావించింది. ఇద్దరు పిల్లలకు మించి ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయటాన్ని నిషేధించిన గత చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు రద్దు చేసింది. కుటుంబ నియంత్రణను విజయవంతంగా పాటించినందుకు తమ పార్లమెంటు సీట్లు తగ్గుతున్నాయని దక్షిణాది రాష్ట్రాలవారు గోసపెడుతున్నారు. లింగ సమానత్వం, మానవహక్కులు, వనరుల పంపిణీ, జనాభా పొందికను బట్టి ప్రత్యేక శ్రద్ధ వంటి సవాళ్లున్నాయి. ఉదాహరణకు 2025లో 0–14 వయోగ్రూపులో బాలల జనాభా 24శాతంగా, 10– 19 వయో గ్రూపులో 17శాతంగా, 10–14 గ్రూపులో 24శాతంగా, 15–64 వయో గ్రూపులో జనాభా 68శాతంగా, 65సంవత్సరాలకు పైన 7శాతంగా ఉన్నారు. కాబట్టి జనాభా పొందికలో వృద్ధుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వారి కోసం పథకాలతో ప్రభుత్వం సిద్ధం కావాలి. మనదేశ జనాభా చాలాపెద్దగా ఉన్నందున దాని జనాభా మార్పు సవాళ్లు కూడా పెద్దగానే ఉంటాయి. అధిక జనాభాను అధిక ప్రయోజనదాయకంగా దేశం మలుచుకోవాలి.

(ఐపిఎ సర్వీస్)

# డిఇఒలను నియమించండి.. పర్యవేక్షణ పెంచండి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చివరగా 2011లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల పోస్టులను భర్తీ చేశారు. వారంతా ప్రస్తుతం ప్రమోషన్లు పొంది ఉన్నత హోదాలో ఉన్నారు. వారిలో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌గా పని చేస్తున్న జి. రమేష్, అడల్ట్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న జి.ఉషారాణి, ఇతర ఉన్నత హోదాలో ఉన్న సోమిరెడ్డి, ఎ. సుబ్బారెడ్డి తదితరులను ఈ సందర్భంగా ఉటంకించవచ్చు. వీరంతా అప్పటి నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగంలోకి వచ్చిన వారే. అప్పటినుండి ఇప్పటివరకు ఆ పోస్టులు మళ్లీ భర్తీకి నోచుకోలేదు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లందరూ ఇన్‌ఛార్జిలే కావడం గమనార్హం. అట్లే 612 మండలాలలో 90 నుంచి 95 శాతం వరకు ఆయా మండలాలలోని సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులుగా ఇన్‌ఛార్జ్ విధులు నిర్వహిస్తున్నారు. వారంతా ఒకపక్క పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహిస్తూ అదనంగా మండల విద్యాశాఖ అధికారులుగా కొనసాగుతున్నారు. వీరే కాకుండా 33 జిల్లాలకు గాను 26 జిల్లాలకు జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా ఇన్‌ఛార్జిలే ఉండడం వల్ల విద్యాశాఖలో పర్యవేక్షణ పడకేసిందని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

ఒక గెజిటెడ్ ప్రధానోపాధ్యాయునికి మండల విద్యాధికారిగా ఇన్చార్జ్ బాధ్యతలను ఇవ్వడం వల్ల తన బడికి హెడ్‌మాస్టర్‌గానే కాకుండా తరగతి బోధకుడిగా, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడిగా, మండల విద్యాధికారిగా, పిఎంశ్రీ నోడల్ అధికారిగా ఇలా బహుళ పాత్రలను పోషించాల్సిన పరిస్థితి రావడంతో సొంత పాఠశాల పర్యవేక్షణ గాల్లో దీపంగా మారిపోయింది. పైపెచ్చు పెరిగిన పని ఒత్తిడి వల్ల బోధన చేయడం సాధ్యం కాకుండా పోతుంది. ఫలితంగా ఉపాధ్యాయుల పనితీరు, బోధన, హాజరు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు తదితర అంశాలను పర్యవేక్షించే తీరికే లేకుండా పోతుంది. అట్లే ఒక జిల్లా విద్యాధికారి రెండు, మూడేసి జిల్లాలకు జిల్లా విద్యాధికారిగా కొనసాగుతుండడంతో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయలేకపోతున్నామని, అట్లే తమ మాతృసంస్థలకు కూడా సరియైన న్యాయాన్ని చేకూర్చలేకపోతున్నామని చాలామంది ఇన్చార్జిలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అట్లే జిల్లా విద్యాధికారుల కింద ఉన్న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు కూడా ఇన్‌ఛార్జిలే కావడం గమనార్హం. ఇలా పర్యవేక్షణ అధికారులందరూ ఇన్‌ఛార్జిలుగా కొనసాగుతుండటంతో వికేంద్రీకరణకు బదులుగా కేంద్రీకరణ ఎక్కువగా జరుగుతున్నదని, విద్యావ్యవస్థకు మేలు కన్నా కీడే ఎక్కువ అని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

గత విద్యా సంవత్సరం సుమారు 11 వేల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కావడంతో పాటు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతులను కూడా చేపట్టడంతో కొంతమేర విద్యాబోధన గాడిలో పడినట్లయింది. బోధనా నైపుణ్యాల పెంపు కోసం ఎస్సీఈఆర్టీ ఉపాధ్యాయులకు వేసవి సెలవులలోనే వృత్యంతర శిక్షణను సైతం అందించింది. అయితే కేవలం బోధనా నైపుణ్యాలను పెంచడం ద్వారా మాత్రమే సత్ఫలితాలను ఆశించలేమని నిరంతరం పటిష్ట పర్యవేక్షణ కూడా అవసరమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. అంతేకాక ఇన్‌ఛార్జి పర్యవేక్షణాధికారుల ద్వారా అనుకున్న ఫలితాలు రాబట్టలేమని వారు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కొత్త నోటిఫికేషన్ ద్వారా ఖాళీగా ఉన్న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయడం ద్వారా సత్ఫలితాలను సాధించవచ్చునని, ఆ భర్తీ ప్రక్రియలో ఇప్పటికే క్షేత్రస్థాయి పరిస్థితులపై అవగాహన ఉండి, బోధన అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు కొంత వెయిటేజ్ ఇవ్వడం బాగుంటుందని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అట్లే ఖాళీగా ఉన్న మండల విద్యాధికారుల పోస్టులను కూడా భర్తీ చేయడం ద్వారా విద్యా వ్యవస్థ పూర్తిస్థాయిలో ప్రక్షాళనకు నోచుకునే అవకాశం ఉందని పలువురు విమర్శకులు సైతం విశ్లేషిస్తున్నారు.

ఖాళీగా ఉన్న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయడం ద్వారా పూర్తిస్థాయిలో పర్యవేక్షణపై దృష్టి కేంద్రీకరించడానికి అవకాశం ఏర్పడుతుంది. మండల స్థాయిలో ఎంఈఓ పాత్ర పోషిస్తున్న సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల స్థానంలో రెగ్యులర్ ఎంఈఓ ల నియామకం ద్వారా మరింత పర్యవేక్షణను పెంచవచ్చునని, తద్వారా ఇప్పుడున్న ఇన్‌ఛార్జిల మీద పని భారం తగ్గుతుందని మనో విజ్ఞానవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అట్లే ప్రభుత్వం కూడా చొరవ తీసుకుని విద్యాశాఖకు బడ్జెట్‌లో ఎక్కువ నిధులను కేటాయింపు చేయడం ద్వారా మౌలిక వసతులను కూడా కల్పించడానికి అవకాశం ఏర్పడుతుంది. కొఠారి కమీషన్ సిఫార్సుల మేరకు 30శాతం బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలి. కనీసం 20 శాతం అయినా కేటాయింపులు చేయడం ద్వారా తెలంగాణ విద్యా కమిషన్ చేసిన సూచనలకు సార్థకత లభించినట్లవుతుంది. ఇటు నిధుల కేటాయింపు ద్వారా విద్యా వ్యవస్థ పరిపుష్టికి దారి తీయగా అటు ఖాళీల భర్తీ ద్వారా పర్యవేక్షణ అధికారుల కొరత తీరి పర్యవేక్షణ పటిష్టంగా నిర్వహించబడుతుంది. తద్వారా విద్యా వ్యవస్థ తప్పక గాడిలో పడుతుందని ఆశించవచ్చు.

– భాస్కర్ యలకంటి
8919464488

# ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలి



కల్లూరు ధర్మేంద్ర
ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి
9705309583

దేశంలో సుసంపన్నమైన ఖనిజ సంపదకు పెట్టింది పేరైన ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాల్లో సాయుధ తిరుగుబాట్లను తుడిచిపెట్టడమే లక్ష్యంగా భద్రతా దళాలు మావోయిస్టులపై పూర్తిస్థాయి యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలలో విస్తరించిన కర్రెగుట్ట అటవీ ప్రాంతం ఇప్పుడు వార్‌జోన్‌గా మారిపోయింది. పదివేల మందికిపైగా సైనికులు ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను ఏరివేసే పనిలో నిమగ్నమయ్యారు. అటు కేంద్రంలోనూ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. ఈ సంవత్సరం ఇప్పటి వరకూ కనీసం 400 మంది మావోయిస్టులను హతమార్చింది.

దండకారణ్యం తుపాకుల గర్జనతో దద్దరిల్లుతున్నది. మావోయిస్టులతో పాటు గిరిజనుల నెత్తురు ఏరులై పారుతున్నది. ఆరు నెలలుగా ఏకధాటిగా కొనసాగుతున్న కూంబింగ్ ఆదివాసీ గూడాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. చిన్న అలికిడి జరిగినా, బూట్లచప్పుడు వినిపించినా వణికిపోయే పరిస్థితి. 'మావోయిస్టు రహిత భారత్' కోసమంటూ చేపట్టిన 'ఆపరేషన్ కగార్' నిజంగా నక్సల్స్‌ను నిర్మూలించడం కోసమేనా? అదే నిజమైతే ఆదివాసులను అడవుల నుంచి తరిమేయడం దేనికి? యథేచ్ఛగా మానవ హక్కుల్ని ఉల్లంఘిస్తూ చేస్తున్న ఈ మారణహోమం వెనుక ఉన్న ఉద్దేశమేంటి? ప్రజల్లో ఉద్భవిస్తున్న ఇలాంటి ప్రశ్నలకు కేంద్ర సర్కార్ సమాధానం చెప్పగలదా? ఎందుకంటే, స్వాతంత్ర్యం వచ్చినప్పటి ప్రభుత్వాలెన్నో మారినా మునుపెన్నడూ లేని విధంగా దేశం లో రాజ్యహింస పెచ్చరిల్లింది. దీనికి కారణాలేంటని లోతుగా పరిశీలిస్తే, అడవుల్లో మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ఉన్న ఖనిజ నిక్షేపాలు. అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు అప్పణంగా అటవీ సంపదను దోచి పెట్టేందుకే ఈ నరమేధం. 'ఖనిజ' వేట అందులో భాగమే.

ఛత్తీస్‌గడ్‌లో బొగ్గు, ఇనుము, సున్నపు రాయి, డోలమైట్, బాక్సైట్ నిక్షేపాలకు ప్రసిద్ధి. దేశంలో టిన్ ఖనిజాన్ని ఉత్పత్తి చేసే ఏకైక రాష్ట్రం ఇదే. లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపదపై దేశ బడా కార్పొరేట్ల కన్నుపడింది. అత్యున్నత స్థాయి గ్రేడ్ ఇనుప ఖనిజం (హెమటైట్)ను వారికి కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కేంద్రం ఒప్పందం కూడా చేసుకుంది. ఈఏడాది జనవరిలో ఏడువేల ఎకరాల్లో నాలుగు పదమూడవ ఖనిజ బ్లాకుల వేలానికి సిద్ధమైంది. అయితే ఈ ఖనిజ తవ్వకాలతో ఎక్కువ నష్టం జరిగేది అక్కడ నివసించే ఆదివాసులకే. అడవిని, వారిని విడదీసి చూడలేం. ఈ తెగలను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వాలు చేయని కుట్రలేదు. అందుకే ఆదివాసులు ఎన్నికష్టనష్టాలు ఎదురైనా అడవిని వదిలిపెట్టరు. పైగా ఇది మావోయిస్టులకు కూడా ఆసరాగా మారింది. ముందు మావోయిస్టులను నిర్మూలిస్తే, ఆదివాసులు వారంతావారే వెళ్లిపోతారని పాలకుల భావన! నారాయణపూర్, బస్తర్, బీజాపూర్, దంతెవాడ, కర్రెగుట్టల ప్రాంతాల్లో జరిగిన, జరుగుతున్న ఎన్ కౌంటర్లన్నీ ఆ కోవకు చెందినవే. ఇప్పటికే మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావు సహా చాలామంది చనిపోయా రు. అయితే ఈ ఎన్‌కౌంటర్లకు కోవర్టులు, పోలీసుల నిఘా వ్యవస్థలే కారణం తప్ప, అక్కడున్న ఆదివాసులు ఎంతమాత్రం కాదు. అత్యాధునిక యంత్రాలతో సిఆర్‌పిఎఫ్, కోబ్రా బెటాలియన్, డిఆర్‌డిఓ సహా ఇరవై నాలుగు వేలమంది జవాన్లు మావోయిస్టుల కోసం వేటాడుతున్నారు. ఆపరేషన్ కగార్ ఇక మావోయిస్టులకు ఆఖరి మజిలీ అంటూ మీడియాలో, మాధ్యమాల్లో పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. 2026 మార్చి నాటికి 'మావోయిస్టు రహిత భారత్' నిర్మిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాటల వెనుక దాగున్న 'ఆంతర్యం' కూడా ఇదే. అయితే, ఇది చివరిదా, మొదటిదా అనే చర్చకన్నా భారతదేశ ప్రజల హక్కుగా, వారి అభివృద్ధికి ఉపయోగపడాల్సిన ఖనిజాలను బహుళజాతి సంస్థలకు అప్పగించే చర్య ల్ని వ్యతిరేకించడంతో పాటు అడ్డుకోవడం ముఖ్యం. తక్షణం 'ఆపరేషన్ కగార్' వంటి పేర్లతో ఆదివాసీ ప్రాంతాలలో సాగిస్తున్న అన్ని రకాల సైనిక చర్యలను వెంటనే నిలిపివేయాలని, ఆదివాసీ ప్రాంతాల వనరుల రక్షణకు, ఆదివాసీ ప్రాంతాల హక్కుల పరిరక్షణకు ఎలాంటి భంగం వాటిల్లకుండా ప్రభుత్వం వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఆర్‌జెడి అధ్యక్ష పదవికి మరోసారి లాలూ యాదవ్ నామినేషన్



**లక్నో :** బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్‌జెడి పార్టీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్.. మరోసారి పార్టీ జాతీయ అధ్యక్ష పదవి కోసం నామినేషన్ వేశారు. ఆయన ఇప్పటివరకు 12 పర్యాయాలు పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు 13వ సారి పార్టీ అధ్యక్షుడు కాబోతున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు, బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ వెల్లడించారు. లాలూజీ మరోసారి పార్టీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడంతో పార్టీలో కార్యకర్తల నుంచి నాయకుల వరకు ప్రతిఒక్కరిలో సంతోషం వెల్లివిరిసిందని తేజస్వి అన్నారు. లాలూ నేతృత్వంలో బిహార్‌లో మరోసారి ఆర్‌జెడి అధికారంలోకి రాబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

# ప్రతిపక్షాలపై మోదీ చిన్నచూపు

## ప్రజలు సహించరు : కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



**రాయ్‌చూర్ :** కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విరుచుకుపడ్డారు. ప్రతిపక్షాలను చిన్నచూపుగా చూస్తున్నారని విమర్శించారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశాలకు ఆయన గైర్హాజరు కావడంపై మండిపడ్డారు. ప్రధాని గైర్హాజరు ప్రతిపక్షాల పట్ల ఆయనకున్న గౌరవాన్ని ప్రతిబింబిస్తుందని ఖర్గే అన్నారు. సోమవారం కర్నాటకలోని రాయ్‌చూర్‌లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఖర్గే పర్యటించారు. అక్కడ ఆయన అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రాయచూర్ విశ్వవిద్యాలయం నామకరణకార్యక్రమానికిఅధ్యక్షతవహించారు.బహిరంగసభలో పాల్గొని మాట్లాడారు. ఇటీవల జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు 26 మందిని కాల్చిచంపారని, ప్రతిగా భారత సాయుధ దళాలు పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశాయన్నారు. దేశాన్ని రక్షించడానికి యావత్ భారత దేశ ప్రజలు, సాయుధ దళాలు ఐక్యంగా పనిచేసినప్పటికీ, కొంతమంది వ్యక్తులు వ్యక్తిగత ఘనత పొందేందుకు ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. అటువంటి వారు ఆర్మీలో కెప్టెన్, కల్నల్ లేదా లెఫ్టినెంట్ కల్నల్‌గా పనిచేసి ఉంటే గొప్ప పని చేసినందుకు, దేశం కోసం పోరాడినందుకు అభినందనలు తెలియజేస్తామని, కానీ అలాంటి వ్యక్తులు కాదు కదా అని ఖర్గే ఎవరినీ నేరుగా పేర్కొనకుండా వ్యాఖ్యానించారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసిన తొలి పార్టీ కాంగ్రెస్ అని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు చెప్పారు. రెండుసార్లు సమావేశాలు ఏర్పాటు చేసినా ప్రధానమంత్రి హాజరు కాలేదని, అంత తీరిక లేకుండా ఉన్నారా అని ప్రశ్నించారు. కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు నాయకులు సమావేశానికి హాజరు కావడానికి ముఖ్యమైన పనులన్నింటినీ వదిలివేశారని, అయితే ప్రధానమంత్రి దేశంలో ఉన్నప్పటికీ హాజరు కాకూడదని నిర్ణయించుకున్నారని ఆరోపించారు. అఖిలపక్ష సమావేశానికి హాజరు కాకుండా బిహార్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారని, దాని అర్థం ఏమిటి అని నిలదీశారు. దేశం, సైనికులు ఒకవైపు పోరాడుతుండగా, ప్రధానమంత్రి మరో వైపు ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నారని, తమను అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించి ప్రధాని అలా చేయడం తగదన్నారు. అటువంటి వైఖరి మంచిది కాదని హెచ్చరించారు. ప్రతిపక్షాన్ని తక్కువ చేసి మాట్లాడటానికి ప్రయత్నిస్తే, నాయకులు, ప్రజలు, ముఖ్యంగా ఈ దేశ యువత సహించదని ఘాటుగా స్పందించారు. అమెరికా ప్రతీకార పన్నులు విధించకుండా ఆపడంలో విఫలమైనందుకు ఖర్గే ప్రధానిని కూడా విమర్శించారు. 'మోదీ 'ఫిర్ ఏక్ బార్ ట్రంప్ సర్కార్' (అమెరికా ఎన్నికల సమయంలో) అనే నినాదాన్ని ఎత్తుకున్నారు. కానీ ట్రంప్ భారతీయ వస్తువులపై భారీ పన్నులు విధించారు. దీనిపై ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదని దుయ్యబట్టారు.

### ఇరాన్‌పై యుద్ధాన్ని ఆపాలి

ఇరాన్ తన ఇంధన అవసరాలలో 50 శాతం అక్కడి నుండే దిగుమతి చేసుకుంటున్నందున, ఇరాన్ ఎల్లప్పుడూ భారతదేశానికి మద్దతు ఇస్తుందని కాంగ్రెస్ చీఫ్ ప్రధానమంత్రికి గుర్తు చేశారు. 'ఇప్పుడు ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పోరాటం జరుగుతోంది. దానిని ఆపడానికి మనం ప్రయత్నాలు చేసి ఉండాలి' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అన్నారు. మోదీ 'విశ్వ గురువు' కాబోతున్నాడనేది ఆయన దృఢ నినాదమని ఖర్గే అన్నారు. మీరు విశ్వ గురువు అయినా లేదా ఇంట్లో గురువు అయినా, ప్రజలు కోరుకునేది పెట్రోల్, డీజిల్, ఆహారం, బట్టలు, తలపై పైకప్పు అని, వీటి కోసం కృషి చేయాలని కోరుతున్నామన్నారు. విద్యను కాషాయీకరణ చేస్తున్నారని ఖర్గే ఆరోపించారు. నేడు విశ్వవిద్యాలయాలు, మొరార్జీ దేశాయ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలలో ఆర్‌ఎస్‌ఎస్ సిలబస్ బోధిస్తున్నారని ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తులు తమ పిల్లలకు పోస్టింగ్‌లు పొందుతున్నారని, మరికొందరు మనుగడ కోసం కష్టపడుతున్నారని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ హామీలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసంకాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న విధంగా, దేశంలో ఎక్కడా బిజెపిఆవిధంగా చేయలేదని పేర్కొన్నారు.

## యుపి సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా అరవింద్ స్వరూప్



**లక్నో:** ఉత్తర్‌ప్రదేశ్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా అరవింద్ రాజ్ స్వరూప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ప్రధాని మోదీల ద్వయాన్ని ఓడించాలని, వామపక్ష లౌకిక ప్రజాస్వామ్యప్రతిఘటనను నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. మహాసభలు మథురలో జరిగాయి. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మహాసభను ప్రారంభించగా, జాతీయ కార్యదర్శులు రామకృష్ణ పాండ, డాక్టర్ గిరీశ్ చంద్ర శర్మ, సీనియర్ నాయకులు ఇంతియాజ్ అహ్మద్ ప్రసంగాలు చేశారు.

## ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండించలేరా? : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** మోదీ ప్రభుత్వం ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండించకపోవడం, ఇజ్రాయెల్ దురాక్రమణను విమర్శించకపోవడం పట్ల కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. మోదీ సర్కార్ కనీసం నైతిక ధైర్యాన్ని ప్రదర్శించాలని ఎద్దేవా చేసింది. అంతేకాదు, 'ఇరాన్–ఇజ్రాయెల్‌లు ఘర్షణలకు బదులుగా దౌత్య చర్చలు జరపాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హితబోధ చేశారు. కానీ తన మాటనే అపహాస్యం చేస్తూ ఇరాన్‌పై నేరుగా వైమానిక దాడి చేశారు' అని విమర్శించింది. 'ఇరాన్‌తో భారత్ తక్షణమే దౌత్య, చర్చలు జరపాల్సిన ఆవశ్యకత ఉంది. భారత ప్రభుత్వం ఇప్పటి వరకు ఉన్నదాని కంటే ఎక్కువ నైతిక ధైర్యాన్ని ప్రదర్శించాలి' అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. 'ఇరాన్‌పై అమెరికా చేసిన బాంబుదాడిని, ఇజ్రాయెల్ దురాక్రమణను, అది చేసే బాంబు దాడులను, టార్గెటెడ్ హత్యలను మోదీ ప్రభుత్వం నిస్సందేహంగా విమర్శించలేదు. ఖండించలేదు' అని జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. గాజాలోని పాలస్తీనియన్లపై జరుగుతున్న మారణ హోమంపై కూడా మోదీ సర్కార్ మౌనం వహిస్తోందని జైరాం రమేశ్ అన్నారు. ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అనే మూడు ప్రధాన అణుకేంద్రాలపై అమెరికా బాంబు దాడులు చేసి నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

## ముగ్గురు ఎమ్మెల్యేలను బహిష్కరించిన ఎస్‌పి

### బిజెపితో సంబంధాలున్నాయని ఆరోపణ

**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) కీలక నిర్ణయం తీసుకున్నది. అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని ఈ పార్టీ ముగ్గురు ఎమ్మెల్యేలను బహిష్కరించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతోపాటు బిజెపితో వారికి సంబంధాలున్నట్లు ఆరోపించింది. గోసాయిగంజ్ ఎమ్మెల్యే అభయ్ సింగ్, గౌరీగంజ్ ఎమ్మెల్యే రాకేష్ ప్రతాప్ సింగ్, ఉంచహార్ ఎమ్మెల్యే మనోజ్ కుమార్ పాండేను పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఎక్స్‌లో పేర్కొంది. కాగా, ఈ ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, మతపరంగా విభజన సృష్టించే ప్రతికూల భావజాల పార్టీతో సంబంధం కలిగి ఉన్నారని సమాజ్‌వాదీ పార్టీ ఆరోపించింది. తమ రాజకీయ వైఖరిని పునఃపరిశీలించేందుకు ఇచ్చిన సమయం ముగిసినట్లు పేర్కొంది.నేపథ్యంలో పార్టీతోపాటు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ ముగ్గురు ఎమ్మెల్యేలను బహిష్కరించాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. బహిష్కరించిన ఎమ్మెల్యేలు2024లోజరిగిన రాజ్యసభ ఎన్నికల సమయంలోపార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి ఓటు వేశారని ఆరోపించింది.

## ఆ ఇద్దరికీ ఐదు రోజుల రిమాండ్

**శ్రీనగర్ :** పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన నలుగురు ముష్కరులకు ఆశ్రయమిచ్చిన నిందితులను జమ్ము కోర్టుఐదు రోజులపాటు ఎన్ఐఏ రిమాండ్‌కు అప్పగించింది. నిందితులు పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్‌లను ఎన్ఐఏ అధికారులు సోమవారం జమ్ము కోర్టులో హాజరుపర్చగా.. అదనపు న్యాయమూర్తి, సెషన్ జడ్జిలు ఐదురోజుల రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కేసు తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో నలుగురు ముష్కరులు పర్యాటకులే లక్ష్యంగా మారణహోమం సృష్టించారు. మహిళలను, చిన్నారులను వదిలేసి పురుష పర్యాటకులు ఒక్కొక్కరిని పేర్లు అడుగుతూ కాల్చిచంపారు. మొత్తం 26 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో 25 మంది భారతీయులు కాగా, ఒక నేపాలీ ఉన్నారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదుల కోసం దర్యాప్తు అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఆ ఉగ్రవాదులకు పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్ అనే ఇద్దరు వ్యక్తులు ఆశ్రయం ఇచ్చినట్లు గుర్తించిన అధికారులు రెండు రోజుల క్రితం అరెస్ట్ చేశారు. ఇవాళ జమ్ముకోర్టులో హాజరపర్చగా ఐదురోజులపాటు ఎన్ఐఏ రిమాండ్‌కు అప్పగించారు.

# పంజాబ్, గుజరాత్‌లో 'ఆప్' విజయం


### దేశంలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికల ఫలితాలు వెల్లడి



**న్యూఢిల్లీ :** నాలుగు రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఈనెల 19న ఐదు నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. గుజరాత్‌లోని విశావదర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఆప్ అభ్యర్థి గోపాల్ ఇటాలియా విజయం సాధించగా, పంజాబ్‌లోని లూథియానా పశ్చిమ స్థానాన్ని కూడా పార్టీ నిలుపుకుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కేరళలోని అధికార ఎల్‌డిఎఫ్ నుండి నీలంబూర్ నియోజకవర్గాన్ని కైవసం చేసుకుంది. గుజరాత్‌లోని అధికార బిజెపి కాడి స్థానాన్ని నిలుపుకోగా, పశ్చిమ బెంగాల్‌లోని నాడియా జిల్లాలోని కాలిగంజ్ అసెంబ్లీ స్థానంలో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) గుజరాత్ యూనిట్ మాజీ అధ్యక్షుడు ఇటాలియా జునాగఢ్ జిల్లాలోని విశావదర్ స్థానంలో తన సమీప ప్రత్యర్థి బిజెపి అభ్యర్థి కిరిత్ పటేల్‌ను 17,554 ఓట్ల తేడాతో ఓడించారు. రాష్ట్రంలో దాదాపు పూర్తి ఆధిపత్యం ఉన్నప్పటికీ, 2007 నుండి బిజెపి విశావదర్ స్థానాన్ని గెలుచుకోలేదు. అప్పటి ఆప్ శాసనసభ్యుడు భూపేంద్ర భయానీ రాజీనామా చేసి అధికార బిజెపిలో చేరడంతో డిసెంబర్ 2023లో ఆ స్థానం ఖాళీ అయింది. పంజాబ్‌లో అధికార ఆప్ లూథియానా పశ్చిమ అసెంబ్లీ స్థానాన్ని మరో సారి కైవసం చేసుకుంది. పార్టీ అభ్యర్థి సంజీవ్ అరోరా తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి భరత్ భూషణ్ అషుపై 10,637 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం, అరోరా 35,179 ఓట్లు సాధించగా, అషు 24,542 ఓట్లు సాధించారు. బిజెపికి చెందిన జీవన్ గుప్తా 20,323 ఓట్లు సాధించగా, శిరోమణి అకాలీదళ్ అభ్యర్థి పరూప్కర్ సింగ్ ఘుమాన్ 8,203 ఓట్లు సాధించారు. జనవరిలో ఆప్ ఎమ్మెల్యే గురుప్రీత్ బస్సీ గోగి మరణంతో ఉప ఎన్నిక తప్పనిసరి అయింది. ఇక షెడ్యూల్డ్ కుల అభ్యర్థులకు రిజర్వ్ చేయబడిన మెహ్సానా జిల్లాలోని కడి స్థానాన్ని బిజెపికి చెందిన రాజేంద్ర చావ్డా కాంగ్రెస్‌కు చెందిన రమేష్ చావ్డాపై 39,452 ఓట్ల తేడాతో గెలుచుకున్నారు. బిజెపి ఎమ్మెల్యే కర్సన్ సోలంకి మరణంతో ఫిబ్రవరిలో కడి స్థానం ఖాళీ అయింది. కేరళలో, ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ నీలంబూర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని 11,077 ఓట్ల తేడాతో కైవసం చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆర్యదన్ షౌకత్ సిపిఐ(ఎం) నేత ఎం. స్వరాజ్‌పై విజయం సాధించారు. ఎల్‌డిఎఫ్ మద్దతుగల స్వతంత్ర అభ్యర్థి, రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన పివి అన్వర్ రాజీనామా చేయడంతో నీలంబూర్ స్థానం ఖాళీ అయింది. పశ్చిమ బెంగాల్ లో, నదియా జిల్లాలోని కాలిగంజ్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో అధికార తృణమూల్ కాంగ్రెస్ అలిఫా అహ్మద్ గెలుపొందారు. తన ప్రత్యర్థి బిజెపి అభ్యర్థి అశీశ్ గోష్‌పై 50,049 ఓట్ల మెజారిటీ సాధించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సిట్టింగ్ టిఎంసి ఎమ్మెల్యే నసీరుద్దీన్ అహ్మద్ మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆయన కుమార్తె అలీఫా అహ్మద్‌ను పార్టీ బరిలోకి దింపింది.

## హార్మూజ్ మూసివేత అంత సులభమేనా?

### ప్రపంచానికి చమురు కష్టాలొస్తాయా?
### ఐదు నెలల గరిష్ఠస్థాయికి పెరిగిన చమురు ధర



**టెహ్రాన్ :** శత్రుదేశాలను ఎదురు దెబ్బ తీసేందుకు చాలా తక్కువ ప్రత్నామ్యాయాలు ఉండటంతో హార్మూజ్ జలసంధిని మూసివేసేందుకు ఇరాన్ సన్నద్ధమవుతోంది. ఈ జలసంధి ద్వారా ప్రతి రోజూ 2.10 కోట్ల బ్యారెళ్ళ ముడి చమురు రవాణా అవుతూ ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా 21శాతం ముడి చమురు హార్మూజ్ జలసంధి మీదుగానే రవాణా అవుతోంది. కానీ జలసంధిని మూసివేయడం అంత సులభమైనదేమీ కాదని మధ్యప్రాచ్య నిపుణులు చెబుతున్నారు. ప్రపంచానికి చమురు కష్టాలు వస్తాయా? అనే విషయం పైనే ప్రధానంగా అన్ని దేశాల్లో ఆర్థిక నిపుణులు చర్చ చేస్తున్నారు. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ధీమాగా ఉన్నప్పటికీ హార్మూజ్ జలసంధి మూసేస్తే ఆ దేశానికి కూడా చమురు కష్టాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ జలసంధిని మూసివేసేందుకు ఆదివారంనాడు ఇరాన్ పార్లమెంటు ఆమోదముద్రవేసిన నేపథ్యంలో ముడిచమురు ధరలు అనూహ్యంగా పెరిగిపోయాయి. ఐతే ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతావిభాగం నుండి ఇంకా అనుమతి రావాల్సి ఉంది. ఒకవేళ హార్మూజ్ జలసంధిని మూసేస్తే తీవ్ర నష్టం జరుగుతుంది. అమెరికాకు కూడా ఈ సెగ తగులుతుంది. అందువల్ల హార్మూజ్ జలసంధి తీరప్రాంతాల వెంబడి పశ్చిమ ఆసియాలో అమెరికా స్థావరాలలో ఉన్న సైన్యం మళ్ళీ దాడులు చేసే అవకాశాన్ని నిపుణులు తోసిపుచ్చడంలేదు. ఈ గందరగోళ పరిస్థితులమధ్య ఎర్లీ ట్రేడింగ్‌లో ముడిచమురు ధరలు ఐదు నెలల గరిష్ఠస్థాయికి పెరిగాయి. తదుపరి ఇరాన్ ఎలాంటి ప్రతీకార చర్యలకు దిగుతుందా? అని మార్కెట్ వ్యవస్థలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. తొలుత బ్రెంట్ క్రూడ్ ధర 5.7 శాతం పెరిగింది. దీంతో ఒక బ్యారెల్ ధర 81.40 డాలర్లకు చేరింది. తర్వాత ఉద్రిక్తతలు కొనసాగినప్పటికీ కూడా ఇరాన్ తదుపరి చర్యల ప్రకటన రాకపోవడంతో ఈ ధర 78 డాలర్లకు తగ్గింది. బహ్రైన్‌లో అమెరికాకు చెందిన ఫిఫ్త్ ఫ్లీట్ నావికాదళం తిష్ఠవేసుకుని ఉన్నందువల్ల అంతసులభంగా హార్మూజ్ జలసంధిని మూసివేయడం ఇరాన్‌కు సాధ్యంకాదన్న విషయం వ్యాప్తిలోకి వచ్చింది. తొలుత ఆసియా ట్రేడింగ్‌లో కూడా బ్రెంట్ క్రూడ్ ధర 80 డాలర్లకు పెరిగింది. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం 11వ రోజు కూడా కొనసాగుతున్నది.

### ఇరాన్‌ను ఆపండి : చైనాకు అమెరికా విజ్ఞప్తి

హార్మూజ్ జలసంధిని మూసివేయకుండా ఇరాన్‌ను అడ్డుకోవాలని చైనాకు అమెరికా విజ్ఞప్తి చేసింది. హార్మూజ్ జలసంధి ద్వారా ప్రతి రోజూ రవాణా అయ్యే ముడి చమురు, ఖనిజవాయువులో 70 శాతం పైగా చైనా దేశానికే రవాణా అవుతుంది. గత నెలలో గణాంకాల ప్రకారం చైనా దేశం ఇరాన్ నుండి రోజుకు 10.80 లక్షల బ్యారళ్ళ కంటే ఎక్కువగా ముడి చమురు దిగుమతి చేసుకుంది. తర్వాత స్థానాల్లో భారత్, జపాన్, దక్షిణ కొరియా దేశాలున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న చమురు నిక్షేపాలకు అతిపెద్ద ప్రధాన కొనుగోలుదారు చైనా దేశమే కావడంతో ఇరాన్‌ను అడ్డుకోవాలని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో ఈ విజ్ఞప్తి చేశారు. ఇరాన్‌లో అత్యున్నతస్థాయిలో నిర్ణయం తీసుకునే జాతీయ భద్రతా మండలి ఆమోదం లభిస్తే ఇక తదుపరి ఆదేశాలు వచ్చేవరకూ హార్మూజ్ జలసంధి మూతపడినట్టే. ఇరాన్‌తో చైనాకు సన్నిహిత సంబంధాలు ఉండటం, అతిపెద్ద చమురు కొనుగోలుదారు చైనాయే కావడంతో ఆ దేశాన్ని సంప్రదించకుండా ఇరాన్ ఎలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం లేనందువల్ల తాము ఈ విజ్ఞప్తి చేస్తున్నట్లు మార్కో రుబియో ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఈ జలసంధిని మూసేస్తే ప్రపంచానికి చాలా తీవ్రమైన నష్టాలు, ఆర్థిక సమస్యలు సంభవిస్తాయని ఆయన హెచ్చరించారు. ప్రపంచంలో 21 శాతం చమురు, ఖనిజ వాయువు రవాణా ప్రతి రోజూ ఈ జలసంధి ద్వారానే జరుగుతుంది. కనీసం కొన్ని గంటలు, రోజులు ఈ జలసంధి మూతపడినాగానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తీవ్రనష్టం సంభవిస్తుంది.

## అంగన్‌వాడీ లబ్ధిదారులకు ముఖ గుర్తింపు వద్దు : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** అంగన్‌వాడీ లబ్ధిదారులకు ముఖ గుర్తింపు ప్రామాణీకరణను తప్పనిసరి చేయాలని మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశించడంపై కాంగ్రెస్ మండిపడింది. సమాజంలోని అత్యంత దుర్బల వర్గాలను సామాజిక సంక్షేమ హక్కుల నుండి తప్పించడానికి ఒక క్రమపద్ధతిలో సాంకేతికతను ఉపయోగిస్తోందని ఆరోపించింది. డిజిటల్ ఇండియా అమలు కావాలి, దానిని నిర్వీర్యపరచకూడదు కానీ, ఇది 'ప్రీచ్ ఇంక్లూజన్ ప్రాక్టీస్ ఎక్స్‌క్లూజన్ (పిఐపిఇ) కల'గా మిగిలిపోకూడదని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. అంగన్‌వాడీ కేంద్రాలలో రేషన్ పంపిణీ, పిల్లల హాజరు పర్యవేక్షణ కోసం తప్పనిసరి ముఖ గుర్తింపు వ్యవస్థను అమలు చేయాలని మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. గత నెలలో మంత్రిత్వ శాఖ జారీ చేసిన లేఖ ప్రకారం పోషన్ ట్రాకర్ అప్లికేషన్‌లోని లబ్ధిదారుల ప్రొఫైల్‌లలో ముఖ గుర్తింపు ఫీచర్ ఇప్పుడు అందుబాటులో ఉంటుంది. ఇకెవైసి, ఫొటో క్యాప్చర్ కోసం ట్రాకర్ సిటిజన్ మాడ్యూల్‌ని ఉపయోగించి లబ్ధిదారులు స్వీయ నమోదు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఈ పరిణామంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ స్పందించారు. సమాజంలోని అత్యంత దుర్బల వర్గాలను సామాజిక సంక్షేమ హక్కుల నుండి తప్పించడానికే మోదీ ప్రభుత్వం క్రమపద్ధతిలో సాంకేతికతను ఉపయోగిస్తోందని ఆరోపించారు. మొదట ఉపాధిహామీ పథకం నుండి కోట్లాది మంది కార్మికులను నిరోధించడానికి ఆధార్‌ను ఆయుధంగా ఉపయోగించారన్నారు. యాసిడ్ దాడి బాధితులు ఆధార్‌లో నమోదు చేసుకోవడానికి కోర్టులో పోరాడాల్సి వచ్చిందని, దేశవ్యాప్తంగా ఆదివాసీలు ఇప్పటికీ సాంకేతిక లోపాల కారణంగా రేషన్ కోల్పోతున్నారని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇప్పుడు, గర్భిణీలు ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ కింద ప్రాథమిక, చట్టపరమైన హక్కుల కోసం ముఖ గుర్తింపు సాంకేతికతతో కొత్త అడ్డంకిని ఎదుర్కొంటున్నారని ఆవేదన చెందారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజనలో ఎబిపిఎస్ ప్రవేశపెట్టడం వల్ల అర్హులైన లబ్ధిదారులు (అంటే గర్భిణీలు, పాలిచ్చే మహిళలు) ఈ పథకం నుండి ప్రయోజనం పొందే సామర్థ్యంపై ప్రభావం చూపిందని, విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన 365వ నివేదికలో పేర్కొన్నట్లు ఆయన ఎత్తి చూపారు. మోదీ ప్రభుత్వం మరో వివక్షత కలిగిన సాంకేతికతను తీసుకువస్తుందన్నారు.



నాసిక్ :సిపిఐ మహారాష్ట్ర రాష్ట్ర 25 వ మహాసభలు నాసిక్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాసభ ప్రారంభసూచికగా వేలాది మందితో భారీ ప్రదర్శన జరిగింది. ర్యాలీకి ముందు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీని నిర్వహించారు. విద్యార్థులు, యువకులు, మహిళలు, కార్యకర్తలు 'జై భీమ్.. లాల్ సలాం..' నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. సిపిఐ జెండాను జాతీయ కార్యదర్శి డాక్టర్ బాలచంద్ర కాంగో ఆవిష్కరిచగా, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ఈ మహాసభలను లాంఛనంగా ప్రారంభించారు. మహారాష్ట్ర నలుమూలల నుండి 400 మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటున్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాజన్ క్షీరసాగర్, మహారాష్ట్ర సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సుభాష్ లాండే, నాయకులు రామ్ బహేతి, రాజు దేశాలే, తుకారాం భాస్మే, ప్రకాష్‌రెడ్డి, తదితరులు మహా సభలో ప్రసంగించారు.





# జనరల్
STATE & REGIONAL NEWS

## పురపాలక శాఖలో బదిలీలు, పదోన్నతులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలోని 12 మంది స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లకు సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లుగా పదోన్నతులు కల్పిస్తూ శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. 15 రోజుల్లో పదోన్నతుల పోస్టులో జాయిన్ కావాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. పదోన్నతులు పొందిన వారిలో సి.అరుణకుమారి, టి.యాదయ్య, సి.హెచ్.మధుకిరణ్, పి.మోహన్‌రెడ్డి, ఎంకెఐ.అలీ, కె.మల్లిఖార్జున్‌రావు, జి.ఉమప్రకాష్, కె.నారాయణ రావు, బి.యాదయ్య, కె.రవికుమార్, కె. ఫల్గుణ్ కుమార్, డి. బాలయ్య ఉన్నారు.
యాదయ్య ప్రస్తుతం జిహెచ్ఎంసిలో హయత్ నగర్ సర్కిల్ డిసిగా, ఉమ ప్రకాశ్ ప్రస్తుతం జిహెచ్ఎంసిలో ఎస్టేట్ ఆఫీసర్‌గా ఉన్నారు. నారాయణ రావు, ఫల్గుణ్ కుమార్‌లు ప్రస్తుతం పురపాలక శాఖలో జాయింట్ డైరెక్టర్లుగా పనిచేస్తున్నారు.



## రాష్ట్రంలో ఉపాధి హామీ జోరందుకుంది

* కేంద్రం కేటాయించిన ఆరున్నర కోట్ల పనిదినాల్లో 4.58 కోట్ల పనిదినాలు పూర్తి
* గతం మాదిరిగా 12 కోట్ల పనిదినాలు కేటాయించాలని కేంద్రప్రభుత్వానికి మంత్రి సీతక్క లేఖ
* ఈ ఏడాది ఇప్పటివరకు 18.9 లక్షల కుటుంబాల్లోని 28.48 లక్షల మందికి పని

**ప్రజాపక్షం/హైదరాబాద్**

రాష్ట్రంలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. కేంద్రం కేటాయించిన ఆరున్నర కోట్ల పనిదినాల్లో ఇప్పటికే 4.53 కోట్ల పనిదినాలను రాష్ట్రం పూర్తి చేసింది. మొత్తం కేటాయించిన పని దినాల్లో 70 శాతం లక్ష్యాన్ని తెలంగాణ రాష్ట్రం చేరుకున్నది. దీంతో గతంలో మాదిరిగా 12 కోట్ల పని దినాలు తెలంగాణకు కేటాయించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాశారు. పని దినాలు రెట్టింపు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అపాయింట్ మెంట్ రాగానే కేంద్ర పెద్దలను కలిసి, ఉపాధి పని దినాలను కనీసం 12 కోట్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం నుంచి అనుమతులు వస్తాయనే విశ్వాసంతోనే ఉపాధి హామీ పనులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసిందన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 18.9 లక్షల కుటుంబాల్లోని 28.48 లక్షల మంది ఉపాధి కూలీలకు పని కల్పించారు. ఒక్కో కుటుంబం సగటున 24 రోజుల పని దినాలను పూర్తి చేసుకున్నారని, 1127 కుటుంబాలు వంద రోజుల పని దినాలను పూర్తి చేసుకున్నాయని మంత్రి సీతక్క తెలిపారు. సగటున ఒక్కో కూలీకి రూ.250.75 రోజువారి వేతనం వస్తుందని, అయితే రోజు వారి వేతనం రూ.307 దక్కెలా చర్యలు తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తూ కూలీ గిట్టుబాటు అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. ఉపాధి హామీ పనుల్లో భాగంగా వ్యవసాయ అనుబంధ పనులకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. ఉపాధి హామీ పనుల్లో 60 శాతం పనులు వ్యవసాయ అనుబంధ పనులు చేయించాలని లక్ష్యం పెట్టుకోగా, వ్యవసాయ అనుబంధ పనులు 50 శాతంగా నమోదయ్యాయి. జిపి భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, సిసి రోడ్ల వంటి మలిక వసతుల కల్పన పనులు లక్షా 31 వేలకు పైగా కొనసాగుతున్నాయి. ఉపాధి హామీ పనుల్లో ఉపాధి కల్పనతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సదుపాయాల కల్పన, ఆస్థుల సృష్టికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రధాన్యతనిస్తోందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. మే మాసం ముగిసే నాటికి ఉపాధి హామీలో భాగంగా రూ.1416 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. అందులో రూ.1151.67 కోట్లు వేతనాలు కాగా, రూ.191.03 కోట్లు మేటిరియల్ కాంపోనెంట్‌గా నమోదైంది. కేంద్రం నుంచి నిధుల విడుదలతో జాప్యం అయినా కూలీలకు ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభు త్వం ఎప్పటికప్పుడు వేతనాలను ఉపాధి కూలీల ఖాతాల్లో జమ చేస్తోంది. ఇప్పటి వరకు కూలీల ఖాతాల్లో 733.52 కోట్లు జమ అయ్యాయి. వ్యవసాయ అనుబంధ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుండటంతో ఉపాధి పనులకు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. గత ఏడాదితో పొలిస్తే ఉపాధి పని దినాలను సగానికి కేంద్ర ప్రభుత్వం కుదించింది.

## బిసి చేతివృత్తులకు చేయూత

బోనాల ఉత్సవాల సందర్భంగా ఎగ్జిబిషన్

బిసి చేతివృత్తుల కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం

మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం బోనాల పండుగ ఉత్సవాల సందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 25 నుండి 29 వరకు ఐదు రోజులు బిసి చేతివృత్తుల కళాకారుల ద్వారా తయారుచేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, అమ్మకం ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ట్యాంక్ బండ్ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం పక్కన ఉన్న స్థలంలో ప్రతిష్టాత్మకంగా ఈ ఎగ్జిబిషన్ ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రదర్శనలో కుమ్మరులు వారు తయారుచేసిన మట్టిపాత్రలు, గౌడ్‌ల 'నీరా', స్టైల్, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు, పూసలవారి సామగ్రి అలాగే పోచంపల్లి, గద్వాల, నారాయణపేట మొదలైన చేనేత ఉత్పత్తులు, ఇతర బిసి వర్గాలు తయారు చేసిన వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. ఇది కాకుండా తెలంగాణ వంటకాలు, గంగపుత్రుల ద్వారా చేప వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయత్రం 9:30గంటల వరకు ఉంటుందన్నారు. ఎగ్జిబిషన్‌లోకి ఉచిత ప్రవేశం కల్పించామని చెప్పారు. బిసి చేతివృత్తుల వారి పర్యావరణ హితమైన ఉత్పత్తుల ప్రదర్శనకు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని మంత్రి కోరారు. ఈ ప్రదర్శనను తిలకించి, వారికి నచ్చిన వస్తువులు, పర్యావరణ హితమైన, ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఉత్పత్తులు కొనుగోలుచేసి చేతివృత్తుల వారికి చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రదర్శన విజయవంతం చేయాలని బిసి సంక్షేమ శాఖ తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.



## దేశ సమగ్రత కోసం బలిదానం చేసిన ముఖర్జీ

కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ సమగ్రతను కాపాడాలన్న సంకల్పంతో, ఆ ఆలోచనను పూర్తిగా కార్యరూపం దాల్చేందుకు ముందడుగు వేసిన డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ తన జీవితాన్ని బలిదానం చేశారని కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడ జి.కిషన్‌రెడ్డి అన్నారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దివాస్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ లక్ష్యాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2019లో నెరవేర్చారన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో పాటు జమ్ము కశ్మీర్లో దళితులకు, మహిళలకు దేశంలోని ఇతర ప్రాంతాలవారిలా సమాన హక్కులు కల్పించబడ్డాయన్నారు. జమ్ము కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమైనప్పుడు అక్కడ ప్రత్యేక ప్రధానమంత్రి, ప్రత్యేక హక్కులు, ప్రత్యేక అధికారాలు ఎలా ఉంటాయంటూ డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ ప్రశ్నించారన్నారు.

## నోబెల్‌కు ట్రంప్ పేరు సిఫార్సుపై పునరాలోచన

ప్రభుత్వానికి పాక్ రాజకీయవేత్తల డిమాండ్

**ఇస్లామాబాద్ :** నోబెల్ బహుమతికి ట్రంప్ పేరు సిఫార్సు చేయాలని తీసుకున్న నిర్ణయంపై పునరాలోచన చేయాలని పాకిస్థాన్‌లోని పలువురు రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖులు ప్రభుత్వాన్ని కోరారు. 2026వ సంవత్సరానికిగాను ట్రంప్ పేరు సిఫార్సు చేసేందుకు పాకిస్థాన్ ప్రభుత్వం సిద్ధపడింది. ఐతే ఇరాన్ అణుస్థావరాలపై దాడులు చేయాలని ట్రంప్ నిర్ణయం తీసుకుని ఆకస్మికంగా ఆదివారంనాడు మెరుపుదాడులు చేశాక నిర్ణయాన్ని పునఃపరిశీలన చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి వస్తోంది. ప్రతిష్టాత్మకమైన నోబెల్ బహుమతికి ట్రంప్ పేరు ప్రతిపాదిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం శుక్రవారంనాడు అధికారికంగా చేసిన ప్రకటన దిగ్భ్రాంతికి గురిచేసింది. ఉప ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఈ మేరకు ట్రంప్ పేరు సిఫార్సు చేస్తూ నోబెల్ శాంతి బహుమతి కమిటీ (నార్వే)కి ఒక లేఖపై సంతకం చేసి పంపారు. ఇరాన్‌లోని ఫోర్డో అణుస్థావరంపై దాడికి ట్రంప్ సారథ్యం వహించిన తర్వాత ఈ నిర్ణయాన్ని పరిశీలిస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కొంతమంది ప్రముఖ రాజకీయ నాయకులు, ప్రముఖులు డిమాండ్ చేశారు. ప్రముఖ రాజకీయవేత్త, జమాతే ఉలేమా ఇ ఇస్లామీ నాయకుడు మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్ ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొవాలని డిమాండ్ చేశారు.
''అధ్యక్షుడు ట్రంప్ శాంతికోసం పాటుపడ్డానని చేసిన ప్రకటన అసత్యమని రుజువైంది, అందువల్ల నోబెల్‌కు ఆయన పేరు సిఫార్సు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి'' అని ఆదివారంనాడు జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో కోరారు. సైన్యాధిపతి ఆసిఫ్ మునీర్‌తో ఇటీవల ట్రంప్ విందు సమావేశం పాకిస్థాన్ పాలకులను ఎంతగానో ప్రభావితం చేసిందని అందుకే ఇలాంటి పని చేశారన్నారు. పాలస్తీనా, సిరియా, లెబనాన్, ఇరాన్‌లలో దాడులకు ట్రంప్ ప్రోత్సాహం ఇచ్చారనీ, ఇక ఆయన ఏ విధంగా శాంతికి చిహ్నంగా ఉండగలని ఫజ్లుర్ రెహ్మాన్ ప్రశ్నించారు. ఆఫ్ఘన్లు, పాలస్తీనియన్ల రక్తం ఆయన చేతులకు అంటుకున్న తర్వాత ఇక ఆయన ఏ విధంగా శాంతిదూత అవుతారన్నారు.

## సున్నం చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలోనే సియెట్ లేఔట్

ఆందోళనలు చేయడంలో అర్థం లేదన్న హైడ్రా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి మండలాల సరిహద్దులోని గుట్టల బేగంపేట, అల్లాపూర్ గ్రామాల మధ్య ఉన్న సున్నం చెరువు ఎఫ్‌టిఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్) పరిధిలోనే సియెట్(ఎస్ఐఇటి) లేఔట్ వస్తోందని హైడ్రా స్పష్టం చేసింది. ఆ లేఔట్‌కు సంబంధించి గతంలో హెచ్ఎండిఏ ఇచ్చిన డ్రాఫ్ట్ లేఔట్‌ను కూడా ఇదే కారణంగా రద్దుచేసిన విషయాన్ని హైడ్రా గుర్తుచేసింది. అలాగే ఇక్కడే గతంలో ఇంటి నిర్మాణానికి అనుమతిచ్చిన జిహెచ్ఎంసి కూడా ఆ అనుమతులను రద్దుచేసుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో తమకు న్యాయం చేయాలంటూ సియెట్ లేఔట్ ప్లాట్ల యజమానులు సోమవారం ఆందోళన చేయడంలో అర్థంలేదని స్పష్టంచేసింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలను హైడ్రా వెల్లడించింది.
సున్నం చెరువు 32.60 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. 1975లో సర్వే ఆఫ్ ఇండియా లెక్కలు ఇదే స్పష్టం చేస్తున్నాయి. అలాగే గ్రామ రికార్డుల్లో కూడా ఇదే విషయం స్పష్టమౌతోంది. అయినప్పటికీ హైకోర్టు ఆదేశాల మేరకు సాగు నీటిపారుదల, రెవెన్యూ, జిహెచ్ఎంసి విభాగాలతో కలిసి హైడ్రా సర్వే కూడా చేయించింది. అన్ని కోణాల్లో పరిశీలించాక, సర్వే ఆఫ్ ఇండియా రికార్డుల్లో ఉన్న లెక్కలే తేలాయి. చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో, నాలాలను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను ఉపేక్షించవద్దని, వెంటనే వాటిని తొలగించాలని కోర్టులు ఎప్పటికప్పుడు స్పష్టం చేస్తున్న విషయాన్ని హైడ్రా ఈ సందర్భంగా గుర్తుచేసింది. ప్రస్తుతతం ఆ లేఔట్‌లో ఎలాంటి నిర్మాణాలు జరగలేదు. ఖాళీగా ఉన్న ప్లాట్లకు సంబంధించి అర్హులమని భావిస్తే నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలని హైడ్రా సూచించింది. చెరువు పునరుద్ధరణ పనులకు ఆటంకం కలిగించవద్దని హైడ్రా విజ్ఞప్తి చేసింది.



**చెరువులు – నాలాల ఆక్రమణలు**

**హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులు**

చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణలపై ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. చెరువుల ఆక్రమణలతో పాటు కాలనీల్లో ఎంతో ముఖ్యంగా భావించే పార్కులను కూడా కబ్జా చేసి, ప్లాట్లుగా విక్రయిస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. హైడ్రా ప్రజావాణికి సోమవారం మొత్తం 52 ఫిర్యాదులు అందాయి. వరద కాలువలు అయితే 6 మీటర్ల మేర ఉండాల్సినవి కొన్ని ప్రాంతాల్లో కేవలం 2 మీటర్లకే పరిమితమయ్యాయనే ఫిర్యాదులు వచ్చాయి. చెరువులు అలుగులు పారే సమయంలో, 5 సెంటీమీటర్లకుపైగా వర్షం పడినపుడు కాలనీలు నీట మునగడం సర్వ సాధారణంగా మారాయన్నారు. హైడ్రా కమిషనర్ ఎవి. రంగనాథ్ ఈ ఫిర్యాదులను గూగుల్ మ్యాపుల ద్వారా పరిశీలించారు. సంబంధిత అధికారులకు వాటిపై తదుపరి చర్యలకు ఆదేశించారు.

## మహిళా ఉద్యమకారులపై దాడి దుర్మార్గం

ఉద్యమాలను అణచివేయాలని చూస్తే మరింత బలంతో కదంతొక్కుతాం

పిఒడబ్ల్యూ సంధ్యను గాయపరిచిన పోలీసులను సస్పెండ్ చేయాలి

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి డిమాండ్




**ప్రజాపక్షం / హైదరాబాద్ / ఖైరతాబాద్ :** మహిళా ఉద్యమాలను అణచివేయాలని చూస్తే రెట్టింపు ఉత్సాహంతో కదం తొక్కుతామని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. మహిళా పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, మహిళా ఉద్యమకారులపై దాడి చేయించడం దుర్మార్గమైన చర్య అని ఆమె పేర్కొన్నారు.
ఇందుకు బాధ్యులైన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పిఒడబ్ల్యూ జాతీయ నేత సంధ్య, మహిళా ఉద్యమకారులపై పోలీసుల దాడిని నిరసిస్తూ సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో పిఒడబ్ల్యూ రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఇరాన్, పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు చేస్తూ అమెరికా మద్దతుతో మానవ హనానికి పాల్పడటాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 19న అమెరికన్ కాన్సులేట్ వద్ద జరిగిన శాంతియుత నిరసనలో పిఒడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్యను తీవ్రంగా గాయపరిచి, మిగతా మహిళా నేతలను గచ్చిబౌలి పోలీసులు బలవంతంగా ఈడ్చుకొంటూ వ్యాన్లలో ఎక్కించడం అమానవీయమన్నారు. తెలంగాణ కోసం కొట్లాడిన మహిళా ఉద్యమకారులపై పోలీసుల దాడి యావత్తు తెలంగాణ మహిళా ఆత్మగౌరవానికి మాయని మచ్చ అని ఆమె పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలు, హక్కుల కోసం పోరాడే తమపై పోలీసుల ఉక్కుపాదాన్ని సహించబోమన్నారు. పోలీసుల దాడితో సంధ్య కాలుకు తీవ్ర గాయమైందని, అమె ప్రస్తుతం కదల్లేని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. సంధ్యనే కాకుండా వయోధికులైన సాదినేని వెంకటేశ్వర్లు, వేములపల్లి వెంకట్రామయ్య, మహిళా నేతలు, విద్యార్థులు గాయపడ్డారన్నారు. మహిళా ఉద్యమకారులను భయభ్రాంతులకు గురిచేసిన సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్ని పోలీసు యాక్షన్ టీమ్‌లు దిగినా తాము బెదరబోమని, ప్రజా హక్కుల సాధనే ధ్యేయంగా ఉద్యమాలను కొనసాగిస్తామని జ్యోతి తెలిపారు. సమావేశంలో పిఒడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, ప్రధానకార్యదర్శి అందే మంగ, నేతలు స్వరూప, కావ్య, కె.సజయ్య, ఎన్.అరుణ, సిహెచ్.భారతి, ఎపి సెక్రటరీ పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

## కేబినెట్ సమావేశాల పేరుతో.. ప్రభుత్వం కాలయాపన

బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేబినేట్ సమావేశాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన కార్యక్రమంగా మార్చేసిందని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. గత ఆరు నెలలుగా ముఖ్యమైన ప్రజా సమస్యలపై చర్చ లేకుండా కేబినెట్ సమావేశాన్ని కబుర్లతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ నాంపల్లి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు అమలు ఏమైందని, కాళ్లేశ్వరంపై పిసిసి అధ్యక్షునిగా రేవంత్ రెడ్డి సిబిఐ విచారణ కోరడాని, సిఎం అయ్యాక ఎందుకు సిబిఐకి అప్పగించడం లేదని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల గురించి ఇప్పటివరకు కేబినెట్ సమావేశంలో ఎందుకు చర్చించడం లేదన్నారు. వాటిని అమలు చేసే ప్రణాళికను ఎందుకు సిద్ధం చేయలేకపోతున్నారన్నారు. ఇదే విషయాన్ని బిజెపి తరపున చాలాసార్లు స్పష్టంగా ప్రశ్నించామన్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకుండా, ప్రజలకు ఇచ్చిన హామీలపై చర్చించకుండా, వాటిని అమలు చేసే దిశగా చర్య లు తీసుకోకుండా సమావేశం నిర్వహించడం, మళ్లీ మళ్లీ కాలయాపన చేయడం అంటే ఇదేనా ప్రజా పాలన అంటే అని ప్రశ్నించారు.



### అక్రమాలు వెలుగులోకి తెస్తున్న పత్రికలపై..

## అక్కస్సుతో ఆక్రోశం ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత

టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అవినీతి అక్రమాలు వెలుగులోకి తీసుకొస్తున్నాయనే పత్రికలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్కస్సు ఆక్రోశం ప్రదర్శిస్తున్నారని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ మహిళా సమాజానికి మచ్చ తెచ్చే విధంగా కాసుల కోసం, అవినీతి డబ్బుల కోసం లిక్కర్ వ్యాపారం చేసిన ఘతన కవిత చరిత్ర అన్నారు. బతుకమ్మ ముసుగులో దేశ విదేశాలలో ప్రజాధనం దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. కవిత తన ఉనికిని ప్రజలు మరిచిపోతున్నారనే బాధతో నోటికొచ్చిన విధంగా మాట్లాడుతుంటే ఆమెకు బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు వంత పాడటాన్ని చూస్తుంటే బిఆర్ఎస్‌లో ఆయన స్థానం భద్రంగా లేదనే అర్థమవుతోందన్నారు. కెసిఆర్ తన కొడుకుకే పట్టం కడతాడని, తనను ఇంటి వరకే పరిమితం చేస్తాడనే ఆలోచనా భయంతో తెలంగాణ తెలుగుదేశం పార్టీ మీద బురద జల్లుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ మళ్లీ విజృంభిస్తుందనే భయంతోనే చంద్రబాబు మీద, తెలుగుదేశం పార్టీపై ఇష్టం వచ్చిన విధంగా విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ స్వార్థ రాజకీయాల కోసం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన గత ప్రభుత్వ పాలకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అందినకాడికి ప్రజాధనం లూటీ చేసిన కవిత, హరీశ్ రావులు చంద్రబాబుపై అవాకులు చవాకులు మాట్లడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నల్లెల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

### ఆపరేషన్ సింధులో రెండో విడత

## 443 మంది భారతీయుల తరలింపు

**జెరూసలెం :** ఆపరేషన్ సింధులో భాగంగా ఇజ్రాయెల్ నుండి రెండో విడత 443 మంది భారతీయులు సోమవారంనాడు స్వదేశానికి బయలుదేరారు. జోర్డాన్, ఈజిప్టు దేశాల మీదుగా వీరు రెండు బృందాలుగా భారత్‌కు చేరుకుంటారు. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధ వాతావరణం, పరస్పర దాడులవల్ల భద్రత కొరవడటంతో ఆపరేషన్ సింధు పేరుతో కేంద్ర ప్రభుత్వం భారతీయులను తరలిస్తున్నది. ఇజ్రాయెల్‌కు జోర్డాన్, ఈజిప్టులతో ఉన్న సరిహద్దుల మీదుగా ఒక బృందంలో 175 మంది, మరో బృందంలో 268 మంది బయలుదేరారు. దీంతో ఇప్పటివరకు ఆపరేషన్ సింధులో భాగంగా 603 మంది భారతీయులను ఇజ్రాయెల్ నుండి బయటకు తీసుకువచ్చారు. ఆదివారంనాడు మొదటి విడతగా 160 మంది ఇజ్రాయెల్ నుండి జోర్డాన్‌కు వెళ్ళి స్థానిక కాలమానం ప్రకారం అక్కడే సోమవారం మధ్యాహ్నం 2.15 గంటలకు విమానంలో భారత్‌కు బయలుదేరారు. కాగా రెండో విడత 443 మంది భారతీయులు సోమవారంనాడు ఇజ్రాయెలీ సరిహద్దులు దాటారు. వారిని రెండు బృందాలుగా విడదీసి వారికోసం జోర్డాన్, ఈజిప్టులలో రెండు విమానాలు ఏర్పాటు చేశారు. ఇజ్రాయెల్‌తో సహా మొత్తం మూడు దేశాలలోనూ ఉన్న భారత దౌత్య సిబ్బంది సమన్వయంతో విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ వీరిని భారత్‌కు తరలిస్తున్నది. ఆపరేషన్ సింధు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఈనెల 19వ తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. విదేశాలలో భారతీయుల భద్రతకు కట్టుబడి ప్రభుత్వ ఈ చర్యలు తీసుకుంటున్నది. ఇంతకుముందు కూడా ప్రభుత్వం ఆపరేషన్ గంగ, ఆపరేషన్ దేవిశక్తి, ఆపరేషన్ కావేరీ, ఆపరేషన్ అజయ్‌లను విజయవంతంగా నిర్వహించింది. ఉక్రేన్, ఆఫ్ఘానిస్థాన్, సూడాన్ నుండి భారతీయులను తరలించింది. తాజాగా ఇజ్రాయెల్ నుండి ఈ తరలింపు జరుగుతోంది. ఇజ్రాయెల్‌లో 40,000మందికిపైగా భారతీయులు ఉన్నారు. ప్రధానంగా వీరంతా సంరక్షకులుగా, నిర్మాణరంగ కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరితోపాటు మరో 1000 మందికిపైగా భారతీయ విద్యార్థులు, వృత్తినిపుణులు, ఇతరులు కూడా ఉన్నారు.

## నేడు నాలుగు రాష్ట్రాల సెంట్రల్ జోన్ కౌన్సిల్ సమావేశం

**న్యూఢిల్లీ :** నాలుగు రాష్ట్రాల సెంట్రల్ జోన్ కౌన్సి ల్ సమావేశం మంగళవారంనాడు వారణాసిలో జరుగుతుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. కేంద్ర హోం వ్యవహారా మంత్రిత్వ శాఖ, అంతర్రాష్ట్ర మండలి సచివాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఒక్కొక్క రాష్ట్రం నుండి ఇద్దరు సీనియర్ మంత్రులు పాల్గొంటారు. 1956 నాటి రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 15,22 సెక్షన్ల కింద దేశంలో ఈ విధంగా మొత్తం ఐదు సెంట్రల్ జోన్ కౌన్సిల్స్ ఏర్పడ్డాయి. ఈ అంతర్రాష్ట్రస్థాయి సమావేశాలు ప్రతి ఏడాది జరుగుతాయి. ఈ సమావేశాలలో అత్యవసర సత్వర ప్రతిస్పందన వ్యవస్థ అమలుతోపాటు ప్రాంతీయస్థాయిలో ఉమ్మడి ప్రయోజనాలు నెరవేర్చే పోషకాహారం, విద్య, ఆరోగ్యం, విద్యుత్, అర్బన్ ప్రణాళిక, సహకార వ్యవస్థ వంటి వివిధ సమస్యలను రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చిస్తారు. మహిళలు, పిల్లలకు వ్యతిరేకంగా జరిగే లైంకపరమైన దాడుల్లో కేసుల దర్యాప్తులు వేగంగా జరుగుతున్నాయా? లేదా? అని పరిశీలిస్తారు. బలమైన రాష్ట్రాలు ఉన్నప్పుడే బలమైన దేశం ఉంటుదన్న లక్ష్యంతో ఈ జోనల్ కౌన్సిల్ ఏర్పడ్డాయి. ఈ జోనల్ కౌన్సిల్స్‌లో రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలమధ్య ఉండే సమస్యలను లేదా కేంద్రం,రాష్ట్రం మధ్య ఉండే సమస్యలను చర్చిస్తారు. ఈ విధంగా గడచిన 11 సంవత్సరాలలో వివిధ జోనల్ కౌన్సిల్స్ స్థాయిలో 61 సమావేశాలు జరిగాయి.

### కాంగ్రెస్ పార్టీకి మహిళలు

## కృతజ్ఞతా భవంతో ఉండాలి

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సంతోష

**ప్రజాపక్షం/దోమ :** కాంగ్రెస్ పార్టీకి మహిళలు కృతజ్ఞాతా భావంతో ఉండాలి అని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సంతోష అన్నారు. మహిళల అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం కృషి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శశికళ అన్నారు. పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసంలో మహిళ కాంగ్రెస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ఎన్నో పథకాలను ఇస్తుందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళలను పట్టించుకోలేదని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, 500 రూపాయలకే సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితరు అభివృద్ధి పథకాలు అందిస్తున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజితరెడ్డి, పావని, రాదారావు, ఉమరెడ్డి పాల్గొన్నారు.

## మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత కరపత్రం ఆవిష్కరణ

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలో నూతనంగా ఎన్నుకోబడిన మహిళా సంఘాల సభ్యులు , లీడర్ల శక్తివంతీకరణకు తోడ్పడే ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా రూపొందించిన శిక్షణ మాడ్యూల్ను ఈ రోజు జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం జిల్లా గ్రామీనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడిన శిక్షణ మాడ్యూల్లో మహిళా సంఘాల నిర్వహణ, నాయకత్వ లక్షణాలు, ఆర్థిక నిర్వహణ, స్వయం సహాయ గ్రూపుల పని తీరు మెరుగుపరచే పాఠ్యాంశాలు పొందుపరచబడ్డాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల శక్తివంతీకరణ దేశ అభివృద్ధికి బలం అని అన్నారు. ఈ మాడ్యూల్ మహిళలకు మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. గ్రామీణ స్థాయిలో మహిళలు అధికారబద్ధంగా వ్యవహరించేలా ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిఆర్డిఓ నాగి రెడ్డి, అడిషనల్ డిఆర్డిఓ జంగా రెడ్డి, మహిళా సంఘాల ప్రతినిధులు శిక్షణా బృందం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 68 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 68 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగులో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరం

### సేనోటూ డ్రగ్స్ ట్యాగ్తో మొక్కలు నాటిన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** పాఠశాలలో విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల, అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పాఠశాలలో హీల్ యువర్ మైండ్ అండ్ ప్లాంట్ ఎ ట్రీ (సే నో టూ నో డ్రగ్స్) నినాదంతో పాఠశాలలో మొక్కలు నాటి ట్యాగ్ వేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యాంటి డ్రగ్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా ప్రతి విద్యార్థి చెడును మానుకొని మంచి మార్గం నడవాలని కోరారు. అనంతరం పాఠశాలలో జిల్లాస్థాయి టాఫర్గా నిలిచిన తాళ్లురి రేఖ శ్రీని నగదు బహుమతితో అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సలీంషరీఫ్, పాఠశాల ఇన్ఛార్జి ప్రధానోపాధ్యాయులు మార్కెండేయ, మార్కెట్ కమిటి చైర్మన్ వేపూరి తిరుతపమ్మ సుధీర్, బషీర్, అభినవ్ తల్లిదండ్రులు, మేకల వెంకటేశ్వర్లు, అరుణ, కొమరగిరి రంగారావు, సీతయ్య, పైడిమర్రి సత్యబాబు, నయీం పాల్గొన్నారు.

## సమస్యలకు తక్షణ పరిష్కారం

### నల్లగొండ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ ఆదేశించారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 52 మంది అర్జీదారులతో జిల్లా ఎస్పీ నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు.బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరకమైన చర్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కటినంగా వ్యవహరించాలన్నారు.

## ఇష్టానురాజ్యంగా పుస్తకాలను అమ్ముతున్న శ్రీ చైతన్య, నారాయణ

### తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ డిమాండ్




**ప్రజాపక్షం/నల్లగొండ :** విద్యాసంస్థలలో ఇష్టానురాజ్యంగా పుస్తకాలను అమ్ముతున్న శ్రీ చైతన్య, నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థలపైచర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలమల్ల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ డిమాండ్ చేశారు.ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల,నారాయణ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అక్రమంగా అమ్ముతున్న పుస్తకాలను పట్టుకోని ధర్నా చేశారు.ఈ సందర్భంగా సంఘం వారు మాట్లాడుతూ శ్రీ చైతన్య,నారాయణ విద్యార్థుల దగ్గర అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పుస్తకాల అమ్మకూడదు అని ఉన్నప్పటికీ పుస్తకాలు అమ్మడం సరైనది కాదన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలలో బహిరంగంగా పుస్తకాల అమ్ముతున్నప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గాదపాక సూర్య తేజ, గాత్రి క్,వాసు,ఆమెర్,నవీన్,మహేష్ తదితరులు ఉన్నారు.

## లక్కీ డ్రా పేరిట మోసం

### పోలీస్స్టేషన్ను ఆశ్రయించిన బాధితులు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకున్నారు. నెలనెలా లక్కీ డ్రా పేరిట విలువైన బహుమతులను ఆశ చూపారు. ఊరారా ఏజెంట్లను పెట్టుకోని మరీ కోట్ల రూపాయలు కొల్లగొట్టడమే టార్గెట్గా పెట్టుకున్నారు. డ్రా పూర్తయిన వాయిదాలు చెల్లించిన సభ్యులకు వస్తువులు ఇవ్వకుండా శఠగోపం పెట్టారు ముగ్గురు. వారి ఉచ్చులో చిక్కి మోసపోయిన బాధితులు న్యాయం చేయాలంటూ పోలీసుల చుట్టు తిరుగుతున్నారు. మిర్యాలగూడకు చెందిన కె.కోటేశ్వర్రావు, కె.నరేష్, బి.శ్రీనివాస్ అనే ముగ్గుర వ్యక్తులు పట్టణంలోని హౌసింగ్బోర్డు కాలనీలో ఆర్కె ఎంటర్ప్రైజెస్ పేరిట దుకాణం తెరిచారు. అదృష్టం బాగుంటే లక్కీ డ్రాలో విలువైన కార్లు, బైక్లు, బంగారు నగలు అన్ని మీవేనంటూ ఊదరగొట్టారు. 15నెలల కాలపరిమితి నెలకు రూ.1000 ప్రతినెలా లక్కీ డ్రాలో మీరే విజేతలని పది మంది ఏజెంట్ల ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేశారు. మొత్తం మీద 2600 మందిని సభ్యులుగా చేర్చుకున్నారు. మొదట కొంత మందికి గిఫ్టులు అందించి నమ్మించారు. ఆ తరువాత టార్గెట్ రీచ్ కాగానే బోర్డు తిప్పేసి పత్తా లేకుండాపోయారు. మొత్తంమీద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్కి డ్రా పేరిట అమాయక ప్రజల నుంచి రూ.3.90కోట్లు కొల్లగొట్టినట్లు తెలిసింది. డ్రా ముగిసి ఆరు నెలలు అవుతున్నా గెలిచిన గిఫ్టులు రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన ఏజెంట్లు, సభ్యులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. పోలీసు అదుపులో ఉన్న సదరు కేటుగాళ్లు రాజకీయ పలుకుబడితో రాజీ చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తుంది.



# అర్జీలకు అధిక ప్రాధాన్యం

### యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 99 ఆర్జీలను, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలసి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 54 వ్యవసాయ శాఖ 17, జిల్లా గ్రామీణ అభివృద్ధికి 6, జిల్లా పంచాయతీ శాఖ 5, సర్వే లాండ్స్ 4, జిల్లా పరిషత్ 4, మున్సిపాలిటీ 2,జిల్లా వైద్య ఆరోగ్య 2, ట్రాన్స్కో, జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా అటవీ శాఖ, ఆర్ అండ్ బి, ఎంప్లాయిమెంట్ ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధులు, ఎరువులు, భూ భారతి, ఆయిల్ ఫామ్ సాగు వంటి వాటి పై కలెక్టర్ సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు ప్రణాళికలు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయిల్ ఫామ్ సాగు పై రైతులకు అవగాహన కల్పించి, పంటలు వేసుకునేలా చూడాలన్నారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులందరూ తమ శాఖలకు సంబంధించిన పనుల పై దృష్టి సారించాలన్నారు. జడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ పాల్గొన్నారు.

## నట్టేట ముంచి చిట్టీల వ్యాపారి పరార్

### 70 మంది సభ్యుల నుంచి రూ.4కోట్లతో ఉడాయింపు

### పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేసిన బాధితులు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నమ్మించి అదను చూసి నమ్మిన వారిని నట్టేట ముంచి కోట్ల రూపాయలు కొల్లగొట్టి రాత్రికి రాత్రే కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి పరారైన ఓ ప్రైవేట్ చిట్టీల వ్యాపారి సంఘటన మిర్యాలగూడలో సోమవారం జరిగింది. దీంతో బాధితులు సోమవారం టూటౌన్ పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శాంతినగర్కు చెందిన కటకం సైదిరెడ్డి గత 15 ఏండ్లకు పైగా చిట్టీల వ్యాపారం సాగిస్తున్నాడు. స్థానికులతో మంచి సంబంధాలు ఏర్పాటు చేసుకోని చిట్టీల వ్యాపారం మొదలుపెట్టాడు. 70 మందికి పైగా సభ్యులను ఏర్పాటు చేసుకోని రూ.2లక్షల నుంచి రూ.10లక్షల వరకు చిట్టీలు నడుపుతూ కొంతకాలంగా సక్రమంగా చెల్లింపులు చేస్తూ వస్తున్నాడు. గత కొద్ది నెలలుగా చిట్టీలు పాడిన సభ్యులకు డబ్బులు చెల్లించక కాలయాపన చేశాడు. ఇంటికి వెళ్లిన లేకపోవడం సెల్ ఫోన్ స్విచాఫ్ రావడంతో అనుమానం వచ్చిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఇది తెలిసిన చిట్టీల వ్యాపారి కటకం సైదిరెడ్డి రాత్రికి రాత్రే ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా ఉండాయించాడు. మొత్తం మీద 70 మంది సభ్యుల నుంచి రూ.4కోట్లకు పైగా వసూలు చేసి పరారైనట్లు తెలుస్తుంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు చిట్టీల వ్యాపారి సైదిరెడ్డి వేటలో ఉన్నారు.

## అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరస్వామి డిమాండ్



**ప్రజాపక్షం/నల్లగొండ:** అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణంలో నివసిస్తున్న నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పబ్బు వీరస్వామి మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గతంలో అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. నల్లగొండ మండల పరిధిలోని పానగల్ అన్వేష్ పురం పుట్ట వద్ద సర్వే నెంబర్ 33 లో ఎకరం ప్రభుత్వ భూమి ఉందని ఆ భూమిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న నిరుపేదలను విచారణ చేసి ఈ సర్వే నెంబర్ లో ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కొద్ది కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలు సాగర్ రోడ్ లోని మాతృక భూమిలో గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారని వీరికి ప్రభుత్వం వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. కలెక్టర్కు వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ పట్టణ కార్యదర్శి కత్ర సైదిరెడ్డి, బాధితులు విశ్వనాధుల లెనిన్, పి సుజాత, విజయ,ధనలక్ష్మి, వీరయ్య, మల్లయ్య, దోటి పాండరి, వెంకటేష్, కాంతి కుమార్, సునీత, తదితరులు ఉన్నారు.

## విద్యా సంస్థలను నిరంతరం సందర్శించాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మండల ప్రత్యేక అధికారులు వారి పరిధిలోని విద్యా సంస్థలు, హాస్టళ్లను నిరంతరం సందర్శించి పాఠశాలల్లో ఎక్కడ వాన నీరు, మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమ్మిళిత సమావేశంలో మాట్లాడుతూ పరిశుభ్రత లోపం కారణంగా విద్యార్థులు అనారోగ్యానికి గురి కాకుండా చూడాలని, అందువల్ల మండలాల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు వారి మండలంలోని అన్ని పాఠశాలలను తనిఖీ చేయాలని,మూసీ పరీవాహక ప్రాంతంలో విష పురుగుల బెడద ఎక్కువగా ఉంటుందని, అందువల్ల అక్కడ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భవనాలు వృధాగా కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లయితే గుర్తించి వాటివల్ల ఎలాంటి ప్రమాదం జరగకుండా కూలగొట్టాలని చెప్పారు.అనంతరం జిల్లా కలెక్టర్ స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీ 2025 గోడపత్రికను ఆవిష్కరించారు. స్వచ్ఛ సర్వేక్షన్పై జిల్లాలోని ప్రజలు అందరికీ అవగాహన కల్పించాలని స్వచ్ఛత వైపు ప్రతి ఒక్కరూ పయనించే విధంగా చర్యలు తీసుకోవాలని, అన్ని అంశాల పట్ల అవగాహన కల్పించాలని చెప్పారు.ఈ సోమవారం ప్రజావాణిలో మొత్తం 129 దరఖాస్తులు రాగా, అందులో జిల్లా అధికారులకు 57, రెవెన్యూ శాఖకు సంబంధించి 72 దరఖాస్తులు వచ్చాయి.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి,జెడ్ పీ ఇన్చార్జి సీఈఓ శ్రీనివాస రావు, ఆర్డిఓ వై.అశోక్ రెడ్డి, జిల్లా అధికారులు, ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

## నల్లగొండ డిసిసిబికి రూ.100 కోట్ల బడ్జెట్ తీసుకొచ్చాం

### డిసిసిబి జిల్లా చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** గత ఆర్థిక సంవత్సరంలో టిజిసి ఏబి నుండి మిగతా డిసిసిబిల కంటే అత్యధికంగా రూ 100.00 కోట్ల బడ్జెట్ను తీసుకు వచ్చి సంఘాలకు ఇవ్వడం జరిగిందని డిసిసిబి జిల్లా చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.సోమవారం నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో 104వ జనరల్ బాడీ సమావేశం జిల్లా చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుకు సంబంధించి 2024/25 బ్యాంకు సాధించిన పురోగతిని విశ్లేషించుకోవడం జరిగిందని 2024/25 ఆర్థిక సంవత్సరంలో మంచి పురోగతిని సాధించిందని ఇందుకోసం సహకరించిన బ్యాంకు పాలకవర్గాన్ని, బ్యాంకు సిబ్బందిని సొసైటీ చైర్మన్ లను అభినందించడం జరిగిందని తెలిపారు. సొసైటీలకు డివిడెంట్ రూపాయలు ఒక కోటి పది లక్షలు ఇవ్వాలని నిర్ణయించారని తెలిపారు.గత ఆర్థిక సంవత్సరంలో డిపాజిట్ల పెరుగుదల కొరకు సహకార సమృద్ధి సహకార లక్ష్మీ అని రెండు కొత్త డిపాజిట్ల స్కీమ్లను ప్రవేశపెట్టుకొని రూ 100.00 కోట్లు సేకరించడం జరిగిందని గత ఆర్థిక సంవత్సరంలో టిజిసి ఏబి నుండి మిగతా డిసిసిబిల కంటే అత్యధికముగా రూ 100.00 కోట్ల బడ్జెట్ను తీసుకువచ్చి సంఘాలకు ఇవ్వడం జరిగిందని తెలిపారు.సహకార సంఘాలకు నాబార్డ్ రిఫైనాన్స్ ద్వారా కిసాన్ డ్రోన్స్ స్కీమ్ ప్రవేశపెడుతున్నాము. ఈ స్కీమ్ ద్వారా ఇచ్చు ఋణముపై వడ్డీని నాబార్డ్ కన్సిషనల్ వడ్డీ రేటు క్రింద తక్కువ వడ్డీకే ఇచ్చుటకు ప్రయత్నిస్తామన్నా రు. ఈ స్కీమ్కి రాష్ట్ర ప్రభుత్వము బడ్జెట్ అలాట్ చేసినచో 40శాతం సబ్సిడి ఇచ్చుటకు వీలవుతుందన్నారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్ రెడ్డి పాలకవర్గ సభ్యులు గొంగిడి మహేందర్ రెడ్డి,పాశం సంపత్ రెడ్డి,అందెల లింగం యాదవ్, సొసైటీ చైర్మన్లు , బ్యాంకు సీఈఓ శంకర్ రావు ఇతర బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితులకు భరోసా : సూర్యాపేట ఎస్పి




**ప్రజాపక్షం/సూర్యాపేట:** తమకు జరిగిన అన్యాయంపై పోలీస్స్టేషన్కు ఫిర్యాదు చేసేందుకు వచ్చే బాధితులకు భరోసా కల్పించాలని జిల్లా ఎస్పి కె.నర్సింహా పోలీసులకు సూచించారు. ఆధునిక పోలిసింగ్ నిర్వర్తించాలన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్స్టేషన్ రిసెప్షన్ సెంటర్, ఫిర్యాదుల నిర్వాహణ సిబ్బందికి, పోలీస్ స్టేషన్ నిర్వహణ సెక్షన్ ఇన్ఛార్జి సిబ్బందికి విధుల నిర్వహణపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పోలీస్ యూనిఫాంకు ప్రత్యేకత ఉందన్నారు. సిబ్బంది ప్రవర్తనపై, సేవలపై ప్రజల నుండి ఫీడ్బ్యాక్ వస్తుందన్నారు. ప్రజలకు గౌరవంగా పనిచేయాలన్నారు. ప్రతి ఫిర్యాదును అంతర్జాలంలో నమోదు చేసి బాధితులకు రసీదు ఇవ్వాలన్నారు. రిసెప్షన్లో మహిళ సిబ్బందిని నియమించి బలోపేతం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి ఇన్స్పెక్టర్ హరి బాబు, ఐటికోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, రిషెప్షన్ పని విభాగం కోఆర్డినేటర్ ఎస్ఐ మహిశ్వర్తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో ఐదుగురు నిందితుల అరెస్టు

### డిఎస్పి ప్రసన్నకుమార్ కేసు వివరాలు వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** తుంగతుర్తినియోజకవర్గం నాగారం మండలంలోని ఈటూర్ గ్రామం నంగునూరి బయ్యమ్మ ఇంట్లో ఈనెల 17వ తేదీన చోరీ జరిగింది. ఆమె నిద్రిస్తున్న సమయంలో ఇంటి వెనుకల గొడదూకి దొంగలు తమవెంట తెచ్చుకున్న కట్టర్తో కరెంట్ను కట్చేసి ఆమె మెడమీద ఉన్న నల్లపూసల గొలుసు, చేతిగాజులు చోరీ చేశారు. ఆమె లేవకుండా చేతులను చీరెతో కట్టి అరవకుండా కట్టేసి ఇంట్లో మరికొంత నగదును కూడా తీసుకొని పరారయ్యారు. దీంతో మరుసటి రోజు ఆమె నాగారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. సోమవారం ఆమె ఇంట్లో దొంగలించిన సొత్తును అమ్ముకునేందుకు ప్రయత్నిస్తుండగా నేరస్తులు తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని ఎక్స్రోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. అనంతరం సిఐ రఘువీర్రెడ్డి , నాగారం ఎస్ఐ అయిలయ్యలు వారి నుండి ఎపి28ఎజడ్ 0721 కారు స్విఫ్ట్, నల్లపూసల గొలుసు, ఐదు సెల్ఫోన్లు, కట్టర్లను సీజ్చేశారు. ఐదుగురినిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా హైద్రాబాద్లోని మేడ్పల్లికి చెందిన బోడ వెంకటేష్, స్వస్థలం నాగారం మండలం ఈటూరు, పోతురాజు నాగరాజు మేడ్పల్లి హైద్రాబాద్ స్వస్థలం తిరుమలగిరి మండల మాలిపురం, ఏడ్ల శేఖర్ కాంచనపల్లి గ్రామం,అడ్డగూడురు మండలం యాదాద్రి భువనగిరి జిల్లా, కొమ్ము సోమయ్య మేడిపల్లి హైద్రాబాద్ స్వస్థలం మాచిరెడ్డిపల్లి నాగారం మండలం. వడ్డె పున్నం మాచిరెడ్డిపల్లి గ్రామం చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. వృద్ధురాలు భయమ్మ ఇంట్లో నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులంతా జీవనోపాధి కోసం చెన్నైలో స్థిరపడగా ఆమె ఒక్కతే ఈటూరు గ్రామంలో నివాసం ఉంటుంది. ఆమె ఒంటిరిగా ఉన్న విషయం తెలుసుకుని చోరికి పాల్పడినట్లు విచారణలో చెప్పారు. విచారణ అనంతరం నిందితులను కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాగారం సిఐ రఘువీర్రెడ్డి, ఎస్ఐ అయిలయ్య పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 99 దరఖాస్తులు

### జిల్లా కలెక్టర్ తేజస్నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** ప్రజావాణిలో దరఖాస్తులను పరిష్కరించేటప్పుడు ఖచ్చితమైన సమాధానం అర్జిదారులకి తెలియజేయాలని, అధికారులకు జిల్లా కలెక్టర్ తెజస్నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు కమిటి శాఖల వారిగా పరిశీలించి పరిష్కరించాలని ఈ కమిటిలో జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో డిఆర్డిఏ పిడి,జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా అడిటింగ్ అధికార్లతో కలిసి కమిటి ఏర్పాటు చేసి ప్రతి శాఖకి సంబంధించి ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించటంలో నాణ్యత పాటిస్తున్నారా లేదా అని పరిశీలించాలని తెలిపారు. దరఖాస్తులు ఎప్పటికప్పుడు వేగవంతంగా పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధికారులు వారి శాఖ పరిధిలోని సిబ్బందితో సమావేశం నిర్వహించి కార్యాలయంలోని అధికారులకి విధుల విభజనపై తెలియజేయాలని అన్నారు. జిల్లా అధికారులు తమ శాఖ పరిధిలో ఉన్న లోకాయుక్తా, మానవహక్కుల కమిషన్, ఎస్సిఎస్టి కమిషన్, స్థానిక కోర్టు కేసులకి సంబంధించి కౌంటర్ ఫైల్, కేసు, క్లోజ్, కోర్ట్ ఆర్డర్ అమలు లాంటివి తప్పని సరిగా అమలు చేయాలని, ప్రతి కార్యాలయంలో ఒక సీనియర్ అధికారిని కోర్టు కేసులను చూసేందుకు నియమించుకోవాలని కోరారు. ప్రజావాణి దరఖాస్తులలో భూ సమస్యలపై 34, ఇరిగేషన్ 6, మున్సిపాలిటి 2, డిపివో4, డిడబ్ల్యూవో 4, ఇతర శాఖలకు సంబంధించినవి 49 మొత్తం 99 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి వివి అప్పారావు, డిఎఫ్వో సతీష్కుమార్, డిపివో యాదగిరి, ఆడిటింగ్, అధికారి శ్యామ్సుందర్, వ్యవసాయ అధికారి శ్రీధర్రెడ్డి, డిడబ్ల్యూవో నర్సింహరావు, డిఈవో అశోక్, సిపివో కిషన్, శ్రీనివాస్నాయక్, జగదీశ్వర్రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలకు ఊపిరి ఎర్రజెండా



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన నిరంతరం ఎర్రజెండా పోరాడుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో సిపిఐ తంగడపల్లి శాఖ మహాసభ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా గాలయ్య మాట్లాడుతూ బ్రిటిష్ కబంధహస్తాల్లో మగ్గుతున్న భారతదేశానికి స్వాతంత్రం కోసం పోరాడిన సిపిఐ నాటినుండి నేటి వరకు 100 సంవత్సరాలుగా పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. అధికారంలో ఉన్న పాలకులు ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ విస్తరించడానికి ప్రజాసంఘాలను ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, సిపిఐ మున్సిపల్ శాఖ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, తంగడి పల్లి శాఖ కార్యదర్శి దాసరి అంజయ్య, నీల బిక్షపతి, దాసరి కృష్ణ, ఉబ్బు దర్శన్, నీల రాము, దాసరి యాదయ్య, మనోహర్, నీళ్ల జంగయ్య, నీళ్ల అశోక్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి అభినందన



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధిః** నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్లరాజేష్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు కేక్‌లు కట్‌చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలునిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల సరిత రాజేష్‌రెడ్డి దంపతులచే సత్యనారాయణస్వామి వ్రతం చేశారు. యువకులు, కార్యకర్తలు భారీగా రక్తదానంచేశారు. నియోజకవర్గంనుండి తరలివచ్చిన వేలాదిమంది ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజావాణితోనే భరోసా



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధానకార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.జానకి ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు.15ఫిర్యాదులను స్వీకరించారు. ఎస్‌ఐలు, సిఐలతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల స్థితిగతులను తెలుసుకుని, పరిష్కారానికి తగిన సూచనలు జారీ చేశారు. మూడో వ్యక్తి మధ్యవర్తిత్వం లేకుండా, పైరవీలకు లోనవకుండా నేరుగా పోలీసు అధికారులను సంప్రదించాలన్నదే ప్రజావాణి కార్యక్రమం యొక్క ఉద్దేశమని ఎస్పీ తెలిపారు.

## ‘నారాయణపేట్’లో ఒలంపిక్ డే రన్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా మినీ స్టేడియం నుండి చౌరస్తా వరకు నిర్వహించిన ఒలంపిక్ డే ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన శాఖ అధికారి మాట్లాడుతూ 186 లో మోడరన్ ఒలంపిక్స్ గేమ్స్‌ను ప్రారంభించడం జరిగిందని దీనికిగాను పియారీ డి కోబర్డిన్ ఎంతగానో కృషి చేశారని ఆయన చేసిన కృషికి గాను ఈనెల 18 నుంచి 29 వరకు వివిధ స్థాయిలో ఒలంపిక్ డే రన్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పేటాటిఎస్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటప్ప, బలరాజ్, తపస్ అధ్యక్షులు షేర్ కృష్ణా రెడ్డి, పీఆర్‌టియు నారాయణపేట మండల అధ్యక్షులు రఘువీర్, ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ నరసింహులు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు రత్నయ్య, రామకృష్ణా రెడ్డి అనంతసేన, శ్రీధర్ గౌడ్, రాజశేఖర్, సాయినాథ్, మౌలానా, పర్వీన్, విజయ్ కుమార్, భాస్కర్ జాతీయ క్రీడాకారిణి హారిక, సెల్ఫ్ డిఫెన్స్ మాస్టర్ అశోక్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్లాంటేషన్ డ్రైవ్ ప్రారంభం



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** దివ్యాంగుల వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్‌ల సాధికార శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతక ద్రవ్య దుర్వినియోగం , అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాల భాగంగా నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు, ఎస్పీ కార్యాలయం నందు ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడారు. జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయి అధికారి సాయి, వాలంటీర్లు లక్ష్మీ కాంత్, సంధ్య పాల్గొనడం జరిగింది.

## వాటర్ కూలర్ ప్రారంభం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** భారతీయ స్టేట్ బ్యాంక్ కలెక్టరేట్ శాఖ సిఎస్‌ఆర్ నిధులతో మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాటర్ కూలర్ ను సోమవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ప్రారంభించారు. ఎల్‌డిఎం కల్వ భాస్కర్, చీఫ్ మేనేజర్ బాల సుబ్రహ్మణ్యం, చీఫ్ మేనేజర్ సేల్స్ ఎస్‌బిఐ రీజియనల్ కార్యాలయం పిజిఎన్ శర్మ, ఎస్‌బిఐ కలెక్టరేట్ బ్రాంచ్ మేనేజర్ సురేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మండలపరిధిలోని తర్నికల్ గ్రామానికి చెందిన ఓర్పు హన్మంతు అనారోగ్యంతో మృతిచెందడంతో ఉప్పలచారిటబుల్‌ట్రస్టు చైర్మన్ ఉప్పలవెంకటేష్ సహకారంతో మృతుడి కుటుంబసభ్యులకు ఉప్పల చారిటబుల్‌ట్రస్టు ఆర్థికసాయం అందజేశారు. అనారోగ్యంతో మృతిచెందిన విషయాన్ని ఉప్పలవెంకటేష్‌కి తెలియజేసి మృతుడి కుటుంబసభ్యులకు తక్షణ ఆర్థికసాయం అందించేందుకు గ్రామస్తుల చొరవ అభినందనీయమన్నారు. బిఆర్‌ఎస్ నాయకులు తాళ్లసురేష్‌గౌడ్, రుక్మొద్దిన్, బీరయ్య, పరుష రాములు, సాయి, చెన్నయ్య, బంగారయ్య, ఈశ్వరయ్య, రాములున్నారు.

## వైద్య శిబిరాలు వినియోగం

**ప్రజాపక్షం /పాన్‌గల్ :** గ్రామాలలో ప్రజలు వైద్య ఆరోగ్య శిబిరాలను సద్వినియోగహం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి డా. శ్రీనివాసులు అన్నారు. సోమవారం పాన్‌గల్ మండల పరిధిలోని దావాజీపల్లి గ్రామంలో నిర్వహించిన సమగ్ర ఆరోగ్య శిబిరాన్ని మిషన్ మధుమేహ శిబిరాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు వైద్య అధికారుల సలహాలను సూచనలను పాటించాలన్నారు. పరీక్షలు చేయించుకుంటేనే రోగ నిద్దరణ జరుగుతుందని దంతో మెరుగైన వైద్యాన్ని చేయించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. శిబిరంలో ప్రజలకు ఉచితంగా హెచ్‌ఐవి పరీక్షలు, టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. మొత్తం 93 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పిహెచ్‌సి డా. చంద్రశేఖర్ , ఎన్‌జిఓ , ఐసీటీసీ సిబ్బంది, వనపర్తి జిల్లా టీబీ వ్యాధి నిర్ధారణ సిబ్బంది,పాన్‌గల్ ప్రాథమికఆరోగ్యకమ్యూనిటిహెల్త్‌ఆఫీసర్ రామయ్య, ఆయుష్ మాన్ మందిర్,వైద్యాధికారిమైథిలి,సూపర్‌వైజర్ శాంతమ్మ, హెల్త్ అసిసెంట్స్ రామచందర్ , రేవతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీటి కష్టాలు తీరుస్తున్న అపర భగీరథుడు



**ప్రజాపక్షం / పెబ్బేరు:** పెబ్బేరు మున్సిపాలిటీలోని అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు మూడు, నాలుగు సంవత్సరాలుగా తాగు నీటి సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం, పాలకులు కమిషన్ల కోసం కక్కుర్తి పడి ఈ సమస్యని గాలికి వదిలేశారు. కొన్ని రోజుల క్రితం కాలనీ మహిళ కార్యకర్తలు సమస్య తీవ్రతను వనపర్తి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి ప్రత్యేక చొరవ తీసుకొని సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించగా తక్షణమే పని ప్రారంభించారు. సమృద్ధిగా నీళ్లు పడ్డాయి..

## టీచర్లను పంపిస్తే చదువులెలా?

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** ప్రభుత్వం ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పేరుతో ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారిస్తే విద్యార్థుల చదువులు ఎలా కొనసాగుతాయని, కొత్త టీచర్లు వచ్చే వరకు వారి డిప్యూటేష్ రద్దు చేయాలని వీపనగండ్ల అమ్మ ఆదర్శ పాఠశాలవిద్యాకమిటీచైర్మన్ ఎత్తం చిట్టెమ్మ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు ఎత్తం కృష్ణయ్య, జిల్లా విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 6 నుంచి 10 తరగతిలకు 130 మంది విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారని, గత సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చి 100 శాతం ఉత్తీర్ణత సాధించారని డిఈఓకు వివరించారు. డిప్యూటేషన్ పేరుతో టీచర్లను వేరేచోటికి పంపించాల్సి వస్తే వారి స్థానంలో మరో టీచర్లను పంపించాలని కోరారు.

# ప్రజా ఉద్యమాల ఊపిరి సిపిఐ

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రజా సమస్యలపై ప్రతిఘటన పోరాటాలకు కార్యకర్తలు శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐరాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా పిలుపునిచ్చారు. సోమవారం బిజినేపల్లి మండలకేంద్రంలో సిపిఐ పార్టీ 18వ మండలమహాసభ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహవద్ద సిపిఐ జెండా ఎగరవేశారు. అనంతరం ఎంజేఆర్‌ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంచేపట్టిన తర్వాత మత ఘర్షణలు పెట్టేగిపోయి మతసామరస్యానికి ప్రమాదకరంగా మారాయన్నారు. నల్లధనం వెలికితీత,ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు, సంక్షేమ పథకాల అమలు, ధరల నియంత్రణ అన్నింటిని మోడిసర్కార్ గాలికివదిలేసిందన్నారు. నిరంతరం ప్రజలపక్షాన పోరాడేది సిపిఐ పార్టీయే అన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరిస్తున్నాయని అన్నారు. బిజెపిపాలిత రాష్ట్రాలలో దళితులు, మహిళల ప్రాణాలకు రక్షణకరువైందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సక్రమంగా అమలుపర్చడంలేదన్నారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు అర్హులందరికి ఇవ్వాలని, కొత్తరేషన్‌కార్డులు మంజూరుచేయాలన్నారు. ఆగస్టు 1,2తేదిలలో కల్వకుర్తి పట్టణంలో సిపిఐజిల్లా మహాసభలు నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితిసభ్యులు హెచ్.ఆనంద్‌జి, వార్లవెంకటయ్య, సిపిఐజిల్లా కార్యవర్గసభ్యులు ఈర్లచంద్రమౌళి, నర్సింహ్మా, ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, సిపిఐమండల కార్యదర్శి కృష్ణాజి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు.

## ప్రజావాణితోనే సమస్యలు పరిష్కారం

### నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 66 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీదారుల దరఖాస్తులలో పేర్కొన్న సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో 66 దరఖాస్తులు స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైని కలెక్టర్ కొయ్యడ ప్రణయ్ కుమార్, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం బిల్లులు చెల్లించాలి



**ప్రజాపక్షం/ధన్వాడః** ధన్వాడ మండల కేంద్రంలో సోమవారం రోజున ఎంఆర్సి కార్యాలయం ముందు మధ్యాహ్నం భోజన నిర్వహణక ఏజేన్సీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. గత కొన్ని నెలలుగా పెండింగులో ఉన్న మధ్యాహ్నం భోజనం బిల్లులతో పాటు 18 నెలలుగా పెండింగులో ఉన్న గుడ్ల బిల్లులు చెల్లించాలని కోరుతూ అదే విధంగా పెండింగు బిల్లుల కోసం ఏజేన్సీ నిర్వాహకులు సోమవారం పాఠశాలలో విద్యార్థులకు వంటల బిల్లులు చెల్లించాలని కోరుతూ గత రెండు రోజుల క్రితం ఎంఈఓ గాయత్రి కి వంటలు వండము అంటూ నోటీసులు సైతం అందించారు. దీంతో విద్యార్థులకు సోమవారం వంటలు వండలేదు దీంతో విద్యార్థులు భోజనానికి ఇబ్బంది పడ్డారు. ఇంటి నుంచే టిఫిన్లు తెచ్చుకొని భోజనం చేశారు. పెండింగ్లో ఉన్న బిల్లులను వచ్చే విధంగా చేస్తామని ఎంఈఓ గాయత్రి ఏజెన్సీ నిర్వాహకులకు హామీ ఇచ్చారు. జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్ వినతిపత్రం అందించారు. జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, మధ్యాహ్నం భోజనం నిర్వాహకులు లక్ష్మీ రేఖ, భీమమ్మ, అనంతమ్మ, సాయమ్మ, లక్ష్మి , గీత తస్లీమ్ తో పాటుగా పలువురు పాల్గొన్నారు.

## నిరుపేదల సంక్షేమమే లక్ష్యం



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజలకు సమానపాలనతోపాటు నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్‌ప్రభుత్వ లక్ష్యమని ఎంపి మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణ రెడ్డి అన్నారు. సోమవారం కల్వకుర్తి నియోజకవర్గపరిధిలోని వివిధ గ్రామాలలో రూ.23కోట్ల76లక్షలతో పలు అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేశారు. మండలపరిధిలోని గుండూర్ నుండి రంగాపూర్, ముకురాల బ్రిడ్జికి రూ.2కోట్ల 40లక్షలు, గుండూరునుండి సుద్దకల్ మధ్యలో ఉన్న బ్రిడ్జికి రూ.3కోట్లు, కల్వకుర్తి నుండి పంజుగుల బ్రిడ్జికి రూ.2కోట్ల 50లక్షలు, తర్నికల్ నుండి తోటపల్లి బ్రిడ్జికి రూ.4కోట్లు, తోటపల్లి గ్రామంలో రూ.8లక్షలతో అంగన్‌వాడి భవనం తదితర అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేశారు. పొల్యూషన్‌కంట్రోల్‌బోర్డుమెంబర్ ఠాకూర్‌బాలాజిసింగ్, నాయకులు ఆనంద్‌కుమార్,విజయ్‌కుమార్‌రెడ్డి,శ్రీకాంత్‌రెడ్డి, సంజీవ్‌యాదవ్, ఎస్సిఎస్టిమానిటరింగ్ అండ్ విజిలెన్స్‌కమిటిసభ్యులు జిల్లెలరాములు, రమాకాంత్‌రెడ్డి, పడకంటివెంకటేష్, సురేష్ ఉన్నారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం/ మద్దూర్ :** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మద్దూర్ ఎస్‌ఐ విజయ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కారించుకొని మద్దూర్ మున్సిపాలిటీ లోని జిల్లా ప్రాథమిక పాఠశాల (బాలుర) మద్దూరు లో విద్యార్థులకు గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు అలవాటు పడరాదని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సరదా కోసం మొదలైన అలవాటు మత్తులోకి నెడుతోందని, గతంలో సిగరెట్, మద్యంతో సరిపెట్టుకునే యువత ఇప్పుడు నిషా కోసం గంజాయి, మాదకద్రవ్యాల బారినపడి మత్తుకు బానిసలవుతున్నారని అన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉండేలా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం కారణంగా కలిగే దుష్ప్రభావాల పై విస్తృతంగాఅవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలకు దూరం

**ప్రజాపక్షం/మాగనూర్ః** ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల పై అవగాహన కలిగి ఉంటే మత్తు పదార్థాలు దూరంగా ఉండాలని ఎస్‌ఐ అశోక్ బాబు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని మాగనూరు పోలీసుల ఆధ్వర్యంలో కెసిబివి స్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అశోక్ బాబు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికి సమగ్ర అవగాహన అవసరమని అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం అనేది వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబం, సమాజం దేశం పైన కూడా ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుందని అన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా నైతిక విలువలు అలవర్చుకొని ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలని అన్నారు.

## స్థిరమైన జీవన విధానాలపై ఆసక్తి పెంచాలి

### కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** విద్యార్థిదశనుంచే ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జాతీయ విద్యార్థి పర్యావరణక్విజ్ పోటిల నమోదు అవగాహన పోస్టర్లను అదనపు కలెక్టర్ అమరేందర్, దేవసహాయం, డిఇఓ రమేష్‌కుమార్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ, విద్యామంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో 1వతరగతి నుండి 12వతరగతి వరకు విద్యార్థులకు అన్ని యాజమాన్య పాఠశాలల్లో హరిత్ జీవనమార్గం నినాదంతో జాతీయ విద్యార్థి పర్యావరణక్విజ్ పోటిలను నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈపోటిలు రూపొందించబడ్డాయన్నారు.

### ప్రజావాణికి 72 ఫిర్యాదులు

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధికప్రాధాన్యత ఇచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు అమరేందర్,దేవసహాయం ఫిర్యాదులు స్వీకరించారు.

## వితంతులు స్వేచ్ఛగా జీవించాలి

### రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరేళ్ల శారద




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** వితంతు మహిళలు స్వేచ్ఛగా, సంతోషంగా జీవించేహక్కును తెలంగాణరాష్ట్ర మహిళాకమీషన్ కల్పిస్తుందని , వితంతువులకు చేయూతనిస్తుందని రాష్ట్రమహిళా కమీషన్‌చైర్‌పర్సన్ నేరేళ్లశారద తెలిపారు. రాష్ట్ర మహిళాకమీషన్‌చైర్‌పర్సన్ నేతృత్వంలో రాష్ట్రమహిళా కమీషన్‌బృందం సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని సమీకృతజిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా ఎస్‌పిగైక్వాడ్ వైభవ్‌రఘునాథ్, జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నిశాఖల జిల్లా అధికారులతో వితంతు మహిళ సంరక్షణ హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. రాష్ట్ర మహిళాకమీషన్ చైర్‌పర్సన్ నేరేళ్లశారద మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రథమంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో మొదటిసారిగా మహిళ సంరక్షణ హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. తెలంగాణరాష్ట్రంలోనే అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని వితంతు మహిళలుఉన్నారని అందుకే వారి సమస్యల పరిష్కారంకోసం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో వితంతుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, అదనపు ఎస్‌పి రామేశ్వర్, మహిళా కమీషన్ కార్యదర్శి పద్మజ, స్వరూప, జిల్లా మహిళాశిశుసంక్షేమశాఖ అధికారిణి రాజేశ్వరి, డిఆర్‌డిఎపిడి చిన్న ఓబులేసు, ఎస్సికార్పొరేషన్ రాంలాల్, సఖికోఆర్డినేటర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## సత్వరమే ప్రజలకు న్యాయం

### కలెక్టర్ ఆదర్శ్ సురభి



**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, డిఆర్డీఓపిడి ఉమాదేవితో కలిసి ప్రజల నుండి ఆర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 90 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ‘ఉర్దూ ఘర్’తో మహబూబ్‌నగర్ ప్రతిష్ట పెంపు

### ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధిః**మహబూబ్‌నగర్ మోడల్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్ ఆవరణలో ఉర్దూ ఘర్ భవన నిర్మాణానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గత పన్నెండు సంవత్సరాలుగా పోరాటం చేసినా ఫలితం లేకపోయిందని, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించిన తర్వాత అది సాధ్యమైందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్‌నగర్ చరిత్రలో మరుపురాని రోజు అని అన్నారు. ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి పోయాయి కానీ, ఉర్దూ ఘర్ నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులు ఇచ్చి, నిధులు మంజూరు చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ ఉర్దూ ఘర్ మహబూబ్‌నగర్ ప్రతిష్టను మరింత పెంచుతుంది. అనుటలో అతిశయోక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. ఇక్కడ నిర్మించనున్న ఈ ఐదు అంతస్థుల ఉర్దూ ఘర్ ఫంక్షన్ హాల్ కాదని, ఉర్దూ ఘర్‌లో మొదటి అంతస్తులో సమావేశ మందిరం, రెండవ అంతస్తులో కల్చరల్ కార్యక్రమాలకోసంమూడవఅంతస్తులో రీసెర్స్ సెంటర్ లైబ్రరీ ఏర్పాటు, నాల్గవ అంతస్తులో దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే అతిథుల కోసం, ఐదవ అంతస్తులో భోజనశాల ఉంటుందన్నారు. పిల్లల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీసేందుకు, పోటీ పరీక్షల్లో రాణించేందుకు లైబ్రరీ, వివిధ అంశాలపైన రిసెర్చ్ చేయడానికి రిసెర్చ్ సెంటర్‌ను ఔత్సాహికులు ఉపయోగించుకోచ్చు అని ఆయన చెప్పారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, నిరుద్యోగ మహిళలకు ఉచితంగా కాంపిటీటీవ్ ఎగ్జామ్స్ కోసం తన సొంత నిధులతో ఉచితంగా కోచింగు ఇప్పిస్తున్నారని మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్ గా అభివృద్ధి చేయాలనే సంకల్పంతోఉన్నారని అన్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యే ని మహ్మద్ షబ్బీర్ అలీ ని సన్మానించారు. ఎమ్మెల్సీ , చీఫ్ ఎడిటర్ సియాసత్ డైలీ ఆమేర్ అలీ ఖాన్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత, మధుసూదన్‌రెడ్డి ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్, తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేని, ఫహీమ్, ఖురేషి, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, అవేజ్, సల్మాన్, ఫయాజ్ , అజ్మత్ అలి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

## కెజిబివి మిగులు నిధుల అవినీతిపై విచారణ జరపాలి

### బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్



**ప్రజాపక్షం/వనపర్తిటౌన్:** కేజీబీవీ మిగులు నిధుల అవినీతిపై నెల రోజులు గడుస్తున్నా ఆడిటింగ్ రిపోర్ట్ ఎందుకు ఇవ్వటం లేదని బీసీ పొలిటికల్ జేఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రశ్నించారు. సోమవారం వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 15కేజీబీవీలు, 3 మోడల్ స్కూల్ హాస్టళ్లలో 2024 /25 ఆర్థిక సంవత్సరంలో ఎన్ని మిగులు నిధులు ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రోసిడింగ్‌కు విరుద్ధంగా వనపర్తి జిల్లా డిఈఓ, జిసిడిఓ, ఎఫ్ఏఓలు, స్వంత నిర్ణయాలు ఎందుకు తీసుకున్నారని, జిల్లా సమగ్ర శిక్ష బ్యాంక్ ఖాతాకు మిగిలిన నిధులు జమ చేయాలని స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇచ్చిన ప్రోసిడింగ్‌లో ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా వనపర్తి జిల్లాలో మిగులు నిధులు ఎందుకు మళ్లించుకున్నారని, కేజీబీవీల్లో ఆర్వో వాటర్ ప్లాంట్లు, మినీ వాటర్ ప్లాంట్లు, ఇతర సామాగ్రి కొనుగోలుకు కొటేషన్లు ఎందుకు తీసుకోలేదో చెప్పాలన్నారు. కేజీబీవీ మిగులు నిధులు అవినీతి, అక్రమాలపై పత్రికల్లో వచ్చిన వార్తలకు ఇంత వరకు చర్యలు ఎందుకు తీసుకోవటం లేదని, కేజీబీవీ మిగులు నిధుల వినియోగంపై ఆడిటింగ్ మొక్కుబడిగా ఎందుకు చేశారని, కేజీబీవీలకు వెళ్లి ఆడిటింగ్ చేయకుండా వనపర్తి కేజీబీవీలో కూర్చుని ఆడిటింగ్ చేశారంటే ఆడిటింగ్ అధికారులు కూడా అమ్ముడు పోయారని తెలుస్తుందన్నారు. కేజీబీవీలలో బోగస్ బిల్లులు పెట్టించి కమీషన్లు వసూలు చేస్తున్నట్లు జీసీడీఓ శుభలక్ష్మీ పై అనేక ఆరోపణలు వచ్చినా విచారణ చేయాలని స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. బీసీ పొలిటికల్ జేఏసి నాయకులు వినిగౌడ్ , పాండురంగ యాదవ్, దేవర శివ, మహేందర్ నాయుడు, ధర్మేంద్రసాగర్,బత్తుల జితేందర్‌గౌడ్, అంజన్న యాదవ్, చెలిఇమిల్ల రామన్‌గౌడ్, అక్కల మల్లేష్ , అస్కని రమేష్ , ప్రవీణ్ గౌడ్ , శివ కృష్ణ, బాలరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## ఇతర రాష్ట్రాలకు ఆడాలని ఉంది

### దయచేసి ఎన్ఓసి ఇవ్వండి : పృథ్వీ షా



దేశవాళీ సీజన్‌కు సమయం దగ్గరపడుతున్న వేళ భారత యువ క్రికెటర్ పృథ్వీ షా కీలక నిర్ణయం తీసుకున్నాడు. కొన్నాళ్లుగా ముంబైకి ప్రాతినిధ్యం వహిస్తున్న షా కొత్త జట్టుకు మారాలనుకుంటున్నాడు. అందుకని ఆలస్యం చేయకుండా ముంబై క్రికెట్ అసోసియేషన్‌కు లేఖ రాశాడు. తనకు ఈ సీజన్‌లో రాష్ట్ర జట్టుకు ఆడాలనే ఉద్దేశం లేదని.. ఇతర రాష్ట్రాల జట్ల నుంచి ఆఫర్స్ వస్తున్నాయని ఆ లేఖలో పేర్కొన్న షా.. నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలని అభ్యర్థించాడు. గత సీజన్‌లో ఫిట్‌నెస్ లేదంటూ అతడిని రంజీ ట్రోఫీ స్క్వాడ్ నుంచి తప్పించింది ఎంసీఏ. దాంతో, ఈసారి కూడా పక్కనపెడితే తన భవిష్యత్ నాశనం అవుతుందనుకున్న షా.. ముంబైని వీడేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయాన్ని సోమవారం ఎంసీఏ మీడియాకు వెల్లడించింది. 'ఎన్‌ఓసీ కావాలని పృథ్వీ షా మాకు ఉత్తరం రాశాడు. ఈ విషయాన్ని మేము అపెక్స్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లాం. అతడికి త్వరలోనే ఎన్‌ఓసీ మంజూరు చేస్తాం' అని ఎంసీఏ సెక్రటరీ తెలిపాడు క్రిక్‌బజ్ కథనం రాసుకొచ్చింది. ఎన్‌ఓసీ కోసం లేఖ రాసిన లేఖలో షా తన కెరియర్ పుంజుకొనే అవకాశాల్ని ప్రస్తావించాడు. తనకు ప్రొఫెషనల్ క్రికెట్ ఆడేందుకు ఆఫర్లు వస్తున్నాయని తెలిపాడు. 'ప్రస్తుతం నా కెరియర్ మీద దృష్టి సారించాలనుకుంటున్నా. ఇతర రాష్ట్రాల బోర్డుల తరఫున ప్రొఫెషనల్ క్రికెట్ ఆడాలనుకుంటున్నా. నన్ను నేను మెరుగుపరుచుకోవడంతో పాటు క్రికెటర్‌గా మునపట్లో ఆడినట్టు ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నా. కాబట్టి దయచేసి నాకు ఎన్‌ఓసీ ఇవ్వండి. అప్పుడు నేను అధికారికంగా దేశవాళీ సీజన్‌లో ఇతర జట్లకు ఆడగలను' అని షా తన లేఖలో వెల్లడించాడు.

## ఈ సీజన్‌లో నా లక్ష్యమదే : నీరజ్



ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా ఈ సీజన్‌ను ఘనంగా ఆరంభించాడు. 90 మీటర్ల మార్క్ అందుకున్న జావెలిన్ స్టార్ ప్యారిస్ డైమండ్ లీగ్ టైటిల్ విజయంతో రికార్డు నెలకొల్పాడు. అంతటితోనే సంతృప్తి చెందకుండా తన తదుపరి లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాడీ బడిసె వీరుడు. ఈసారి వరల్డ్ ఛాంపియన్‌షిప్ గెలుపొందడమే టార్గెట్‌గా ముందుకు సాగుతున్నానని చెప్పాడు నీరజ్. మంగళవారం జరుగనున్న గోల్డెన్ స్పైక్ అథ్లెట్ సమావేశంలో నా అల్టిమేట్ గోల్‌ను నిర్ణయించుకుంటానని తెలిపాడీ ఛాంపియన్. చెక్ రిపబ్లిక్‌కు చెందిన జాన్ జెలెంజీని కోచ్‌గా నియమించుకున్నా. ఆయనతో కలిసి నా ఆట, టెక్నిక్‌ను మరింత మెరుగుపరచుకునేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. ఈ మధ్యే 90 మీటర్ల దూరం ఈటెను విసిరాను. దాంతో, సీజన్‌లో మరిన్ని అద్భుత ఫలితాలు సాధిస్తాననే నమ్మకంతో ఉన్నాను. చెక్ రిపబ్లిక్‌లోని నింబక్‌లో శిక్షణ సంతృప్తికరంగా సాగింది. ఈ సీజన్‌లో నా ప్రధాన లక్ష్యం సెప్టెంబర్‌లో టోక్యో వేదికగా జరుగబోయే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్. ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శనతో విజేతగా నిలవాలని భావిస్తున్నా అని నీరజ్ వెల్లడించాడు.

## ఐఓసి చీఫ్‌గా మాజీ ఛాంపియన్..

### తొలి ఆఫ్రికా మహిళగా రికార్డు



అంతర్జాతీయ ఒలింపిక్ సంఘంలో కొత్త అధ్యాయం మొదలైంది. 133 ఏళ్ల చరిత్రలో తొలిసారి ఒక మహిళ చీఫ్‌గా ఎంపికయ్యారు. ఒలింపిక్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో థామస్ బాస్చ్ నుంచి సోమవారం క్రిస్టీ కొవెంట్రీ బాధ్యతలు స్వీకరించారు. తద్వారా ఐఓసీ అత్యున్నత పదవి చేపట్టిన మొదటి మహిళగా.. తొలి ఆఫ్రికా దేశస్థురాలిగా క్రిస్టీ చరిత్ర సృష్టించారు. లసాన్నేలో జరిగిన కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు బాస్చ్ ఆమెకు ఒలింపిక్ హౌస్ తాళాలు అప్పగించారు. 41 ఏళ్ల క్రిస్టీ జూన్ 23 నుంచి ఐఓసీ చీఫ్ హోదాలో విధులు నిర్వర్తించనున్నారు.

ఒలింపిక్ డే సందర్భంగా తనను ఐఓసీ కొత్త చీఫ్‌గా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. 'నా రాక్ స్టార్స్.. నాకు స్ఫూర్తి దివ్వెలు వీళ్లు' అంటూ తన ఇద్దరు కూతుళ్ల వంక చూస్తూ ఆనందబాష్పాలు రాల్చారు క్రిస్టీ. ఎనిమిదేళ్ల పాటు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. జింబాబ్వే దిగ్గజ స్విమ్మర్ అయిన క్రిస్టీ 2004, 2008లో ఒలింపిక్ పతకం సాధించారు.



## 10 వికెట్లు పడగొడితే
# బోణీ భారత్‌దే..

అండర్సన్ – టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా హెడింగ్లేలో జరుగుతున్న తొలి టెస్టు రసవత్తరంగా సాగుతోంది. రెండో ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్(137), వైస్ కెప్టెన్ రిషభ్ పంత్(118) శతకాలతో భారీ స్కోర్‌కు బాటలు వేశారు. టీ సెషన్ తర్వాత పుంజుకున్న ఇంగ్లాండ్ బౌలర్లు గిల్ సేనను కట్టడి చేశారు. జోష్ టంగ్ విజృంభణతో టెయిలెండర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. అనంతరం ఆతిథ్య జట్టు ఓపెనర్లు జాక్ క్రాలే(12 నాటౌట్), బెన్ డకెట్(9 నాటౌట్) వికెట్ కాపాడుకున్నారు. దాంతో, నాలుగో ఆట ముగిసే సరికి ఇంగ్లండ 21 పరుగులు చేసింది. ఐదో రోజు ఆ జట్టుకు 350 రన్స్ అవసరం కాగా.. టీమిండియాకు పది వికెట్లు కావాలి. సో.. ఇరుజట్లకు తొలి సెషన్ కీలకం కానుంది. లీడ్స్‌లోని హెడింగ్లేలో తొలి టెస్టు ఆద్యంతం ఉత్కంఠగా సాగుతోంది. నాలుగో రోజు కేఎల్ రాహుల్(137) క్లాస్ ఇన్నింగ్స్‌కు, వైస్ కెప్టెన్ రిషభ్ పంత్(118) సూపర్ సెంచరీ తోడవ్వడంతో భారత్ భారీ స్కోర్ చేసింది. నాలుగో వికెట్‌కు 195 రన్స్ జోడించిన ఈ ద్వయం.. టీమిండియాను పటిష్ట స్థితిలో నిలిపింది. అయితే.. టీ సెషన్ తర్వాత అనూహ్యంగా తడబడింది. కొత్త బంతితో జోష్ టంగ్(372) చెలరేగగా.. 31 పరుగుల వ్యవధిలోనే గిల్ సేనచివరి ఆరు వికెట్లు కోల్పోయింది. బషీర్ బౌలింగ్‌లో ప్రసిధ్ కృష్ణ బౌండరీకి యత్నించి ఔటయ్యాడు. దాంతో, 364 వద్ద గిల్ సేన ముగిసింది. అనంతరం 371 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆతిథ్య జట్టు వికెట్ కోల్పోకుండా 21 రన్స్ చేసింది.

# యువతరంగం

## ఫోకస్


## ఎఐతో భావోద్వేగ అనుబంధం!

ఆశ్చర్యం కలిగించేదే అయినప్పటికీ, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఎఐ)తో ప్రజలు, ప్రధానంగా యువతీయువకులు భావోద్వేగ అనుబంధాన్ని పెంచుకుంటున్నారు. తాజా అధ్యయనాల ప్రకారం ఇది సమాజిక పరిణామాలను, మానసిక విశ్లేషణ అంశాలను ప్రతిబింబిస్తున్నది. 21వ శతాబ్దం అనేది యంత్ర మానవ సంబంధాల శకం అని చెప్పవచ్చు. ఎఐ పట్ల మానవుల ప్రవర్తనలో అనేక మార్పులు వచ్చాయి. కొన్ని సందర్భాల్లో, ఈ ఎఐ టూల్స్ పట్ల భావోద్వేగమైన అనుబంధం ఏర్పడుతోంది. ఇది ఏకకాలంలో సాంకేతిక, మానసిక, సామాజిక అంశాలు కలసిన



విస్మయకర దృశ్యం. మానసిక కోణాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. ఇటీవలి కాలంలో జీవనేతర వస్తువుల్లో (వస్తువులు, మిషిన్లు) మానవ లక్షణాలు ఊహించే లక్షణాలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని మానవీకరణ (Anthropomorphism)గా పేర్కొంటారు. ఫోన్లు, టేన్లు, కుర్చీలు, వాహనాలు, ఇతరత్రా వస్తువులతో మాట్లాడడం కొత్తేమీ కాదు. ఈ వస్తువులన్నీ తమను అర్థం చేసుకుంటాయని నమ్మేవారు ఉన్నారు. ఫలానా పెన్నుతో రాస్తే ఎక్కువ మార్కులు వస్తాయని, ఫలానా వస్తువను వెంట తీసుకెళితే విజయాలు సొంతమవుతాయని భావించే వాళ్లు నిత్య జీవితంలో ఎంతో మంది కనిపిస్తారు. ఈ నమ్మకాలకు అర్థం లేదు. కానీ, ఒంటరితనంలో ఉన్నవారు తమ మానసిక ఉల్లాసం కోసం ఏదైనా ప్రత్యామ్నాయం వెదుకుతారు. ఎఐ చాట్‌బాట్స్ నెమ్మదిగా ఆ ఖాళీని నింపే ప్రయత్నం చేస్తూ, వారిలో ఒక మానవతా భ్రమను కలిగిస్తాయి. మానవ మానసిక శాస్త్రంలో ఉన్న ఆత్మీయత సిద్ధాంతం ప్రకారం, మనిషి మనోజీవితానికి అనుబంధాలు అవసరం. ఈ అవసరాన్ని కొంతవరకు ఎఐ అనుకరణాత్మకంగా తీరుస్తోంది. మానసిక కోణంతోపాటు సామాజిక కోణాన్ని కూడా ప్రస్తావించుకోక తప్పదు. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా మనం ఏర్పరుచుకునే బంధాలను డిజిటల్ ఇంటిమసీ అంటారు. ఈ తరహా సంబంధాలు వాస్తవిక సంబంధాల స్థానంలో నిలుస్తున్నాయి. ఇవి ఒకవైపుగా ఉండే భావోద్వేగ సంబంధాలు పెరుగుతాయి. ఉదాహరణకు సెలబ్రిటీ, యూట్యూబర్, లేదా ఎఐ చాట్‌తో. యూజర్, ఎఐతో సన్నిహితమైన అనుభూతి కలిగి ఉన్నా, మరోవైపు అది పూర్తిగా నిర్మితమైన బోధన. సాంప్రదాయ బంధాలు తగ్గిపోతున్న ఈ కాలంలో, ఎఐ బాట్స్ వంటి వాటి ద్వారా సాంస్కృతిక స్థాయిలో కొత్త రకాల 'సహచరత్వం' తలెత్తుతోంది. ఇది ప్రత్యేకించి జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. యువత ఇలా యంత్రాలతో, యాంత్రిక వ్యవస్థలతో భావోద్వేగ సంబంధాలను పెంచుకోవడం కొన్ని సందర్భాల్లో ప్రతికూల పరిస్థితులకు దారితీయవచ్చు. ఈ వైఖరి నైతిక, మానవ విలువలను ప్రశ్నిస్తుంది. ఎఐతో ఉన్న సంబంధం సత్యం కాని సాంత్వనమన్నది నిజం. కాబట్టి, ఎఐతో సంబంధాలు నిజమైన మానవ సంబంధాల స్థానాన్ని ఎన్నటికీ భర్తీ చేయలేవు. దీనివల్ల ప్రేమ, అనుబంధం, బాధ్యత వంటి భావాలు అర్థహీనమవుయి. కొన్ని విపరీత ఘటనలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఉదాహరణకు ఎఐ వ్యక్తిగత సహచారిగా పనిచేసే రెప్లికా యాప్‌తో చాలా మంది వినియోగదారులు పెళ్లి చేసుకున్నట్టు భావించారు, తమ ప్రేమ, కష్టాలు ఇందులో పంచుకున్నారు. చాలా మంది వినియోగదారులు చాట్‌జిపిటికి కూడా 'నీవు నాకు అత్యంత సమీప మిత్రుడివి' అని సందేశాలు పంపుతున్నారు. వీరిలో అత్యధికులు యువతీయువకులే అన్నది నిజం. ఏదిఏమైనా ఎఐతో మానవులు ఏర్పరుచుకునే భావోద్వేగ బంధాలు నూతన యుగపు మార్పు సంకేతం. ఇవి సమాజంలో ఒంటరితనం, డిజిటల్ ఆధారిత జీవితం, సంబంధాల మార్పు అనే అంశాలను ప్రతిబింబిస్తున్నాయి. అయితే, మానవ సంబంధాల సౌందర్యం, లోతు, బాధ్యతలను పూర్తిగా భర్తీ చేయలేవు. ఎఐ అనేది మనిషికి తోడు, ప్రత్యామ్నాయం కాదు అనేది గుర్తుంచుకోవాలి.

## విద్యానాణ్యత అవసరం





విద్య అనేది వ్యక్తి జీవితం, సమాజ అభివృద్ధి యొక్క పునాది. కానీ కేవలం విద్య సాధించడం మాత్రమే కాకుండా, ఆ విద్యలో నాణ్యత ఉండటం అత్యంత కీలకం. నాణ్యమైన విద్య తేలికగా ఉపయోగపడే జ్ఞానం, ఆలోచనా సామర్థ్యం, వృత్తిపరమైన నైపుణ్యాలను అందిస్తుంది. ఆధునిక, సమగ్ర, సమయానుకూలమైన పాఠ్యాంశాలు విద్యార్థుల వ్యక్తిత్వాన్ని, సృజనాత్మకతను పెంపొందిస్తాయి. విద్యార్థులకు అలాంటి నాణ్యమైన విద్య లభించాలంటే, అధ్యాపకులకు నైపుణ్యం ఉండాలి. ప్రత్యేక శిక్షణ అత్యవసరం. వాస్తవిక అనుభవాల ద్వారా నేర్చుకునే అవకాశాన్ని విద్యార్థులకు కల్పించాలి. సమాజ అవసరాలకు అనుగుణంగా ఉండే విద్యా విధానం అమలుకావాలి. నాణ్యత విద్య అత్యధిక ప్రాధాన్యతను సంతరించుకోవడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. ఇది వ్యక్తిగత అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుంది. సరైన విద్య తగిన ఆలోచనా శక్తిని, సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. ఉద్యోగ అవకాశాల కోసం కూడా ఇది అవసరం. మార్కెట్ అవసరాలకు తగ్గ నైపుణ్యాలు కలిగి ఉండటం తప్పనిసరి. సమాజం పట్ల బాధ్యతతో, సౌహార్దంతో వ్యవహరించే వ్యక్తుల పెరుగుదలకు దారితీస్తుంది. నైపుణ్యం పెరిగిన వారు దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్తారు. ఎన్నో రకాలుగా ఉపయోగపడే నాణ్యత గల విద్య కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు పలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముందుగా పాఠ్యాంశాల నవీకరణ జరగాలి. అధ్యాపకుల శిక్షణ, ప్రేరణ విద్యా వ్యవస్థలో అంతర్భాగం కావాలి. సాంకేతికతతో బోధన విధానాలను సమన్వయం కుదుర్చుకోవాలి. ప్రయోగాత్మక విద్యను ప్రోత్సహించాలి. మూల్యాంకనం విధానాలలో నాణ్యత పెంపొందించాలి. అయితే, నాణ్యత విద్యను అందించడానికి కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. వాటిలో ముఖ్యమైనది ఉపాధ్యాయులకు తగిన శిక్షణ లేకపోవడం. అంతేగాక, కాలం చెల్లిన పాఠ్యాంశాలు, తగ్గిన ప్రాసంగికత, అవసరాలకు సరిపడని విద్యాసౌకర్యాలు వంటి సమస్యలు నాణ్యమైన విద్యను అందించడానికి అడ్డంకులుగా నిలుస్తున్నాయి. అదే విధంగా సోషల్ మీడియా వంటి వివిధ కారణాలతో విద్యార్థుల ఆసక్తి తగ్గడం కూడా ఒక ప్రధాన సమస్యగా మారింది. ఇలాంటి అడ్డంకులను అధిగమించి, విద్యంలో నాణ్యత కలిగి ఉండటం అవసరం. ఇది కేవలం వ్యక్తిగత విజయం మాత్రమే కాదు, సమాజ, దేశాభివృద్ధికి ప్రధాన మూలధనం. అందుకే విద్యా సంస్థలు, ప్రభుత్వాలు, తల్లిదండ్రులు, విద్యార్థులు అందరూ కలిసి నాణ్యతను పెంపొందించేందుకు కృషి చేయాలి.

## ప్రజలకు అండ సిపిఐ జెండా

### సిపిఐ జిల్లా కార్యదర్శి..ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ (గుర్రంపోడు):** ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలే ప్రాణంగా ప్రజలకు అండగా సిపిఐ జెండా నిలబడి పోరాడుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు.ఆదివారం గుర్రంపోడులో జరిగిన సిపిఐ మండల 15వ మహాసభ లో ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేసిన నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా, ప్రజా సమస్యలే అజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సిపిఐ అని, శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని దున్నేవాడికి భూమి కావాలని, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించినపార్టీ సిపిఐ అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారుల కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని అదుపు చేయకుండా పేదవారి నడ్డి విరిచే విదంగా మళ్ళీ సిలిండర్ ధర పెంచడం అన్యాయమని అన్నారు.పండించిన పంట కు గిట్టుబాటు ధర మరియు, ఎరువులు విత్తనాలు సబ్సిడి మీద ఇవ్వాలని అన్నారు.ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆయన కోరారు.సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రధాన సమస్య అయిన పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేసి జిల్లాకు సాగునీరు అందించాలని కోరారు. నకిలీ విత్తనాలు అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించుటకు కృషి చేయాలని . కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజాచారి,ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బి జగన్, మండల కార్యదర్శి రేపక లక్ష్మీపతి,నాంపల్లి మండల సిపిఐ కార్యదర్శి ఎస్ రమేష్, మండల నాయకులు రామచంద్రరావు,మాజీ జడ్పీటీసీ వెంకయ్య, మదార్, శంకరాచారి , యాదయ్య,నరసింహ,అమీర్, బి అంజయ్య ఇస్తారీ బి శ్రీను. కే నరసింహ చారి పర్వత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతను మింగేస్తున్న 'రిటైర్డ్' నియామకాలు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** రైల్వే బోర్డు తీసుకున్న పదవీ విరమణ చేసిన ఉద్యోగుల తిరిగి నియామక నిర్ణయం దేశంలోని నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయమని, దీన్ని తక్షణమేఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పేర్కొన్నారు. సోమవారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోట్లాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. అలాంటి సమయంలో, గ్రూప్ సి, గ్రూప్ బి వర్గాల రిటైర్డ్ ఉద్యోగులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకొచ్చే నిర్ణయం అర్థరహితం. ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

# దోపిడీదారులను తరిమికొట్టేవరకు సిపిఐ పోరాటాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్


### మాజీ సర్పంచులు పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధిః** మాజీ సర్పంచులు ప్రభుత్వ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, దోపిడి దారులను తరమి కొట్టే వరకు సిపిఐ పోరాటాలు కొనసాగిస్తుందని పేదలకు ప్రభుత్వ స్థలాల్లో ఇంటి స్థలాలకేటాయించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. సదాశివ పేట దేశాన్ని దోచుకుంటున్న దోపిడీదారులను తరమి కొట్టే వరకు సిపిఐ పోరాటం చేస్తుందిన గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాలంలో చేసిన పనులకు మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలోద్దీన్ అన్నారు. సదాశివ పేట లోని సిపిఐ 6 మండల మహాసభలు సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తాజోద్దీన్ మాట్లాడారు. సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దయనీయ పరిస్థితి నెలకొందని పేద ప్రజలు చికిత్స ల కోసం మా దృక్ప త్రికి వెళితే మందులు లేక వైద్యులు కొరతతో హైదరాబాద్ రెఫర్ చేస్తున్నారని దీంతో జిల్లాలో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని వెంటనే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ స్పందించి జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని నిరుపేదలకు 100 గజాల ఇంటి స్థలాన్ని ప్రభుత్వ భూముల్లో కేటాయించాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదని హెచ్చరించారు. పేద ప్రజల సంక్షేమాన్ని కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ పూర్తిగా విస్మరించిందన్నారు. పేదలకు ఇంటి స్థలాలను పంపిణీ చేయడంలో సిపిఐ నారాయణరెడ్డి కాలం నుండి ఇప్పటి వరకు ఇంటి స్థలాలను వేలాది మందికి పంచిన చరిత్ర సిపిఐ పార్టీ బలోపేతానికి ప్రతి గ్రామంలో కమిటీలు వేసి పార్టీని మరింత బలోపేతం చేసేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సదాశివపేట ఏఐటియుసి మండల కార్యదర్శిగా శంకరప్ప సిపిఐ మండల కార్యదర్శి షఫీ అహ్మద్ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రెమమాన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఏఐటియుసీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటరాజ్యం ,పాడి పరిశ్రమ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజీవ రెడ్డి, నాయకులు రమేష్, బుజ్జమ్మ, రజిని ,జ్యోతి సాదిక్ అలీ ముస్తఫా అలీ ,ముస్తఫా పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పారదర్శకత ఉండాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్



**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** ఇందిరమ్మ ఇళ్లకేటాయింపులో అవకతవకలను అరికట్టి, అర్హులైన పేదలకు మాత్రమే ఇళ్లు మంజూరు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 21, 22 తేదీలలో జిల్లాలో సిపిఐ నాలుగో మహాసభలు ప్రజల సహకారంతో ఘనంగా నిర్వహించామని తెలిపారు. ఈ మహాసభలో రామడుగు లక్ష్మ ణ్‌ను సిపిఐ జిల్లా కార్యదర్శిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్టు వెల్లడించారు. మొత్తం 51 మంది సభ్యులతో జిల్లా కౌన్సిల్‌ను, 16 మంది సభ్యులతో జిల్లా కార్యవర్గాన్ని మహాసభలోనే ఎన్నుకున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు విషయంలో కొన్ని చోట్ల అవకతవకలు జరుగుతున్నట్టు సమాచారం వస్తోందని, అర్హత లేని వారికి ఇళ్లు మంజూరవుతున్నాయని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు అనేవి రాజకీయాలకతీతంగా, పారదర్శకంగా కేటాయించాల్సినవని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా నిజమైన పేదలకే లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇక రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరోగ్యశ్రీ, పెన్షన్లు, రైతు భరోసా వంటి హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరించి అర్హులైనవారికి పెన్షన్లు మంజూరు చేయాలని అన్నారు. రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, గిరిజనులు, బొగ్గు గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ స్పందన తక్కువగా ఉందని విమర్శించారు. ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని తుమ్మిడి వద్ద కొనసాగించాలన్నది ప్రజల కోరిక అని చెప్పారు. సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు ఇంటి స్థలాలు, 2025 లాభాల్లో వాటా ప్రకటించాలని, కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ మద్దతు పొందిన ప్రజా సంఘాలు జిల్లాలో బలమైన నిర్మాణంతో ఉన్నందున, మంచిర్యాల జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం నిర్మాణానికి ఒక ఎకరం భూమిని కేటాయించి, ఆఫీసు నిర్మాణానికి బడ్జెట్ మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఖలిందర్ అలీ ఖాన్, మేకల దాసు, బొల్లం పూర్ణిమ, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, భీమనాథుని సుదర్శన్, ఇప్పకయల లింగయ్య, దాగం మల్లేష్, రేగుంట చంద్రకళ, ముస్కే సమ్మయ్య, మిర్యాల రాజేశ్వర్ రావు, గోపి, నక్క వెంకట స్వామి, చాడ మహేందర్ రెడ్డి, శంకరయ్య, దేవి పోచన్న పాల్గొన్నారు.

## 'రెడ్‌క్రాస్'కు ఇచ్చే కళాశాల స్థలాన్ని ఉపసంహరించుకోవాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** రెడ్ క్రాస్ సంస్థకి ఇచ్చే కళాశాల స్థలాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలం విషయంలో మా పార్టీ వారికి అందిన సమాచారం దృష్టిలో పెట్టుకొని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల స్థలాన్ని పరిశీలించారు. భువనగిరి రెడ్ క్రాస్ సంస్థ వారు కళాశాల స్థలం కావాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నట్లుగా తెలిసింది. ఇప్పటికే జూనియర్ కళాశాల స్థలం కొంత అన్యాక్రాంతం అయినదని ఇప్పుడు భువనగిరి రెడ్ క్రాస్ సంస్థ వారు కళాశాల స్థలం ఇవ్వాలని ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకున్నట్లుగా తెలిసినదని ఆయన తెలిపారు. మేము మా పార్టీ అభ్యంతరం తెలియపరుస్తున్నాం. ఇట్టి స్థలం భవిష్యత్తులో విద్యార్థులకు ఉపయోగ ఉంటుందని మరిన్ని విద్యా కళాశాలలు నిర్మాణం చేసుకోవాలి చెప్పారు. వందల సంఖ్యలో విద్యార్థులకు ఉపయోగముంటుంది, జిల్లా కేంద్రంలో ఈ ఒక్కటి మాత్రమే ఉన్నది రెడ్ క్రాస్ సంస్థకు దిన చర్యలు చాలా ఉంటాయి రోగుల సందడి ఉంటుంది కళాశాల స్థలం రెడ్ క్రాస్ సంస్థ వారికి ఇవ్వద్దని అభ్యంతరం తెలియజేశారు. మా పార్టీ స్థానిక నాయకులతో కలిసి కళాశాల స్థలాన్ని పరిశీలించి ప్రిన్సిపల్ పాపి రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, సిపిఐ భువనగిరి మండల పట్టణ కార్యదర్శులు దాసరి లక్ష్మ య్య, పుట్ట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జులై 9న జాతీయ సార్వత్రిక సమ్మెకు తరలిరండి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** జాతీయ కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్‌ల ఆధ్వర్యంలో జులై 9న జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మయ్య పిలుపునిచ్చారు. సోమవారంబద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ అధ్యక్షతనజిల్లాకార్యవర్గ సమావేశం జరిగింది. సమ్మయ్య మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అత్యధిక సంఖ్యలో శ్రమిస్తున్న ప్రజల జీవితాలు, జీవన ఉపాధిపై తన కార్పోరేట్ విధానాల కుతంత్రాలను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు జీవన ఉపాధికి సంబంధించిన ప్రాథమిక హక్కులను దూరం చేస్తున్నదన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయం చేయడం జరిగిందని, జిల్లాలోని కార్మిక వర్గం విజయవంతం చేయాలని కోరారు. ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు కెమసారం శ్రీనివాస్, కడారి బీరయ్య, కాళిదాసు, కొమురయ్య, రామారావు, సన్నీ, జక్కుల ఆగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని ఎస్‌కెడినగర్‌లో త్వరలో జరగబోయే నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి త్వరలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల నేపథ్యంలో డ్రైనేజీ పైపులు డంపింగ్ చేయడం జరిగిందని, ఈ పనులు పూర్తి అయితే భవిష్యత్ డ్రైనేజీ సమస్య లేకుండా ఈ కాలనీలకు సమస్య పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సిరివెన్నెల, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ రాగుల



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : వనస్థలిపురం డివిజన్‌లోని శ్రీనివాస పురం కాలనీలో నూతనంగా నిర్మాణ చేస్తున్న 54 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి కాలనీ సంక్షేమ వాసులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో ఉన్న ప్రతి కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. డివిజన్‌లో ప్రధానమైన సమస్యలను పరిష్కరించడం జరిగిందని, వరద ప్రభావం ఉన్న కాలనీలకు శాశ్వత పరిష్కారం లభించిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాలనీలు శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అభివృద్ధి పనులను కాలనీ సంక్షేమ వాసులు పర్యవేక్షణతో పనులు చేయించకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు దాసరి మధు గౌడ్, కాలనీ వాసులు బాల్‌రెడ్డి, వేణు, చిన్నా యాదవ్, వెంకటరమణ కాలనీ అధ్యక్షులు నవీన్, క్రిస్టియన్ కాలనీ అధ్యక్షులు హరినాధ్‌రెడ్డి, నాగార్జున కాలనీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, మమల్లికార్జున కాలనీ అధ్యక్షులు నిరంజన్, సాయి కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రేడ్ లైసెన్స్ లేని షాపుల సీజ్



ప్రజాపక్షం/గండిపేట : వందరోజుల ప్రణాళికలో భాగంగా నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేటలో సోమవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సానిటేషన్ ఇన్స్‌పెక్టర్ లచ్చిరం ఆధ్వర్యంలో గండిపేట గ్రామంలో షాపులపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపులలో తనిఖీలు నిర్వహించగా 150 కేజీల ప్లాస్టిక్ ని సాధ్యునం చేసుకుందామని తెలియజేశారు. ట్రేడ్ లైసెన్స్ లేని ప్లాస్టిక్ వాడుతున్న షాప్ యజమానులపై రూ.20,000 జరిమానా విధించడం జరిగింది అన్నారు. ట్రే లైసెన్స్ తీసుకోకుండా నా ఇష్టం ఉన్నప్పుడు నేను తీసుకుంటాను మీరు ఎవరు నాకు చెప్పడానికి అని దురుసుగా ప్రవర్తించిన వ్యక్తి యొక్క షాపును సీజ్ చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్, వార్డు ఆఫీసర్లు, వార్డు జవాన్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే ఉపసంహరించాలి :సక్రు



ప్రజా పక్షం/గండిపేట: నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించాలని సిపిఐ ఏఆర్ దేవరాజ్ భవన్ రాజేంద్రనగర్ ఆఫీసులో జిహెచ్ఎంసి మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రమావత్ సక్రు నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కులు కాపాడుకుందాం... జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్లను ప్రవేశ పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. రద్దు చేసిన పాత ఇరవై తొమ్మిది కార్మిక చట్టాలను పునరుద్దించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎండి షఫీ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ సంక్షేమ ఫలాలు



చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ భీంభరత్

ప్రజాపక్షం/షాబాద్ : ఇందిరమ్మ రాజ్యంలో అందరికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామెన భీంభరత్ అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలో నరేడ్లగూడ, దామర్లపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు, సీసీ రోడు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు దశల వారిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నాడని పేర్కొన్నారు. అర్హులైన నిరు పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేందుకు రూ. 5లక్షలు, సీసీ రోడ్డు పనులకు రూ.5 లక్షలు మంజూరు చేశామని చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గానికి మొత్తం 3,500 ఇండ్లు మంజూరు చేసిన్నట్లు చెప్పారు. మొదటి విడుతలో సొంత ప్లాటు ఉన్నా వారికి అవకాశం ఇచ్చిందని తెలిపారు. రేడవ విడుతలో ఇంటి జాగ లేని వారికి ప్లాట్ మంజూరు చేసి అనంతరం ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి గ్రామంలో ఇట్లు లేని ప్రతి ఒక్కరికి ఈ అవకాశం వినియోగం అవుతుందన్నారు. ఎస్సీ ఎస్టీలకు అదనంగా లక్ష రూపాయలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల స్థలాలను మహిళల పేరుమీద పట్టా ధృవపత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మెన్ పీసరి సురేందర్ రెడ్డి, మద్దూర్ మల్లేష్, తమ్మళి రవీందర్, పెంటారెడ్డి, తొంట వెంకటయ్య, పెంటయ్య, పామెన నర్సింలు, చెన్నయ్య, దండు రాహుల్, మహిళ్ల అధ్యక్షురాలు అశ్విని, పార్వతి విజయ్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలి

జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను బాధ్యతతో పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులకు సూచించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగరంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కమిషనర్ వినతులు స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను ఆయా విభాగాలకు పంపి తక్షణ చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదును ఆయా విభాగాల అధికారులు బాధ్యతతో పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్‌లు వేణుగోపాల్, సత్యనారాయణ, యాదగిరి రావు, వేణుగోపాల్ రెడ్డి, ఎస్. పంకజ, నళిని పద్మావతి, చీఫ్ సిటీప్లానర్ కె. శ్రీనివాస్, అదనపు ఎస్‌పి(విజిలెన్స్) శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ అదనపు చీఫ్ సిటీప్లానర్లు ప్రదీప్‌కుమార్, గంగాధర్, వెంకన్న, రంజిత్ కుమార్, ముఖ్య వైద్యాధికారి డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, డిప్యూటీ సిఈ పనస రెడ్డి, హౌసింగ్ ఎస్ఈ పి.వి. రవీందర్, రాజేశ్వర రావు, ఏఈ బాలాజీ, ఎస్ఎన్‌డిపి డిప్యూటీ సిఈ పి.వి. రావు, ఎస్టేట్ ఆఫీసర్ ఉమా ప్రకాష్, అడ్వర్టైజ్‌మెంట్ ఆఫీసర్ మహమ్మద్ దుర్ధన భాను పాల్గొన్నారు.

**దోమల నివారణకు ముమ్మరంగా ఏఎల్ఓ కార్యక్రమాలు చేపట్టాలి**

దోమల నివారణకు ముమ్మరంగా ఏఎల్ఓ కార్యక్రమాలు చేపట్టాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. అదనపు, జోనల్ కమిషనర్‌లు, ఆయా విభాగాల ఉన్నతాధికారులతో సోమవారం ఉదయం దోమల నివారణ, పారిశుద్ధ్యం, కోర్టు కేసులపై కమిషనర్ సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆయా జోన్‌లలో ఎంటమలాజిలో పనిచేస్తున్న సిబ్బంది ఏఎల్ఓ కార్యక్రమాలు చేయకుండా ఇతర విధులు కేటాయించినట్లు తెలిసినందున వారిని ఏఎల్ఓ కార్యక్రమాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్, డిప్యూటీ కమిషనర్‌లను ఆదేశించారు. కోర్టు కేసులకు సంబంధించిన జోనల్ కమిషనర్ స్థాయిలో ఒక నోడల్ అధికారి నియమించుకుని ఎప్పటికప్పుడు కేసులపై రిప్లై పంపించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ కమీషనర్ రిప్లై పంపించే సందర్భంగా సంబంధిత జోనల్ కమిషనర్ ఆమోదంతో కోర్టుకు పంపించాలని సూచించారు. అవసరమైన సహాయం కోసం ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్(న్యాయ విభాగం)ను సంప్రదించాలని సూచించారు. చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కతో దోమల ఉత్పత్తి ఎక్కువయ్యే అవకాశం ఉంటుందని, గుర్రపు డెక్క తొలగింపునకు ప్రణాళిక తయారు చేయాలని అదనపు కమిషనర్ (చెరువులు, ఆరోగ్యం)ను ఆదేశించారు. పరిశుభ్రతపై నగరంలో చేపడుతున్న ముందస్తు వర్షాకాల పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్‌ను మరిన్ని రోజులు కొనసాగించాలని అదనపు కమిషనర్(పారిశుద్ధ్యం)కు సూచించారు. వార్డులోని మిగిలిపోయిన కాలనీలలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం) సి.ఎన్. రఘు ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుండి 25 తేదీ వరకు ముందస్తు వర్షాకాల పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్ ఇప్పటివరకు 120 వార్డులో పూర్తయ్యాయని, 3900 మెట్రిక్ టన్నుల సి అండ్ డి వేస్ట్, 5400 మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించామన్నారు. ఒక్కొక్క వార్డులో ఇంకా మిగిలిపోయిన కాలనీల కోసం ఈ నెల 26వ తేదీ నుండి మరో 20 రోజుల పాటు అనుమతినిస్తే నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్‌ను కోరారు.

# ఎరువుల కొరత రానివ్వొద్దు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: రైతులకు ఎక్కడా ఎరువుల కొరత లేకుండా వ్యవసాయ అధికారులు,డీలర్లు సమన్వయంతో పనిచేసి సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువుల సరఫరా పై జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, వ్యవసాయ అధికారులు, ఎరువుల డీలర్లతో పాటు సీజనల్ అంశాలపై వివిధ శాఖలకు చెందిన అధికారులతో వేరువేరుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల వ్యవసాయ అధికారులు ఆయా మండలాల్లో పండే పంటలు, వాటి విస్తీర్ణనానికి ఏ మేరకు ఎరువుల అవసరం అవుతాయని ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుని కావాల్సిన ఎరువులను ఆయా కంపెనీల డీలర్లతో మాట్లాడి గోదాములలో నిల్వ ఉంచాలని అన్నారు.

సహకార, వ్యవసాయ శాఖ అధికారులు తమ సొసైటీల ద్వారా సమన్వయంతో ఎరువుల సరఫరాలో ఎలాంటి సమస్యలు లేకుండా చేసుకోవాలని సూచించారు. మండలాల వారిగా అధికారులతో ఏదైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డీలర్లు సరైన సమయంలో ఎరువులను తెప్పించాలని, గోదాములు సరిపడా లేకుంటే అద్దెకైన కొంతకాలం తీసుకొని నిలువ చేయాలని చెప్పారు. రైతు భరోసా పడిన రైతులను మంగళవారం రైతు వేదిక వద్దకు తీసుకురావాలని తెలుపుతూ, మంగళవారం(నేడు) రాష్ట్ర ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఉన్నందున రైతు వేదికలకు రైతు భరోసా పడిన రైతులను తీసుకొని రావాలని మండల వ్యవసాయ అధికారులను జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశించారు.

**మొక్కలు నాటేందుకు స్థలాలను సిద్ధం చేయాలి**

మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించి గుంతలు తీసి సిద్దంగా ఉంచాలని అటవీ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. వన మహోత్సవంలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయుటకు సంబంధిత శాఖల అధికారులు మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించి, గుంతలు తీసి సిద్దంగా ఉంచాలని, అవసరమైన మొక్కలను నర్సరీలలో అందుబాటులో ఉంచాలని, నాటిని ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు.

**ప్రజావాణికి 76 ఫిర్యాదులు..** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డిఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు,మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చిన్నారుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేలా కృషి

షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: చిన్నారుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేందుకు కృషి చేయాల్సిన అవసరం నిర్వాహకులపై ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని రాచప్పకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కిడ్జి పాఠశాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.మహేష్, మౌనికలను ప్రత్యేకంగా అభినంధించడంతోపాటు పూలబొకేతో ఘనంగా స్వాగతం ఫలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు ఎంతో బిజిబిజిగా ఉంటున్న తరుణంలో చిన్నారి పిల్లలను కిడ్జి పాఠశాలలను పంపిస్తుంటారని, వారికి క్రమశిక్షణతో కూడిన విద్యనే నేర్పించడంతోపాటు బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఫీజులు ముఖ్యం కాదు.. వారి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.మహేష్ మాట్లాడుతూ చిన్నారులకు అభ్యాసంతో పాటు వినోదం, సంక్షేమంపై ప్రత్యేక దృష్టికి కేంద్రీకరించినట్లు తెలిపారు. తమపై నమ్మకంతో చిన్నారులకు అప్పగిస్తే అదే బాధ్యతతో తాము వారికి విద్యాబుద్దులు నేర్పించేందుకు కృషి చేస్తామని వివరించారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిలబెట్టుకునేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రెండున్న ఏళ్లు దాటిని చిన్నారులకు మాత్రమే చేర్పించేందుకు అవకాశం ఉంటుందని, విద్యార్థులకు మౌళిక సౌకర్యాలతోపాటు స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నేతలు చెంది తిరుపతిరెడ్డి, నీరటి వాసు, బచ్చలి నరేష్, ముబారక్, బిసిసేన నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప, శంకరయ్య, ఉపాధ్యాయులు మౌనిక, పి.నందిని, కె.నందినిలు పాల్గొన్నారు.

## సర్ధార్‌నగర్ తైబజారు వేలం పాట ధర రూ.2,21000

ప్రజాపక్షం/షాబాద్ : సర్ధార్‌నగర్ తైబజార్ వేలం పాట ధర రూ.2,21,000కు మన్మర్రి గ్రామానికి చెందిన బండ వెంకట్ రెడ్డి కైవసం చేసుకున్నట్లు గ్రామ కార్యదర్శి విజయసింహా తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తైబజార్ వేలం పాట గత సంవత్సరం రూ.1,10000 పోతే ఈ సంవత్సరం పెరిగిందని పేర్కొన్నారు. రైతులకు, చిరు వ్యాపారులకు ఎలాంటి అక్రమాలు జరగకుండ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు



మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్

ప్రజాపక్షం/కొత్తూరు: శాశ్వత నీటి సమస్య పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ వివరించారు. సోమవారం కొత్తూరు మున్సిపల్ పరిధిలోని మొదటి వార్డు కుమ్మరిగూడలో కౌన్సిలర్ పీర్లగూడెం మాధవి గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో కుమ్మరి అశోక్ ఇంటి నుండి పిచ్చకుంట్ల అరుణ ఇంటి వరకు మంచి నీటి పైపులైన్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ మున్సిపాలిటిలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇప్పటికే వార్డుల వారిగా నీటి సమస్యలను గుర్తించి పైపులైన్ పనులు మొదలు పెట్టామని, ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర రాజదాని హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న కొత్తూరు మున్సిపాలిటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మున్సిపల్ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని ఇవ్వాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, ఇందుకు ప్రజలందరు సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు జె.అనిత శ్రీనివాస్ గౌడ్, పి.సోమ్లానాయక్, బి.ప్రసన్నలత యాదయ్య, నేతలు శంషాబాద్ ఆనంద్, కుమ్మరి వెంకటయ్య, కుమ్మరి ఆంజనేయులు, పీర్లగూడెం శ్రీశైలం, కుమ్మరి వెంకటేష్, బండారి రామకృష్ణ, పీర్లగూడెం లక్ష్మయ్య, గొల్లూరి శ్రీనులు పాల్గొన్నారు.

# మొహర్రం ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : ఈ నెల 27 నుంచి జరుగనున్న మొహరం పండుగ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మొహరం పండుగపై అదనపు ప్రతిమా సింగ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దర్గాల వద్ద నీటి వసతి, పారిశుద్ధం సమస్య తలెత్తకుండా ఆయా మునిసిపాలిటీలు, గ్రామ పంచాయితీలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.దీంతో పాటు అవసరమయిన చో వీధి దీపాల ఏర్పాటు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని,మొబైలు టాయిలెట్స్ కూడా ఏర్పాటు చేయాలని అన్నారు. దెబ్బతిన్న రహదారులను గుర్తించి వెంటనే మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతి భద్రతలకు విగాతం కలుగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని పోలీసు శాక వారికి తెలిపారు. అదే విధంగా వేడుకలు జరిగే ముఖ్యమయిన ప్రాంతాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.అగ్నిమాపక సిబ్బంది కూడా అప్రమత్తంగా వుండాలన్నారు. వేడుకల సందర్భంగా ఏవైనా ఇబ్బందులు ఉంటే స్థానికంగా ఉండే అధికారులను సంప్రదించాలని అదనపు కలెక్టర్ ఉత్సవాల నిర్వాకులకు సూచించారు. ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా పండుగను ప్రశాంతగా జరుపుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా పంచాయితీ అధికారి సురేష్ మోహన్, జిల్లా మైనారిటీ సంక్షేమ ఆధికారిశాఖ కోట్ల నవీన్ రెడ్డి,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎంవెంకటేశ్వరరావు,జిల్లా పరిషత్ ఇఇ రాజేశ్వర్ అధికారులు పాల్గొన్నారు.

# ఓటిపిల సహాయంతో దర్జాగా దొంగ రిజిస్ట్రేషన్లు

రూ.7కోట్ల విలువైన భూమిని కాజేసిన వైనం

తహసీల్దార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు



ప్రజాపక్షం/షాద్‌నగర్: ఓటిపిల సహాయంలో దర్జాగా ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో దొంగ రిజిస్ట్రేషన్లు అయినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామానికి చెందిన బాధిత రైతులు తహసీల్దార్‌తోపాటు షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు కథనం ప్రకారం వివరాలు మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామానికి చెందిన మహిళా రైతు కొత్తపల్లి వినోద పేరుపై 2022లో గ్రామ శివారులోని సర్వే నంబర్ 74/ఆ1/2/1, 68/ఆ/1/2/1, 59/ఇ/2/1లో మొత్తం 2.28గుంటల భూమి ఉందని వివరించారు. ఇదూ భూమికి సంబంధించి కొత్తపల్లి వినోద మామ సుభాన్‌రెడ్డి వారి మరో కుమారుడు మధుసూదన్‌రెడ్డిలు కలిసి ధరణిలోని లొసుగులను ఆసరాగా చేసుకొని షాద్‌నగర్ పట్టణంలోని ఒక మీసేవ కేంద్రం యాజమాని, తహసీల్దార్ ఆఫీసులో ఉన్న ఓ ధరణి ఆపరేటర్‌తో కుమ్మక్కై ఏజిపి డాక్యుమెంట్ సృష్టించి తమ భూమిని కాజేసినట్లు ఆరోపించారు. కొత్తపల్లి వినోద ద్వారా ఓటిపిలను సంపాదించి అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో చిల్కమర్రి గ్రామంలో రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేయడం ద్వారా అసలు కథ బయట పడినట్లు బాధితులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి నరసింహారెడ్డికి చెందిన సర్వే నంబర్ 56/ఇ/1, 59/ఆ/అ/2, 59లలో మొత్తం భూమి 1.29గుంటల భూమి ఉందని వివరించారు. గ్రామానికి చెందిన కొత్తపల్లి మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి నరసింహారెడ్డి పేరుపై ఉన్న భూమిని భార్య నవనీత పేరుపైకి ఏజిపి చేసినట్లు బాధితుడు నరసింహారెడ్డి వాపోయారు. నరసింహారెడ్డి భార్య నవనీత మధ్య వివాదాలను దృష్టిలో పెట్టుకొని మీసేవ నిర్వాహకులతో కుమ్మక్కై దొంగ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు వివరించారు. జిపిఏ పొందిన నవనీత అక్కడి నుండి తక్షణమే అదే భూమిని దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డికి సేల్‌డీడ్ చేసినట్లు బాధితుడు నరసింహారెడ్డి వివరించారు. ఇట్టి భూమి విలువ సుమారు రూ.7కోట్లకు పైగానే ఉంటుందని బాధిత రైతులు వాపోతున్నారు. పట్టాదారులకు తెలియకుండా కొత్తపల్లి సుభాన్‌రెడ్డి, కొత్తపల్లి మధుసూదన్‌రెడ్డి, నవనీత, మీసేవ నిర్వాహకుడు, ధరణి ఆపరేటర్లు కలిసి మొత్తం భూమిని కాజేసినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన ఈ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని తమ భూములను తమకు ఇప్పించేందుకు కృషి చేయాలని బాధితులు డిమాండ్ చేశారు.

**మీసేవ కేంద్రాల ద్వార ఓటిపిలతో నకిలీ డాక్యుమెంట్లు : తహసీల్దార్ పార్థసారథి**

మీసేవ కేంద్రాల ద్వారానే ఓటిపిలు సృష్టించి నకిలీ డాక్యుమెంట్లను తయారు చేశారని ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ పార్థసారథి తెలిపారు. వచ్చిన డాక్యుమెంట్లు, స్లాట్ బుకింగ్ పరిశీలిస్తే మీసేవ ద్వారానే జరిగిందని వివరించారు. ఈ విషయాన్ని గమనించి తక్షణమే షాద్‌నగర్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ వివరించారు. ధరణి లోసుగుల ద్వారా ఎలా డాక్యుమెంట్ సృష్టించారో అనే విషయాలపై జిల్లా కలెక్టర్‌తోపాటు షాద్‌నగర్ ఆర్‌డిఓకు, ఏసిపిలకు సైతం ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ పార్థసారథి తెలిపారు. ఓటిపిల పట్ల రైతులు అనుక్షణం జాగ్రత్తలు వహించాలని, ఎవరికి ఓటిపిలు చెప్పరాదని సూచించారు.

# మహానగరి
## గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాలనీలోని తన దృష్టికి వచ్చిన సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఉప్పల్ ఎంఎల్ఏ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళ వారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రీపురం సర్వే నంబర్ 215లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్ఏ లక్ష్మారెడ్డి దృష్టికి కాలనీ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే చక్రీపురం కాలనీలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని కాలనీవాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షులు మొగిలి రాఘవరెడ్డి, బుచ్చిరెడ్డి,కొండారెడ్డి, అశోక్, సహదేవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 5116 మంది రైతుల ఖాతాల్లో రూ.4.61కోట్లు జమ



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** రైతు భరోసా పథకం ద్వారా అన్నదాతకు అండ గా ఉండే లక్ష్యంగా ప్రభుత్వం ఆర్థికంగా చేయూతను అందిస్తోందని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద జిల్లాలో 5116 మందికి రైతుల ఖాతాల్లో రూ.4.61 కోట్లు జమ చేయటం జరిగిందని, విడతల వారీగా వారికి నేరుగా బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తుంటామన్నారు. వ్యవసాయానికి పెట్టుబడి భారాన్ని తగ్గించి వ్యవసాయోత్పత్తులు పెంపొందించుకొనేందుకు ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

## గిరిజన బాలబాలికలకు బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో గిరిజన బాలబాలికలకు 2025–26 విద్యా సంవత్సరానికి గాను 3వ తరగతిలో 17, 5వ తరగతిలో 9, 8వ తరగతిలో 9 సీట్లు కేటాయించామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి తెలిపారు. గిరిజన తెగలకు చెందిన లంబాడా, ఎరుకల, ఇతర ఉప కులాలకు చెందిన బాలబాలికలు ఈ పాఠశాలల్లో చేరేందుకుగాను తుదిగడువు ఈ నెల 17 నుండి 27వరకు పొడిగించబడిందని, తమ దరఖాస్తులను తమ కార్యాలయంలో పొందవచ్చన్నారు. తమ కుటుంబ ఆదాయ, కుల, రేషన్ కార్డు, ఆధార్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుండి తీసుకొన్న బోనఫైడ్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టులతో దరఖాస్తులు ఇవ్వాలని కోరారు. సందేహాలకు 9959159629కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.



## ప్రజావాణిలో 117 అర్జీలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** కింది స్థాయిలో పరిష్కారానికి నోచుకోలేని బాధితులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 117 అర్జీలను సమర్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, ఇతర జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాధికారులతో కల్సి అర్జీలను తీసుకొని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారులకు వాటి పరిష్కార విషయం తెలియ చేయాలని, ఏదైనా సందర్భంలో అర్జీలను పరిష్కరించలేని పక్షంలో దానికి సరైన కారణాలు సైతం అర్జీదారులకు వివరించాలన్నారు. దీంతోపాటు అర్జీలన్నింటినీ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తుండాలన్నారు.



## విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

**ప్రజాపక్షం/నాగారం:** విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ నాగలింగేశ్వర స్వామి దేవస్థానం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్‌లను ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డితో కలసి ముఖ్య అతిథిగా విచ్చేసిన చంద్రారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, సభ్యులు బర్ల బిక్షపతి, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



## మౌలిక వసతుల కల్పనకు వినతి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** వినాయకనగర్ డివిజన్‌లోని కాకతీయనగర్ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డిని కల్సి వినతిపత్రం సమర్పించారు. నార్త్ కాకతీయనగర్‌లోని స్మశాన వాటికలో నీటి సౌకర్యం లేదని, బోర్ వేయించాలని, స్నానాల గదులు, మరుగు దొడ్లు నిర్మించాలని, వయో వృద్ధుల కోసం బెంచీలు ఏర్పాటు చేయాలని, దీంతోపాటు భూగర్భ డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరచటం ద్వారా ఓవర్ ఫ్లో కాకుండా చూడాలని కోరారు. కాకతీయనగర్ ప్రాంతానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి, గోపాల్, కొమరయ్య, వెంకటచారి, సత్యనారాయణ అజయ్, కవిత, తదితరులు ఎమ్మెల్యేను కల్సిన వారిలో ఉన్నారు.



## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** డివిజన్‌లోని ఆర్‌కె నగర్ ప్రాంతంలో రూ.40 లక్ష ల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ సోమవారం ప్రారంభించారు. సిసి రోడ్డు పనులతో పాటు శ్రీకృష్ణ నగర్, బలరాంనగర్ ప్రాంతాల్లో గతంలో స్థానికుల అవసరాల దృష్ట్యా వదిలేసిన ప్యాచ్ వర్కులు సైతం పూర్తి చేస్తారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌కెనగర్‌లో దాదాపు సిసి రోడ్డు పనులు పూర్తయ్యాయని, డివిజన్‌లో మిగిలిన అన్ని సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ ఎఇ నవీన్, రమేష్, జలమండలి అధికారి మురళి, ఎస్ఎఫ్ఏ వసంత కాలనీవాసులు ప్రభాకరశాస్త్రి, హరినాథ్, పుల్లారావు, ప్రకాశన్, గణేశన్, వేణు,సాయిపటేల్, తదితరులు పాల్గొన్నారు.

# జలమండలిలో చట్ట ప్రకారం ఉద్యోగ సంఘాల గుర్తింపు ఎన్నికలు

### ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జలమండలిలో చట్టం ప్రకారం గుర్తింపు ఉద్యో గ సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి కామ్‌గార్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి జలమండలి ఎండి అశోక్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఖైరతాబాద్ జలమండలి ప్రధాన కార్యాలయంలో సోమవారం జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డిని కలసి జలమండలి ఉద్యోగసంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు డిమాండ్లపై మొగుళ్ళ రాజి రెడ్డితో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రామరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ బి. భూమ య్య, కార్యవర్గసభ్యులు శ్రీనివాస్ వినతిపత్రం అందచేశారు. చట్ట ప్రకారం అర్హులైన యూనియన్‌లతో చేర్చలు జరపాలని, ప్రతి ఉద్యోగికి కొత్త గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు, ఓటర్ లిస్టులను సవరించాలని, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ నెంబర్ 2873 (రెండు గ్రూపుల వివాదంతో) కోర్టు లో ఉన్నందున, 2873 యూనియన్‌ను ఎలక్షన్ బోర్డులో పరిగణలోకి తీసుకోవద్దన్నారు. జలమండలిలో కిందిస్థాయి ఉద్యోగుల పదోన్నతులు, సర్కిల్ 1, బోర్డు లెవెల్‌లో ఆర్డర్స్ ఇచ్చే ప్రక్రియలో ఉన్నందున, పదోన్నతుల ప్రక్రియ ముగిసిన తరువాత ఎన్నికలు నిర్వహించాలని కోరారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ రిటర్నింగ్ ఆఫీసర్ ఇచ్చిన ఎలక్షన్ నోటీసులో డేట్ ఆఫ్ రెకొనింగ్ 01–10–2024 అని పేర్కొని, దాదాపు 8 నెలలు అయిందన్నారు. ఈ 8 నెలల్లో దాదాపు 500 మంది ఉద్యోగులు పదవీవిరమణ చేయగా, చాలామంది ఉద్యోగులు చనిపోయారన్నారు. ఎన్నికలు నిర్వహించే ముందే సవరించిన ఉద్యోగుల కొత్త ఓటర్ జాబితా విడుదల చేయాలన్నారు. ఎన్నికల నోటీసులో పేర్కొన్నట్లుగా, ఎంప్లాయీస్ యూనియన్ రిజిస్టర్ నెంబర్ 2873 మీద రెండు గ్రూపు లు రిటర్న్స్ సబ్మిట్ చేసినవని పేర్కొన్నప్పటి కీ, ఎన్నికల సమావేశానికి రెండు గ్రూపులను పిలవడం వల్ల గందరగోళానికి దారితీసి, మీటింగ్ జరగకుండా, ఎజెండా చర్చకు రాకపోవడం లేబర్ డిపార్ట్‌మెంట్ కారణం అని, ఇది ఐడి యాక్ట్‌కి, లేబర్ రూల్స్‌కి విరుద్ధమని తెలిపారు. ఎలక్షన్ మీటింగ్ కంటే ముందే, ఎంప్లాయీస్ యూనియన్ రిజిస్టర్ నెంబర్ 2873 సమస్య పరిష్కరించి, సమావేశం నిర్వహించాలని, లేదా బోర్డు స్థాయిలో 2873 యూనియన్‌ని బహిష్కరించి, చట్టబద్ధంగా ఉద్యోగసంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ జలమండలి ఎన్నికల సమస్యలను కార్మిక శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు రాజిరెడ్డి తెలిపారు.

## జర్నలిస్టుల సంక్షేమమే ప్రెస్‌క్లబ్ ధ్యేయం

### శామీర్‌పేట అధ్యక్షుడు క్యాతం రవి



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** జర్నలిస్టుల సంక్షేమమే ప్రెస్‌క్లబ్ ధ్యేయమని ఉమ్మడి శామీర్‌పేట ప్రింట్ మీడియా (ప్రెస్‌క్లబ్) కమిటీ ప్రెసిడెంట్ క్యాతం రవి అన్నారు. సోమవారం తూంకుంట మున్సిపాలిటిలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఇంచార్జ్ అధ్యక్షుడు దేశం కృష్ణగౌడ్ అధ్యక్షతన ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

అధ్యక్షుడుగా క్యాతం రవి (ప్రజాపక్షం), ఉపాధ్యక్షులుగా సింగం పవన్‌కుమార్, మంచాల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా బత్తుల ప్రభాకర్‌యాదవ్, సంయుక్త కార్యదర్శిగా బందెల ప్రభాకర్, కోశాధికారిగా గిరిప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా రవీందర్‌గౌడ్, విశ్వనాథ్, మధుసూదన్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, శ్రీహరి, సలహాదారులుగా దేశం కృష్ణ, నర్సింహారావు, శ్రీరాములు, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, భూపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు చిన్నా, ప్రభాకర్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## భవిష్యత్తులో మరిన్ని విజయాలతో త్రివేణి స్కూల్ అడుగులు

### సిఆర్ఒ వెంకట్రావ్

**ప్రజాపక్షం/నిజాంపేట్:** త్రివేణి స్కూల్ భవిష్యత్తులో మరిన్ని విజయాలతో ముందడుగు వేయాలని త్రివేణి స్కూల్ సిఆర్ఓ వెంకట్రావ్ అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని చింతల్ త్రివేణి స్కూల్‌లో త్రివేణి విజయ అమృత వాహిని 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఆర్ఒ వెంకట్రావ్ విద్యార్థులకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేశారు.

అనంతరం విద్యార్థులు చేసిన నృత్య కార్యక్రమా లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వెంకట్రావ్ మాట్లాడు తూ జాతీయ, అంతర్జాతీయ పోటీలలో త్రివేణి స్కూల్ విద్యార్థులు విజయాల ను సాధించారని, త్రివేణి నిశ్శబ్దంగా నిరంతరం తన పనిని చేసుకుంటూ ముందుకువెళ్తుందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధిస్తూ అడుగులు వేయాలని సూచించారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపల్ శివ కీర్తన మాట్లాడుతూ గతంలో మార్కు ల విద్యా విధానంలో రాష్ట్ర స్థాయిలో త్రివేణి విద్యార్థులు నిలిచారని, మళ్లీ మార్కుల విద్యా విధానంలో రాష్ట్ర స్థాయిలో 4, 7 స్థానాల తో ఎస్ఎస్సీలో అగ్రగామిగా విద్యార్థులు నిలిచారని గుర్తుచేశారు.

ఉపాధ్యాయుల సహకారం, విద్యార్థుల శ్రద్ధతో త్రివేణి పాఠశాల మరిన్ని ఉత్తమ ఫలితాలను సాధిస్తుందన్న ధీమావ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నళిని, పాఠశాల ఇన్‌చార్జి క్రాంతి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రారంభోత్సవాల్లో ప్రోటోకాల్ రగడ


### అధికారులపై చర్యలు తీసుకోవాలి:ఆకుల సతీష్

**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ప్రోటోకాల్‌కు తిలోదకాలిస్తున్న ఘటనలు విచారణమని ఆకుల సతీష్ అన్నారు. ప్రజలతో నేరుగా సంబంధమున్న ప్రజాప్రతినిధులను పక్కనబెట్టి, అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు అధికారుల సహకారంతో స్వయంగా ప్రారంభోత్సవాలు నిర్వహించడం ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే చర్యగా ఖండిస్తున్నామని, ప్రజలే ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను అవమానించటం తీవ్రంగా ఆందోళన కలిగిస్తోందనీ కుత్బుల్లాపూర్ కమిషనర్లు సహా సంబంధిత అధికారులపై విచారణ జరిపి తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు మున్సిపల్ చట్టం ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా నిర్వహించే విధంగా స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని ప్రజాస్వామ్య పద్ధతుల్లో నమ్మకం ఉన్న ప్రతి పౌరుడి ఆవేదన అని, ఈ విధంగా ప్రోటోకాల్ లేకుండా కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌లు/నాయకుల పనుల ప్రారంభోత్సవాలపై జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు అధికారికంగా ఫిర్యాదు చేయడమే కాకుండా కమిషనర్లకు ప్రోటోకాల్ ప్రకారం పనుల ప్రారంభోత్సవాలు జరిగేలాగా చూడాలని ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, ఈశ్వర్ రెడ్డి, చందు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/కోట్‌పల్లి :** కోట్‌పల్లి మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయలంలో స్పెషల్ ఆఫీసార్ పల్లవి రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు మత్తుపదార్థాలు లైంగిక దాడులపై ఎస్ఐ శైలజ అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. అలాగే ఎవరైనా పోకిరిలు ఇబ్బందులకు గురిచేసిన, పాల్పడిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని వివరించారు. బాల్య వివాహాలు నిర్మూలన గురించి కూడా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, నర్సింలు, హసన్, ఉపాధ్యాయులు సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులు సత్వరమే పరిశీలించి పరిష్కరించాలి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ ప్రాంతలనుండి ప్రజావాణికి 146 దరఖాస్తులు స్వీకరించాడం జరిగింది అని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు అందరూ సమయపాలన పాటించాలని, జిల్లా కార్యాలయములో, మండల కేంద్రాలలో బయోమెట్రిక్ ఏర్పాటు చర్యలు తీసుకుంటున్నాట్లు తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును రాగా అందులో హౌసింగ్ శాఖ,ఇందిరమ్మ,ఇండ్లు,పెన్షన్లు కలెక్టరేట్ సెంక్షన్లు ,రెవెన్యూ ,ఇతర శాఖలకు సంబంధించిన ప్రజా ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. పూర్తి స్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్ , అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి ఆర్‌డిఓ వాసు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి**

ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మెడీ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యశిబిరంలో బిపి,బిల్ రుబిన్ టెస్ట్ ద్వారా కొలెస్ట్రాల్, కిడ్నీ,లివర్,కల్షియం,క్రియాటిన్ తదితర ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనుషుల జీవనశైలి ఆహారపు అలవట్లు, వాతావరణం మార్పుల వల్ల అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. నేడు కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు, ఉద్యోగులకు వన్ మెడి హబ్ ఆధ్వర్యంలో ఆరోగ్య వైద్య పరీక్షలు చేపట్టి రిపోర్టులకు అనుగుణంగా తగు సూచనలతో పాటు, వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఉచిత శిబిరాన్ని నిర్వహించినట్లు ఆయన అన్నారు. క్షయ వ్యాధి ని నిర్మూలించే దిశగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో, ప్రభుత్వ ఆసుపత్రెల్లో ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వైద్యశిబిరం ప్రారంభోత్సవంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, హర్ష్‌చైదిరి సంతోష్ లు పాల్గొన్నారు.

**మత్తు పదార్థాలు, నిర్మూలకు ప్రతి ఒక్కరు కృషి :** మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ రకు నిర్వహించనున్న నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. ఈనెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా నషా ముక్త్ భారత్ అబియాన్ కార్యక్రమంలో పిల్లలు, వికలాంగులు వయోవృద్ధుల ఆధ్వర్యంలో వారంరోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం రూపొందించిన గోడ ప్రతులను కలెక్టర్ అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## పేద కార్మికులకు డబుల్ బెడ్ రూంలు కేటాయించాలి : పాలబిందెల శ్రీనివాస్

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లో పనిచేస్తున్న కార్మికులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యక్రమంలో నిర్వహించిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కి సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే మున్సిపల్ సిబ్బందికి స్థానికంగా వున్న డబుల్ బెదురూమ్‌లు కేటాయింపుల సమయంలో ఇల్లులేని పేద కార్మికులకు డబుల్ బెదురూమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన పేద ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించాలని లేని పక్షంలో ఖాళీగా వున్న డబుల్ బెడ్‌రూమ్ పేద ప్రజలకు పంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కె.మల్లయ్య, బి.కుమార్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



## వచ్చే నాలుగేళ్లలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు : తోటకూర వజ్రేష్ యాదవ్

**ప్రజాపక్షం/ ఘట్‌కేసర్ :** వచ్చే నాలుగేళ్లలో పార్టీలకు అతీతంగా ప్రతి నిరుపేదకి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ హామీ ఇచ్చారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ నారాయణ గార్డెన్‌లోని ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ మంజూరీ పత్రాల కార్యక్రమంలో అర్హులైన 75 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ప్రొసీడింగ్ పత్రాలను తోటకూర వజ్రేష్ యాదవ్,బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,మున్సిపల్ కమిషనర్,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, మున్సిపల్ అధ్యక్షులు మామింళ్ళ ముత్యాలు యాదవ్‌లు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ సొంత స్థలం ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ 5లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని లబ్ధిదారులు ప్రభుత్వం నిబంధనల ప్రకారం 600 చదరపు గజాలలోపు ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ మచేందర్ రెడ్డి, ఆలయ ధర్మకర్త అమర్,ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, యూత్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి, డైరెక్టర్ ఉదయ్ కుమార్,మాజీ డైరెక్టర్ బొక్క ప్రభకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లేష్, ఉపాధ్యక్షుడు నాగరాజ్, మైనార్టీ అధ్యక్షులు ఫారుక్,మహ్మద్ ఖాయ్యూం, మాధవ రెడ్డి, ఎస్‌సి సెల్ అధ్యక్షులు శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధికి దోహదం..ప్రగతి రథ చక్రం...

### ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** అభివృద్ధికి దోహదం, ప్రగతి రథ చక్రమని బిఆర్ఎస్ పార్టీ శాసనసభ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ కైసర్ నగర్‌లోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం నుండి బాలానగర్ వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసుని ఎమ్మెల్యే కెపి వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ పేదలు అధికంగా నివసించే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం నుండి నగరంలోని వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుని ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. ఉదయం ఏడు గంటలకు, 8;30 గంటలకు అదేవిధంగా సాయంత్రం నాలుగు, ఐదు గంటలకు బయల్దేరి వెళ్లే ఈ ఆర్టీసి బస్సు సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సాధుల వేణు, సాజిద్, ఖాసీం, అతిక్ రెహమాన్, ఎస్ కె వలి, యాదగిరి, విజయ్ రాంరెడ్డి, కస్తూరి బాలరాజు, సంధ్యారెడ్డి పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల నిర్వహణపై ప్రభుత్వం నిర్లక్ష్యం..

**ప్రజాపక్షం /కొడంగల్ :** దేశ ప్రగతికి గ్రామాలే పట్టుకోమ్మలు అలాంటి గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామంలో పరిపాలన విధానం సక్రమంగా సాగాలని కాని కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో గ్రామ పరిపాలనపై ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందని బిఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. సోమవారం కొడంగల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బోంరాస్‌పేట మండల పరిధిలోని నాందర్‌పూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మాసాని వెంకటయ్య మాట్లాడుతు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుందో అర్థం కావడం లేదని అన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపిటిసి, జెడ్‌పిటిసిల పదవికాలం పూర్తి అయి ఏడాదిన్నార కాలం గడుస్తున్న ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదని తీవ్ర విమర్శలు చేశారు. దీనిపై అధికార పార్టీల నేతలు పొంతన లేని సమాదానాలు ఇస్తూ కాలం వేలదీస్తున్నారని అరోపించారు. ఇప్పటికైన గ్రామా పరిపాలన అభివృద్ధిపై దృష్టి సారించి తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలను ఏర్పాటు చేసి గ్రామాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైన ఉందని డిమాండ్ చేశారు.వీరితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

# రీల్

## సమీరా క్యారెక్టర్ చూసినప్పుడు.. ‘చూడాలని ఉంది’లో సౌందర్య గుర్తుకొచ్చింది

### కుబేర సక్సెస్ మీట్‌లో చిరంజీవి



కంటెంట్ బాగుంటే, హ్యూమన్ ఎమోషన్స్‌ని టచ్ చేయగలిగితే ఆడియన్స్ థియేటర్స్‌కి వస్తారని ‘కుబేర’ సినిమా నిరూపించిందని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా సక్సెస్ ఫుల్‌గా నడుస్తున్న నేపథ్యంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చిన చిరంజీవి మాట్లాడుతూ ఇది నా సక్సెస్ మీట్‌లా అనిపిస్తుంది. అలాంటి ఆనందాన్ని ఇక్కడ పొందుతున్నాను. ఈ సినిమా నేను సినిమా చూశాను. ఆయన చెప్పినది వంద శాతం కరెక్ట్. ఈ సినిమా తర్వాత తను మరో 40 ఏళ్లు అద్భుతంగా రాణిస్తారనేది వాస్తవం. ఈ క్యారెక్టర్ శేఖర్ రాయడం, అది నాగార్జున చేయడం ఇదే ఫస్ట్ సక్సెస్‌గా భావిస్తున్నాను. దేవ క్యారెక్టర్‌లో ధనుస్‌ని తప్ప ఇంకెవరిని ఊహించుకోలేం. ఆ క్యారెక్టర్ చూసిన తర్వాత అలా అనిపించింది. సినిమా చూస్తున్నప్పుడు ధనుష్ ని గుర్తించలేకపోయాను. అంతలా క్యారెక్టర్‌లో ఇన్వాల్వ్ అయిపోయారు. ఈ సినిమాని ఒక సినిమాలా కాకుండా ఒక అనుభవంలా చూశాను. వాస్తవంగా జరుగుతున్నట్టుగా అనిపించింది. ఒక్కొక్క సినిమాని ఆణిముత్యం లాగా చేస్తూ ప్రేక్షకుల గుండెల్లో ఒక సుస్థిరమైన స్థానాన్ని ఏర్పరచుకున్న శేఖర్ కమ్ముల. స్టేట్ రౌడీ షూటింగ్ జరుగుతున్నప్పుడు శేఖర్ కమ్ముల నన్ను ఓ అభిమానిలా కలిశారు. ఆరోజే సినిమా ఇండస్ట్రీలో స్థిరపడిపోవాలని నిర్ణయించుకున్నారు. శేఖర్ కమ్ములను దర్శకుడిగా చూస్తుంటే నిజంగా నాకు చాలా గర్వంగా ఉంది. ఈ సిల్వర్ జూబ్లీ ఇయర్ సందర్భంగా ఆయనకి మరొకసారి నా అభినందనలు తెలియజేస్తున్నాను. శేఖర్ కమ్ముల సినిమాలు వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ఈ సినిమాల పాత్రలు కూడా దేవ దీపక్ అనే గుర్తు పెట్టుకుంటాం. నాగ్ అనుకున్నట్లుగా ఇది ఆయనకి మరో డోర్ ఓపెన్ అయింది. రష్మిక ఫెంటాస్టిక్‌గా పెర్ఫార్మ్ చేసింది. తన ఫస్ట్ సినిమా వచ్చినప్పుడు నేను గెస్ట్‌గా వచ్చాను. తను నేషనల్ కాదు ఇంటర్నేషనల్ క్రష్ అయిపోయింది. తన క్యారెక్టర్‌లో ఇంటెన్సిటీ ఈ సినిమాలో కనిపించింది. ఈ సినిమాలో సమీరా క్యారెక్టర్ చూసినప్పుడు చూడాలని ఉందిలో సౌందర్య గుర్తుకొచ్చింది. ఈ సినిమా మొత్తంలో తన క్యారెక్టర్ ట్రాన్స్ఫర్మేషన్ అద్భుతంగా ఉంది. ఈ సినిమాలో హృదయానికి హత్తుకుపోయిన క్యారెక్టర్ దేవ. ఈ క్యారెక్టర్‌కి ధనుష్ తప్ప ఇంకెవరూ చేయలేరు. అంత స్టార్ ఇమేజ్ ఉండి ఇలాంటి క్యారెక్టర్ చేయగలిగే యాక్టర్ ఎవరైనా ఉన్నారంటే అది ఇండియాలో ధనుష్ ఒక్కరే. అంత నేచురల్‌గా క్యారెక్టర్‌లో ఇమిడిపోయారు. ఈ సినిమాతో తనకి బెస్ట్ యాక్టర్ అవార్డు రావాలి. తనకి ఈ సినిమాకి అవార్డు వస్తే కనుక ప్రతి ఒక్కరికి గర్వకారణం. ఇందులో తల్లి మీద పాడిన పాట ఖైదీ 150లో నీరు నీరు పాటని మైమరిపించే లాగా అనిపించింది అని చిరంజీవి పేర్కొన్నారు. నాగార్జున మాట్లాడుతూ. చిన్న సినిమా పెద్ద సినిమా ఏదైనా కావచ్చు.. సపోర్ట్ చేయడానికి చిరంజీవి ఎప్పుడూ ముందుంటారు. అందుకే ఆయన్ని అందరూ ఇష్టపడతారు. ఆయన ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. ఇది శేఖర్ కమ్ముల ఫిల్మ్. థ్రిల్లర్‌తో హ్యూమన్ ఎమోషన్‌తో సినిమా చేయడం అనేది మామూలు విషయం కాదు. అది ఈ సినిమాతో కుదిరింది. ఈ సినిమాలో దీపక్ దేవా సమీరా ఇలా అన్ని పాత్రలే తప్పా స్టార్స్ కనిపించరన్నారు. ఈ సక్సెస్ మీట్‌లో హీరో ధనుష్, హీరోయిన్ రష్మిక మందాన, నిర్మాతలు సునీల్ నారంగ్, పుష్కర్ రామ్ మోహన్ రావు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిచే ‘హ్యాపీ జర్నీ’ పోస్టర్ రిలీజ్




ఫ్యూచర్ బ్రైట్ ఫిలిమ్స్ పతాకంపై హరిప్రసాద్ కోనే, ఇషాని గోష్ హీరో హీరోయిన్లుగా నిర్మించిన సినిమా హ్యాపీ జర్నీ. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో బిజీగా ఉన్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో చిత్ర దర్శకులు చైతన్య కొండ, నిర్మాత గంగాధర్ పెద్ద కొండ, కెమెరా మెన్ అరుణ్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఫిలిం జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ‘ ఈ కథ విన్న తర్వాతనే ఈ సినిమా పోస్టర్ రిలీజ్ చేయడానికి అంగీకరించాను. ఇలాంటి సినిమా చేసిన ఈ డైరెక్టర్‌ని అభినందిస్తున్నాను ప్రస్తుత పరిస్థితుల్లో సొసైటీలో అలజడులు పెరిగిపోయాయి. సామాజిక అంశాల పట్ల స్పృహ ఉన్న డైరెక్టర్, మంచి అభిరుచి ఉన్న నిర్మాతలు కలిసి ఇలాంటి సినిమాలు తీయడం అభినందనీయం. హిందీ తెలుగు భాషలలో విడుదల కానున్న ఇలాంటి సినిమాలకు నా వంతు సహకరిస్తాను అని బండి అన్నారు.

## ‘కన్నప్ప’ ఓవర్సీస్ థియేటర్ల జాబితా విడుదల




పాన్ ఇండియా’ సినిమాగా నిర్మించిన కన్నప్ప సినిమాను అమెరికాలో కూడా విడుదల చేస్తున్నారు. అమెరికాలో ఈ సినిమా ప్రదర్శించే థియేటర్ల లిస్ట్‌ను నిర్మాత మోహన్ బాబు మీడియాకు విడుదల చేశారు. విదేశాల్లో సైతం ఈ సినిమాపై ప్రేక్షకుల్లో నెలకొన్న ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని అమెరికాలో చాలా ఎక్కువ థియేటర్లలో విడుదల చేస్తున్నామని చెప్పారు. విజువల్ వండర్‌గా, భక్తిని పెంపొందించేలా ‘కన్నప్ప’ చిత్రాన్ని నిర్మించామన్నారు. ఇది విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ అని చెప్పారు. దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ తన విజన్ తో అద్భుతంగా తెరకెక్కించారన్నారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద తెరకెక్కించిన ఈ సినిమాను ఓవర్ సిస్‌లో జూన్ 26న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నామని మోహన్ బాబు తెలిపారు. ఓవర్సీస్ ఆడియెన్స్ కోసం ఈ చిత్రాన్ని వాసరా ఎంటర్‌టైన్‌మెంట్ భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నారని అన్నారు. థియేటర్ల జాబితా విడుదల కావడం, బుకింగ్‌లు ఓపెన్ అవ్వడంతో అక్కడ కన్నప్ప ట్రెండ్ అవుతోందని తెలిపారు. ఓవర్సీస్‌లో జూన్ 26న, ఇండియాలో జూన్ 27న కన్నప్ప భారీ ఎత్తున విడుదల చేస్తున్నామని మోహన్ బాబు పేర్కొన్నారు.

## ‘స్కై’ నుంచి ‘తపనే తెలుపగ..’ పాట విడుదల



మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి జంటగా నటిస్తున్న సినిమా ‘స్కై’. ఈ చిత్రాన్ని వేలార్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియోస్ బ్యానర్ లో నాగి రెడ్డి గుంటక, పృథ్వీ పెరిచెర్ల, శ్రీ లక్ష్మీ గుంటక, మురళీ కృష్ణంరాజు నిర్మిస్తున్నారు. పృథ్వీ పెరిచెర్ల దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో ఈ సినిమా రిలీజ్ కు రెడీ అవుతోంది. ‘స్కై‘ సినిమా నుంచి ‘తపనే తెలుపగ..’ లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ’తపనే తెలుపగ..’ పాటకు పృథ్వీ పెరిచెర్ల సాహిత్యం అందించగా గాయని వైష్ణవి ఆకట్టుకునేలా పాడారు. మ్యూజిక్ డైరెక్టర్ శివ ప్రసాద్ బ్యూటిఫుల్ మెలొడీ ట్యూన్‌తో కంపోజ్ చేశారు. ‘తపనే తెలుపగ పలుకే, ఉసురే నిలిపెను పిలుపే, మనవే వినగా మనసే, మదినే గుడిలా మలిచే, అలసిన సమయం జతగా, అనుమతి అడగక రావా, కురిసెను విరహం కనులా, రగిలిన హృదయపు సడిలో..’ అంటూ సాగుతుంది. ఈ పాట హీరో హీరోయిన్స్ మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టిపై కూల్ మెలొడీగా ఆహ్లాదకరమైన లొకేషన్స్‌లో ఈ పాటను చిత్రీకరించారు.

## ‘8 వసంతాలు’ సక్సెస్ మీట్




అనంతిక సనీల్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించిన 8 వసంతాలు సినిమా సక్సెస్ మీట్ సోమవారం ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా సక్సెస్ ఫుల్ గా థియేటర్లలో నడుస్తోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో నటి నటులు సాంకేతిక నిపుణులు మాట్లాడారు. హీరోయిన్ అనంతిక సనీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ సినిమాకి ఆడియన్స్ చాలా ప్రేమ ఇచ్చినందుకు ధన్యవాదాలు. సినిమాకి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. థియేటర్స్‌లో సినిమా చూస్తున్నప్పుడు చాలా గ్రేట్ ఫుల్‌గా అనిపించింది. ఇలాంటి మంచి టీంతో కలిసి పని చేయడం చాలా ఆనందంగా ఉంది. దర్శకుడు ఫణికి, మైత్రీ మూవీ మేకర్స్‌కి థాంక్ యూ. ఈ సినిమాలో నా క్యారెక్టర్‌కి ఆడియన్స్ నుంచి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వస్తుంది. చాలా కాంప్లిమెంట్స్ వస్తున్నాయి. ముఖ్యంగా ఫైట్ సీక్వెన్స్ గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు. ఫైట్ సీక్వెన్స్ కోసం చాలా రిహార్సల్ చేశాం. ఈ పాత్ర నా పర్సనల్ లైఫ్ కూడా చాలా చోట్ల కనెక్ట్ అయ్యింది. సినిమాకి అందరూ చాలా అద్భుతంగా కనెక్ట్ అవుతున్నారని అన్నారు.

## ‘పరమపద సోపానం’ టీజర్ ఆవిష్కరణ



‘అర్ధనారి’ ‘తెప్ప సముద్రం’ ‘వెడ్డింగ్ డైరీస్’ వంటి వైద్యమైన సినిమాలతో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ అంబటి, ‘బిగ్ బాస్’ రియాలిటీ షోతో ఫ్యామిలీ ఆడియన్స్‌కి మరింత దగ్గరయ్యారు. అర్జున్ అంబటి హీరోగా వస్తున్న తాజా సినిమా ‘పరమపద సోపానం’. జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ కథానాయికగా నటించిన ఈ సినిమాని ‘ఎస్.ఎస్.మీడియా’ సంస్థ పై గుడిమిట్ల సువర్ణలత సమర్పణలో గుడిమిట్ల శివ ప్రసాద్ నిర్మించారు. గుడిమిట్ల ఈశ్వర్ సహ నిర్మాత. స్టార్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన నాగ శివ ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. మాస్ మహారాజ్ రవితేజ ఈగల్’ వంటి భారీ బడ్జెట్ సినిమాతో సంగీత దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న దేవ్ జాండ్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. ప్రపంచవ్యాప్తంగా జూలై 11న గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో సోమవారం ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన కార్యక్రమంలో సినిమా టీజర్‌ను ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ ఆవిష్కరించారు.

## ఆగస్ట్ 30న దుబాయ్‌లో గామా అవార్డ్స్



ప్రతిష్టాత్మమైన గామా (గల్ఫ్ అకాడమీ మూవీ అవార్డ్స్) అవార్డ్స్‌కు టాలీవుడ్‌లో స్పెషల్ క్రేజ్ ఉంది. దుబాయ్‌లో ఇప్పటికే నాలుగు ఎడిషన్లు అంగరంగ వైభవంగా ఈ అవార్డుల వేడుక జరిగింది. తాజాగా 2025– 5వ ఎడిషన్ వేడుకలు ఆగస్ట్ 30న దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో జరుగనున్నాయి. దుబాయ్‌లో జరిగిన కెన్ ఫ్రా ప్రాపర్టీస్ ప్రారంభోత్సవ సందర్భంగా గామా 5వ ఎడిషన్‌కు సంబంధించిన థీమ్ సాంగ్‌ను లాంచ్ చేశారు. ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ ఈ పాటకు సాహిత్యం అందించారు. రఘు కుంచె సాంగ్ కంపోజ్ చేయడంతో పాటు తానే స్వయంగా పాడారు. ఆగస్టు 30న టాలీవుడ్ అవార్డ్స్‌తో పాటు ఆగస్టు 29న ఎక్సలెన్స్ అవార్డ్స్ వేడుకను నిర్వహించేలా భారీ సన్నాహాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి టాలీవుడ్ హీరోలు సిద్దు జొన్నలగడ్డ, తేజ సజ్జ, కిరణ్ అబ్బవరం, శ్రీ విష్ణు, రోషన్, హీరోయిన్స్ మీనాక్షి చౌదరి, దక్ష నాగర్కర్ తో పాటు తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి టెక్నీషియన్స్ పాల్గొంటారు. హీరోయిన్స్ ఊర్వశి రౌతేలా, కేతిక శర్మ, ఫరియా అబ్దుల్లా, ప్రియా హెగ్డే, శ్రీదేవి స్పెషల్ పెర్ఫార్మెన్స్ ఉంటుంది. ప్రత్యేక అతిధులుగా బ్రహ్మానందం, దర్శకులు సుకుమార్, బుచ్చిబాబు, బాబీ, సాయి రాజేష్, సంగీత దర్శకులు దేవిశ్రీప్రసాద్, తమన్, నిర్మాతలు అశ్విని దత్, డివివి దానయ్య, చంద్రబోస్, వెన్నెల కిషోర్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. 2024లో విడుదలైన చిత్రాల్లో నామినేట్ అయిన విభాగాలకు, పబ్లిక్ ఓటింగ్ ప్రక్రియ ద్వారా సెలెక్ట్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గామా అవార్డ్స్ చైర్మన్ త్రిమూర్తులు మాట్లాడుతూ ‘దుబాయ్‌లో జరిగే ఏకైక అతి పెద్ద వేడుక గామా అవార్డ్స్. గత నాలుగు ఎడిషన్లు ఘనంగా పూర్తి చేసుకున్నాం. ఆగస్ట్ 30న జరగబోయే 5వ ఎడిషన్‌ను కూడా తెలుగు వారు అందరూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి’ అని అన్నారు. ‘గామా అవార్డ్స్’ సీఈవో సౌరభ కేసరి మాట్లాడుతూ అతి పెద్ద పార్కింగ్ కలిగిన షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో 10 వేల మంది ఆసీనులు అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నాం అని తెలిపారు.

## గాంధీభవన్ ముందు జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి నిరసన

### యాదవులు, కురుమలకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్



ప్రజాపక్షం/హైదారబాద్ : రాష్ట్రంలో 40 లక్షలకు పైగా ఉన్న యాదవులు, కురుమలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని జాతీయయాదవ హక్కుల పోరాట సమితి నాయకులు కాంగ్రెస్ అదిష్టానాన్ని డిమాండ్ చేశారు. యాదవులు, కురమలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించడంతో పాటు యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేస తక్షణమే చైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేస్తూ జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం గాంధీభవన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలంటూ గాంధీభవన్ ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ బయటికి వచ్చి ఆందోళన కారులతో చర్చించి శాంతింపజేశారు. యాదవ సంఘం నాయకులు డిమాండ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని జాతీయయాదవ హక్కుల పోరాట సమితి నాయకులకు హామీ ఇచ్చారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ చిత్తశుద్ధితో కట్టుబడి ఉంది




మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదారబాద్ : బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ మొదలు మంత్రివర్గం మొత్తం చిత్తశుద్ధితో కట్టుబడి ఉందని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో సోమవారం ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, మత్స అభివృద్ధి సమాఖ్య చైర్మన్ మెట్టు సాయి కుమార్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 10 ఏళ్ల పాటు అధికారంలో ఉండి ఏనాడు బిసిలను పట్టించుకోని ఎంఎల్‌సి కవితకు బిసిల గురించి మాట్లాడే హక్కే లేదని తెలిపారు. బిసిల కోసం అనేక ఉద్యమాలు చేసిన విద్యార్థి ఎంపి ఆర్.కృష్ణయ్య అంటే మాకెంతో గౌరవం ఉందని, అలాంటి వ్యక్తి కవితతో కలిసి కూర్చుని ఆమెకు మద్దతు ఇవ్వాలని తన గౌరవాన్ని తక్కువ చేసుకోవద్దని ఓ తమ్ముడిగా కోరుతున్నామని మంత్రి పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటికే బిసి బిల్లును అసెంబ్లీలో అమోదింపచేసుకుని గవర్నర్‌కు పంపడంతోపాటు ఈ బిల్లును కేంద్రానికి సైతం పంపించామని తెలిపారు. ఈ బిల్లు ఆమోదం కోసం ఎంపి ఆర్.కృష్ణయ్య ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అపాయింట్ మెంట్ తీసుకోవాలని అందరం కలిసి ప్రధాని కలుద్దామన్నారు. బిసి బిల్లుకు రాజకీయ రంగు పులమడం సరికాదని, చేతనైతే బిసిల కోసం అందరూ కలిసి కట్టుగా మద్దతు ప్రకటించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

## ప్లాట్ల ధరలు (మొదటి పేజీ తరువాయి)

ప్లాట్లను (ప్లాట్స్) కూడా సుమారు రూ.4.50 కోట్లకు పైగా బహిరంగ వేలంలో దక్కించుకునేందుకు పోటీపడగా, చింతల్ ప్రాంతంలోని ప్లాట్లను కూడా కోట్లాది రూపాయలతో కొనుగోలు చేశారు. 11 ప్లాట్లను వేలం వేస్తే ఇందుకు రూ.65.02 కోట్ల ఆదాయం వచ్చిందని హౌజింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, హౌజింగ్ కమిషనర్ వి.పి.గౌతం తెలిపారు. హైదరాబాద్ నగరంలోని చింతల్, గచ్చిబౌలి,నిజాంపేట తదితర ప్రాంతాల్లో వివిధ రకాల ప్లాట్లకు హౌజింగ్ బోర్డు అధికారులు కూకట్ పల్లిలోని కెపిహెచ్ బి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. చింతల్ ప్రాంతంలో 266 చదరపు గజాల విస్తీర్ణంలోని రెసిడెన్షియల్ ప్లాట్లు, గచ్చిబౌలి ప్రాంతంలో కమర్షియల్ ప్లాట్లు, నిజాంపేటలో 413 చదరపు గజాల ప్లాట్లకు వేలం వేశారు. ఈ వేలం పాటలో 55 మంది పాల్గొన్నారు. గచ్చిబౌలి ప్రాంతంలో 3271 చదరపు గజాల భూములు, చింతల్ ప్రాంతంలో 799.98 చదరపు గజాలు, నిజాంపేటలో 1653 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ప్లాట్ల వేలంలో బోర్డుకు రూ.65.02 కోట్ల ఆదాయం వచ్చింది.

### ‘గచ్చిబౌలి భూముల’ వేలంలో రూ.56 కోట్లు

గచ్చిబౌలి హౌజింగ్ బోర్డు కాలనీలో ఉన్న 1487 గజాల కమర్షియల్ స్థలానికి గజానికి రూ.2.22 లక్షల చొప్పున సుమారు రూ. 33 కోట్లకు కొనుగోలు చేశారు. ఈ భూములకు చదరపు గజానికి రూ 1.20 లక్షలను ఆఫ్ సెట్ ధరగా నిర్ధారించగా, వేలం పాటలో ఇది రూ 2.22 లక్షలు పలికింది. ఇదే ప్రాంతంలోని 1200 గజాల పాఠశాల భూములకు ఆఫ్ సెట్ ధర చదరపు గజానికి రూ 80 వేలుగా నిర్ధారించగా, వేలంలో ఈ భూములకు రూ 1.12 లక్షలకు కొనుగోలు చేశారు. రెండు ఎంఐజి ప్లాట్లను చదరపు గజం రూ.1.86 లక్షలు, రూ. 1.32 లక్షల ధరలు పలికాయి. ఒక్క గచ్చిబౌలి ప్రాంతానికి సంబంధించిన భూముల ద్వారానే రూ.55,56,84,000 ఆదాయం సమకూరినట్టు హౌజింగ్ బోర్డ్ తెలిపింది.

### చింతల్ భూముల రేట్లు ఆకాశానికే..

కుత్బుల్లాపూర్ మండలంలోని చింతల్ ప్రాంతంలోని హౌజింగ్ బోర్డు ఎంఐజి ప్లాట్లకు కూడా అత్యధిక ధరలకు విక్రయించారు. ఈ ప్రాంతంలో మొత్తం పది ప్లాట్లను వేలం వేయగా, ఇందులో ప్లాట్ నెం.113,114,115ల ద్వారానే సుమారు రూ 8.11 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. నిజాంపేట బాచుపల్లిలోని నాలుగు ప్లాట్లకు సుమారు రూ.70 లక్షలకు వేలం పాటలో కొనుగోలు చేశారు.

## గాలిలో ఉండగా ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం

న్యూఢిల్లీ : ఎయిర్ ఇండియా విమానాలకు సాంకేతిక సమస్యలు తప్పడం లేదు. తాజాగా మరో ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ఢిల్లీ టూ జమ్మూ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు సోమవారంనాడు ఈ పరిస్థితి తలెత్తింది. ఐఎక్స్ 2564 విమానం ఢిల్లీ నుంచి జమ్ముకు బయలుదేరిన కొద్ది సేపటికే విమానంలో సాంకేతిత లోపం గుర్తించారు. దీంతో విమానాన్ని తిరిగి ఢిల్లీకి మళ్లించారు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రతినిధి ఒకరు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. సాంకేతిక లోపం కారణంగా ఢిల్లీ విమానం వెనక్కి రావడంతో ప్రత్యామ్నాయంగా జమ్మూకు మరో విమానాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

## ఉసూరుమనిపించి

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 22వ తేదీ నాటికే రైతులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 20 లక్షల ఎకరాల వరకు పత్తి, సోయాబిన్ 12 లక్షల వరకు పంటలు వేశారు. అదేవిధంగా పెసరు, కందులు తదితర పంటలకు సంబంధించి దాదాపుగా మరో 2లక్షలు ఎకరాలు, మొక్క జొన్న సుమారు 60వేల ఎకరాలలో ఇప్పటికే పంటలు వేశారు. మరోవైపు రాష్ట్రంలోని ప్రధాన పంట అయిన వరి నారుమళ్లను రైతులు సిద్ధం చేసుకుని వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే వర్షాల పరిస్థితి ఇలాగే కొనసాగితే అందరికంటే ఎక్కువగా పత్తి పంటలు తీవ్రంగా నష్టపోనున్నట్లు రైతులు చెబుతున్నారు.

### మొహం చాటేసిన వర్షం

ముందు మురిపించిన వర్షం ఆ తర్వాత మొహం చాటేయడంతో రైతన్నలు ఇక్కట్లు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల1వ తేదీ నుంచి 22వతేదీ వరకు సాధారణంగా 93.3 మి.మి. వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అయితే వాతావరణ శాఖ అధికారులు ప్రకటించినట్లుగా విస్తారంగా వర్షం కురువక పోగా, అందులో 50 శాతం 53.4 మిమి వర్షం మాత్రమే నమోదైంది. ఇది సాధారణ వర్షపాతం కంటే 43 శాతం తక్కువ కావడంతో భూమిలో విత్తిన పత్తి విత్తనాలు భూమిలోనే మగ్గి పోతున్నాయి.

### కౌలు రైతులకు తీవ్ర నష్టం

ఒక్క ఎకరానికి కౌలు దాదాపు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఉండగా నీటి సౌకర్యం లేని ప్రాంతాల్లో మాత్రం రూ.10 వేలు, నల్ల రేగడి భూములకు ఎకరాకు రూ.30 వేల వరకు ఉంది. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని గత ఏడాది కంటే భూ యాజమానులు, కౌలు ధరలు పెంచినప్పటికీ కౌలు రైతులు వానలను నమ్ముకుని కౌలు చెల్లించి పంటలను వేసుకున్నారు. వానలు రాక ఒక్కసారిగా పరిస్థితి మారడంతో వీరి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కౌలు రూ.20 వేలతో పాటు విత్తనాలు, ఎరువులు, దుక్కులు ఇతరత్రా కలుపుకుని పెట్టుబడి ఖర్చు ఎకరాకు రూ. 30 వేలను కలుపుకుంటే దాదాపు రూ. 50వేలకు చేరుతుంది. సకాలంలో వర్షాలు కురవకపోతే రైతులు, ముఖ్యంగా కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం నెలకొంది.

## నరమేధం వెంటనే ఆపాలి




(మొదటి పేజీ తరువాయి)

పాటు అమాయక ఆదివాసీల నెత్తురు ఏరులై పారుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరు నెలలుగా ఏకధాటిగా కొనసాగుతున్న కూంబింగ్‌లతో ఆదివాసీ గూడాలకు కంటిమీద కునుకు లేకుండా పోయిందన్నారు. మావోయిస్టు రహిత భారత్ కోసమంటూ చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో మానవ హక్కులనలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతుందని మండిపడ్డారు. చర్చలకు వస్తామని చెప్పినా, చర్చలకు కేంద్ర ప్రభుత్వం ముందుకురాకుండా మారణ హోమం కొనాసాగిస్తోందన్నారు. అడవుల్లో మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ఉన్న ఖనిజ నిక్షేపాలు, ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్‌లకు అటవీ సంపదను దోచి పెట్టేందుకే కేంద్ర సర్కార్ నరమేధం కొనసాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛత్తీస్‌గడ్‌లో బొగ్గు, ఇనుము, సున్నపు రాయి, డోలమైట్, బాక్సైట్స్ నిక్షేపాలకు ప్రసిద్ధి గాంచిందన్నారు. దేశంలో టిన్ ఖనిజాన్ని ఉత్పత్తి చేసే ఏకైక రాష్ట్రం ఇదేనన్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపదపై దేశ బడా కార్పొరేట్ల కన్నుపడిందని, ఈ ఏడాది జనవరిలో ఏడువేల ఎకరాల్లో 4, 13వ ఖనిజ బ్లాకుల వేలానికి సిద్ధమయ్యాయన్నారు. ఈ ఖనిజ తవ్వకాలతో ఎక్కువ నష్టం జరిగేది అక్కడ నివసించే ఆదివాసులకే అన్నారు. అడవివి, వారిని విడదీసి చూడలేమన్నారు. ఈ తెగలను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వం అనేక కుట్రలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. దేశ సంపద ప్రజలందరికీ చెందాలే తప్ప బడా పెట్టుబడిదారీ కార్పొరేట్‌లకు కాదన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 21 జీవించే హక్కును కాలరాస్తున్న నరేంద్ర మోదీ విధానాలను మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకువెళ్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర సమితి నాయకులు బిజ్జ శ్రీనివాసులు, టి. సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, మర్రి శ్రీమాన్, చేపూరి కొండల్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.బాలకృష్ణ, చిలుక రాజ్, శ్రీను, సల్మాన్ బేగ్, శివ కుమార్, మహమూద్, మాజీద్, కొండూరి వెంకటేష్, అశోక్, బిచ్చల శ్రీనివాస్, హేమంత్, నయీమ్, అశోక్, వెంకటేశ్, సురేష్, మధు, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

### అరెస్టు అయిన ఎఐవైఎఫ్ నేతలను పరామర్శించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి.నరసింహ

ఆపరేషన్ కగార్‌ను ఆపాలని ఎఐవైఎఫ్ చేపట్టిన రాజ్ భవన్ ముట్టడిలో అరెస్టు అయిన నాయకులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎఐవైఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు ఈ.టి. నరసింహ పరామర్శించారు. హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఎఐవైఎఫ్ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ఈ.టి.నరసింహ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులు, గిరిజనులపై చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్‌లన్ని ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. అరెస్టు చేసిన ఎఐవైఎఫ్ నాయకులను బేషరతుగా విడుదల చేయాలని ఈటి పోలీసులను డిమాండ్ చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com